హోటల్ ట్రేడ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

శ్రీకాకుళం అర్బన్: జిల్లాలోని హోటళ్లు ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. హోటళ్లు, లాడ్జీలు, రెస్టారెంట్లు, వెల్‌నెస్ సెంటర్లు, ట్రావెల్ ఆపరేటర్స్ ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పర్యాటకశాఖ ముఖ్య కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. ట్రేడ్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే రాష్ట్ర ప్రభుత్వ సర్టిఫికెట్‌తో పాటు కేంద్ర ప్రభుత్వ స్వాతి, నిధి సర్టిఫికేట్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ సర్టిఫికెట్ పొందిన వారికి పర్యాటక ప్రయోజనాలు చేకూరుతాయని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లు, లాడ్జీలు, గెస్ట్‌హౌస్‌లకు రూ.300, హోం స్టేలు, ఫాం స్టేలకు రూ.200, టూర్ బోటు ఆపరేటర్స్, ఎడ్వంచర్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్ ఆపరేటర్లకు రూ.500, వెల్‌నెస్ట్ సెంటర్లు, కన్వెన్షన్ హాలు, సర్వీస్ అపార్టుమెంట్స్ రూ.500 చెల్లించి www.aptourism.gov.in వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషను చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు జిల్లా పర్యాటక అధికారి ఫోన్ నంబర్లు 6309942033, 8919168306 సంప్రదించాలని తెలిపారు.

మండుటెండలో 'ఉపాధి' కూలీలు



- వేసవి సన్నద్ధం లేక ఇబ్బందులు
- పని ప్రదేశాల్లో నిలువ నీడ కరవు
- తాగునీటికి నోచుకోక ఇబ్బందులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉదయం 9గంటలకే ఎండ తీవ్రమవుతోంది. వారిది నాలుగు గోడల మధ్య చేసే శ్రమ కాదు. కఠిన మైన మండుటెండలో పని చేయాల్సిందే. పని ప్రదేశాల్లో నీడలేదు సరికదా వెంట తెచ్చుకున్న గుక్కెడు మంచినీరు క్షణాల్లో అయిపోతున్నాయి. ఆ తర్వాత తడారిన గొంతులతో దిక్కులు చూడాల్సి వస్తోంది. ఒంట్లో ఉన్న సత్తువ చెమట దారల్లో కలిసి పొడి బారిన భూమిలో గునపం దిగక శ్రమనంతా కూడబెట్టి శ్రమిస్తున్న దయనీయ పరిస్థితి ఉపాధి కూలీలది. పనులు చేసే చోట కనీస అవసరాలు కరవవుతున్నాయి. చెమట తుడుచుకునే బట్టలే తలపై వేసుకుని సేదతీరుతున్నారు. వేసవి సదన్నద్ధత క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించడం లేదు. ఫలితంగా ఉపాధి కూలీలు ఎక్కడ వడదెబ్బకు గురవుతారో అన్న ఆందోళన వారి కుటుంబాల్లో వ్యక్తమవుతోంది. ఏటా ఉపాధి పని ప్రదేశాల నుంచి తిరుగు ముఖంలో వడదెబ్బకు గురై మృతి చెందిన ఘటనలు జిల్లాలో చోటు చేసుకుంటున్నాయి. అయినా పని ప్రదేశాల్లో మాత్రం సౌకర్యాలు మెరుగు పడడం లేదు.

మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో జలసంరక్షణ, నర్సరీలు, ప్రభుత్వ స్థలాలు, పొలం గట్లపై మొక్కల పెంపకం, చిన్న నీటి కాల్వల మరమ్మతులు వంటి పనులు మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా 30 మండలాల్లో లక్షలాది మందికి జాబ్ కార్డులు ఇచ్చారు. ఉపాధి పనులు గుర్తించి క్షేత్రస్థాయిలో పనులు అప్పగించారు. అయితే పని చేస్తున్న ప్రదేశాల్లో వసతుల కల్పనలో యంత్రాంగం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో టెంట్లు, ప్రథమ చికిత్స సామాగ్రి, మజ్జిగ, మంచినీరు వంటి సైకర్యాలు పని ప్రదేశాల్లో ఉండేవి. ఇప్పుడు వాటి జాడ కనిపించడం లేదు. వడగాల్పుల ముప్పుపై భారత వాతావరణశాఖ హెచ్చరిస్తోంది. తాగునీరు, ఒఆర్ఎస్, షెల్టర్లు ఉంచాలని ప్రభుత్వాలు చెపుతున్నా క్షేత్ర స్థాయిలో అవేవీ కనిపించడం లేదు.

ఉపాధి పనులను నేషనల్ మొబైల్ మానరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) యాప్ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. ఈ యాప్ ఉదయం 7గంటలకు ఓపెన్ అవుతుంది. మేట్లు తనకు కేటాయించిన 50 మంది కూలీలను అయిదు బృందాలుగా విభజించి పని ప్రాంతం వద్ద వారందరి ఫొటో తీయాలి. ఉదయం ఏడు గంటలకు, మధ్యాహ్నం 11 గంటలకు మళ్లీ మరో సారి ఫొటో తీసి యాప్‌లో నమోదు చేయాలి. ఇలా చేస్తేనే ఆ రోజు కష్టానికి కూలీలకు వేతనాలు అందేది. ఎండ తగిలిందనో... నీరసంగా ఉందనో నిష్క్రమిస్తే చేతికొచ్చేది. ఏమీ ఉండదు. పని ప్రదేశాల దగ్గర ఫోన్లు పనిచేయకపోతే ఈ ఫొటోలు తీయడంలో జాప్యం తప్పడంలేదు.

సదుపాయాలు లేవు

ఉపాధి పనిచేసే కూలీలకు వేసవిలో మూడేళ్ల క్రితం వరకు కొన్ని భత్యాలు అందేవి. సాధారణ రోజుల్లో 100 శాతం పనిచేస్తే ఇచ్చే మొత్తాన్నే.. వేసవిలో 80శాతం చేస్తే ఇచ్చేవారు. దీంతో 80 శాతం పనిచేసినా 100 శాతం వేతనం వచ్చేది. టెంట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు, ఇతర సామగ్రి అందించేవారు. మజ్జిగ కోసం ఒక్కో కూలీకి రూ. 8. అయిదు లీటర్ల మంచినీళ్లకు రూ.5, గునపాల పదునుకు రూ.10 ఇచ్చేవారు. ఇప్పుడవేవీ లేవు. కూలీలు అందరినీ ఒకేలా పరిగణించి కొలతలు ఇవ్వడంతో వద్దులకు అవస్థలు తప్పడం లేదు. గతంలో టిసిఎస్ సాఫ్ట్‌వేర్‌లో పక్రియ మొత్తం సాగేది. ఇప్పుడు ఎన్ఎస్ఐసిలోకి మారడంతో కొన్ని సౌలభ్యాలు అందడం లేదని ఉపాధి కూలీలు చెపుతున్నారు.

వేసవి వెసులుబాటు లేదు



గతంలో వేసవిలో 80శాతం పనిచేస్తే వందశాతం భతి కల్పించే వెసులుబాట్లు ఇప్పుడు లేవు. ఒక్కో వ్యక్తికి గరిష్ట వేతనం రూ.257 నుంచి రూ.272కి చేస్తూ ఈ నెల 1 నుంచి పెంచాం. జిల్లాలో 20 మండలాల్లో 385 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు సాగుతున్నాయి.

-జివి చిట్టిరాజు, డ్వామా పీడీ

'నీలమణి' ఉత్సవాలకు పక్కా ఏర్పాట్లు

- ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పాతపట్నంలో ఈనెల 21 నుంచి 30వ తేదీ వరకు పది రోజుల పాటు నిర్వహించనున్న నీలమణి దుర్గమ్మ అమ్మవారి ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. ఉత్సవాల నిర్వహణపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక సంఖ్యలో తరలివచ్చే ఈ ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

పది రోజుల పాటు పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని ఆదేశించారు. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా నిరంతరాయంగా తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రవాణా, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ శాఖల సమన్వయంతో కంట్రోల్ రూమ్‌ను నిర్వహించాలన్నారు. యాత్రికులకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పండగలు విజయవంతమయ్యేలా కమిటీ సభ్యులు, అధికారులు బాధ్యత వహించాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఉత్సవాలకు పరిసర మండలాలు, గ్రామాలలలో పాటు ఇతర ప్రాంతాల నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటిపై దృష్టిసారించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, జిల్లా అగ్నిమాపక అధికారి వీరభద్రరావు, పాతపట్నం సర్పంచ్ జోగారావు, ఆలయ కమిటీ సభ్యులు, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో వైసిపికి బుద్ధి చెప్పాలి

టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసి, ప్రజలపై భారాలను మోపుతున్న వైసిపి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని విమర్శించారు. రాష్ట్రాన్ని దోచుకుతింటున్నారని ధ్వజమెత్తారు. వైసిపి నేర చరిత్ర గల పార్టీ అని, పార్టీ అధినేత జగన్‌తో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై 400 క్రిమనల్ కేసులు ఉన్నాయన్నారు. వివేకా హత్య కేసులో చంద్రబాబుపై బురద జల్లిన వారే ఇప్పుడు జైలు వైపు అడుగులు వేస్తున్నారని చెప్పారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. వైసిపి ఆగడాలకు వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు పి.ఎం.జె బాబు, సింతు సుధాకర్, తోణంగి వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

అరసవల్లికి పెరిగిన రద్దీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వైశాఖ మాసం రెండో ఆదివారం కావడంతో అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి యాత్రికులు పోటెత్తారు. జిల్లాలోనే కాక ఇతర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. సూర్యోదయం నుంచి క్యూలైన్లలో బారులు తీరారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నా సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధాన ద్వారం ఎదురుగా ప్రాంగణంలో షెడ్డు నిర్మాణం వల్ల యాత్రికులకు కొంత ఊరట లభించింది.



అరసవల్లి ఆలయ ప్రాంగణంలో రద్దీ

అరసవల్లికి పెరిగిన ఆదాయం

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి యాత్రికులు పోటెత్తడంతో ఆలయానికి భారీగా ఆదాయం సమకూరింది. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.7,98,800, విరాళాల రూపంలో రూ.68,076, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.3.20 లక్షలు ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

నేడు పాలకమండలి సమావేశం

ఆలయానికి ఇటీవల ప్రభుత్వం కొత్తగా నియమించిన పాలకమండలి సర్వసభ్య సమావేశం ఆలయ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించనున్నట్లు ఇఒ హరి సూర్యప్రకాష్ తెలిపారు. నూతన చైర్మన్, శాశ్వత ధర్మకర్తలి మండలి చైర్మన్ ఇప్పిలి జోగిసన్యాసిరావు, ప్రధాన అర్చకులు ఇ.శంకర శర్మతో పాటు పాలకమండలి సభ్యులు సమావేశానికి హాజరు కానున్నట్లు తెలిపారు.

నిర్బంధాలు సరికాదు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విశాఖ నగరంలో సోమవారం నిర్వహించ తలపెట్టిన సిపిఎస్ రద్దు పోరాటానికి హాజరు కాకూడదని పోలీసులు నోటీసులు ఇవ్వడాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిషోర్ కుమార్ తీవ్రంగా ఖండించారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నాయకులకు పోలీసులు ఆదివారం నోటీసులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పోరాటానికి నిర్బంధాన్ని అమలు చేస్తోందని ధ్వజమెత్తారు. ఉద్యమాలను అణచివేస్తే రెట్టింపు ఉత్సాహంతో ముందుకు వెళ్తామన్నారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోపు సిపిఎస్‌ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చలేదని విమర్శించారు. సిపిఎస్ రద్దు కోరుతూ చేపడుతున్న ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు.



యుటిఎఫ్ నాయకులకు నోటీసులు అందజేస్తున్న పోలీసులు

మత విద్వేషాలను సృష్టిస్తున్న బిజెపి

- బిజెపి హఠావో, భారత్ బచావో పేరిట ఉద్యమం
- భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షులు సి.భాస్కరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బిజెపి దేశంలో మత విద్వేషాలను సృష్టిస్తోందని భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షులు సి.భాస్కరరావు విమర్శించారు. నగరంలోని ఇలిసిపురంలో గల అంబేద్కర్ విజ్ఞాన్ మందిరంలో భారత్ బచావో సన్నాహక కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత విశ్వాసాలను విద్వేషాలుగా మార్చి ప్రజల మధ్య చిచ్చు పెడుతోందన్నారు. మతాన్ని అడ్డు పెట్టుకుని మెజార్టీ ఓటు బ్యాంకుతో అధికారాన్ని నిలుపుకోవాలని చూస్తోందని చెప్పారు. 1925లో దేశంలోని ముస్లింలు, అంబేద్కర్‌వాదులు, కమ్యూనిస్టులు తమ ప్రధాన శత్రువులని ప్రకటించిన ఆర్ఎస్ఎస్ ప్రకటించిందని తెలిపారు. ఈ వందేళ్ల కాలంలో అనేక మతకల్లోలాలు సృష్టించి దేశంలో అధికారాన్ని కైవసం చేసుకుని భారత రాజ్యాంగాన్ని మార్చే పనిలో నిమగ్నమైందని విమర్శించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో లౌకిక ప్రజాస్వామ్యశక్తులు, ప్రజాసంఘాలు, పార్టీలు ఐక్యమై సంఘ పరివార్ రాజకీయ విభాగమైన బిజెపిని పారదోలడం ద్వారానే దేశాన్ని రక్షించుకోగలమన్నారు. ఆ దిశగా ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. పేడాడ పరమేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో డిటిఎఫ్ నాయకులు కోత ధర్మారావు, బిసి సంక్షేమ సంఘం నాయకులు పి.చంద్రపతిరావు, ఐలు నాయకులు బొడ్డేపల్లి మోహనరావు, సమతా సైనికదళ్ నాయకులు ఎన్.అప్పారావు ఐఎఫ్‌టియు నాయకులు డి.గణేష్ మానవ హక్కుల వేదిక నుంచి కె.వి జగన్నాథం, ముస్లిం మైనార్టీల నుంచి సయ్యద్ బేగ్, మహ్మద్ అమీర్, మహమ్మద్ సాను కెవిపిఎస్ నాయకులు మిస్క కృష్ణయ్య, బెలమర ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సన్నాహక కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పేడాడ పరమేశ్వరరావు, సభ్యులుగా కె.వి జగన్నాథం, పి.చంద్రపతిరావు, బత్తిన హేమారావు, మిస్క కృష్ణయ్య, చౌదరి లక్ష్మణరావు, నాగభూషణం, పార్వతీశం, కె.ధర్మారావు ఎన్నికయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కరరావు

నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ

- పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి
- జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకటరామన్


ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



గ్రామాల్లో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేడుతున్నట్లు జెడ్‌పి సిఇఒ రావాడ వెంకటరామన్ తెలిపారు. తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలు, 15వ ఆర్థిక సంఘం నిధులు, స్వచ్ఛ సంకల్పం అమలు తీరు, జిల్లాలో ప్రస్తుత అవసరాలు, తీసుకుంటున్న చర్యలు, జగనన్న ఇళ్ల కాలనీల నిర్మాణం, తదితర అంశాలపై ఆయన ప్రజాశక్తితో ముఖాముఖిలో మాట్లాడారు.

జిల్లాలో నీటి ఎద్దడి నివారణ ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జిల్లాలో గ్రామీణ నీటిసరఫరా విభాగం ద్వారా తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించాం. అందులో భాగంగా తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. గ్రామాల్లో బోర్లు మరమ్మతుకు గురైతే వెంటనే వాటిని బాగు చేసేందుకు వీలుగా ఆర్థిక సంఘం నిధులతో విడి భాగాలను కొనుగోలుకు వీలుంది. నిధులు లేని ప్రాంతాలకు జెడ్‌పి నుంచి సహకారం అందించేందుకు జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ అంగీకరించారు. అందులో భాగంగా పారిశుధ్య నిర్వహణ, తాగునీటి ఎద్దడి నివారణకు జిల్లాలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పనులు చేపడుతున్నాం. ఇప్పటికే కొన్ని మండలాల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. వాటిని పరిశీలించి ఆమోదం తెలిపేందుకు చర్యలు చేపడుతున్నాం.



ఉపాధి హామీ నిధులతో మంజూరు చేస్తున్న కన్వర్జెన్సీ పనులు ఏ మేరకు పూర్తయ్యాయి?

జిల్లాలో ఉపాధి హామీ చట్టం అమలు సమర్థవంతంగా సాగుతోంది. ఈ పథకం కింద అనేక అభివృద్ధి పనులు చేస్తున్నాం. ఈ ఏడాది 50 లక్షల పనిదినాల కల్పన లక్ష్యంగా పనులు చేపట్టాటం. గ్రామాల్లో పనులు గుర్తించడం మొదలు నాణ్యమైన పనులు చేపట్టడమే లక్ష్యంగా ముందుకెళ్తునాం. వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో పనులు చేపడుతున్నాం. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాల్సి ఉంది. గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించడం జరుగుతోంది. గ్రామ సచివాలయ భవనాలు, ఆర్‌బికెలు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణం పనులు మంజూరు చేస్తున్నాం. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి. ఇప్పటికే కొన్ని చోట్ల పనులు పూర్తి చేయడం జరిగింది. భవనాలు అందుబాటులోకి వచ్చాయి. పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి అన్ని రకాల చర్యలూ తీసుకుంటున్నాం.

15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం ఎలా ఉంది?

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ఉన్న ప్రియా సాఫ్ట్‌వేర్‌కు బదులు కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా ఒకే విధానాన్ని అమలు చేస్తున్నాం. అందువల్ల ఈ గ్రామ స్వరాజ్యం పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చాం. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఈ ప్రొఫైల్‌ను కొత్తగా మార్పు చేయడం వల్ల మొదట్లో కొన్ని సాంకేతిక సమస్యలు ఉత్పన్నమైనా ప్రస్తుతం సమర్థవంతంగా గ్రామ స్వరాజ్యం పోర్టల్‌ను మాత్రమే వినియోగిస్తున్నాం.

జగనన్న ఇళ్ల కాలనీల నిర్మాణం ఎలా సాగుతోంది. ?

జగనన్న ఇళ్ల కాలనీల్లో మౌలికవసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. ఇంజినీరింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడిఒలు, తహశీల్దార్లతో పాటు గృహ నిర్మాణ శాఖ పర్యవేక్షణలో పనులు చేపడుతున్నాం. కొన్ని ఏజెన్సీల పర్యవేక్షణలో సాగుతున్న ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి క్లోజ్డ్ మోనటరింగ్ వ్యవస్థ పని చేస్తోంది. మండల స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలను అనుసరించి జిల్లా స్థాయిలో వారం వారం సమీక్ష జరుగుతోంది. పనుల్లో వేగం పెంచడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. వీటికి నిధుల కొరత లేదు.

స్వచ్ఛ సంకల్పం అమలు తీరు ఏవిధంగా ఉంది?

స్వచ్ఛ సంకల్పం కార్యకలాపాలు ఆపకుండా నిరంతరం కొనసాగించాల్సి ఉంటుంది. ఎండ్ టు ఎండ్ పొందడానికి 632 గ్రామ పంచాయితీల షెడ్‌లను పూర్తి చేయాల్సి ఉంది. స్థలాలు సిద్ధంగా ఉన్న గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులు ఇవ్వడం జరుగుతోంది. పరిశుభ్ర గ్రామాల సాధనకు కృషి జరగాలి. అన్ని గ్రామ పంచాయతీలలో జగనన్న స్వచ్ఛ సంకల్పం చిత్తశుద్ధితో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికార్లతో పాటు ఎంపిడిఒలు, ఎంసిఆర్‌డిలు సమన్వయంతో క్షేత్రస్థాయి పరిశీలన చేశాం. చెత్త సేకరణతోపాటు తడిపొడి చెత్త విభజించి షెడ్లలో వాటిని ఆదాయ వనరులుగా మార్చడానికి చర్యలు చేపట్టాం. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాం. రీసైక్లింగ్ ఉన్న కవర్లనే వాడాలన్న కచ్చితమైన నిబంధనను అమలు చేస్తున్నాం. అయితే క్షేత్రస్థాయిలో ప్రజలు సహకరిస్తే ప్లాస్టిక్ వాడకాన్ని శతశాతం అడ్డు కునేందుకు వీలవుతుంది. ఆ దిశగా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం.

గ్రామ సచివాలయాల్లో సేవల మెరుగునకు ఎలాంటి చర్యలు చేపట్టారు?

జిల్లాలో గ్రామ సచివాలయాల వ్యవస్థ ప్రజలకు మరింత దగ్గరైంది. ఏ పని కావాలన్నా సచివాలయానికి వెళ్లాలన్న ఆలోచన ప్రజల్లో రావడం వల్ల గ్రామీణ ప్రాంతాలకు ప్రభుత్వ సేవలు మరింత దగ్గరయ్యాయి. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుని ఇంటికే అందించడం జరుగుతోంది. ప్రజలకు ఏ చిన్న సమస్య ఎదురైనా సచివాలయం స్థాయిలో పరిష్కరించుకునేందుకు వీలుంది. అక్కడ ఉద్యోగులు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు. ఎక్కడైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే తక్షణమే విచారణ చేపట్టి, చర్యలు తీసుకుంటున్నాం.

పారిశుద్ధ్యం మెరుగునకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చెత్త సేకరణపై దృష్టి సారించాం. మండల స్థాయిలో ఎంపిడిఒలకు ఇప్పటికే పారిశుధ్య నిర్వహణకు అనేక రకాలైన సూచనలు చేశాం. జిల్లాలో పేజ్1, 2 కింద 76 గ్రామాలను ఎంపిక చేసి, పారిశుధ్యం మెరుగుపర్చడంతో పాటు వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ఆదర్శ గ్రామాలుగా తీర్చి దిద్దడానికి ఎంపిక చేశాం. నూటికి నూరుశాతం ఒడిఎఫ్ సాధించడానికి కృషి జరుగుతోంది. వారి భాగస్వామ్యంతో పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలి. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో భాగంగా చెత్త సేకరణ సాగుతోంది. పర్యావరణానికి హాని తెచ్చి పెడుతున్న ప్లాస్టిక్‌ను గ్రామాల్లో వాడాకాన్ని తగ్గించాలి.



ఘనంగా సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం గ్రామ దేవత శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారు సంబరాలు సందర్భంగా ఏర్పాట చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివారం రాత్రి లాంచనంగా ఆలయ అభివృద్ధి కమిటీ ప్రాంభించింది. గ్రామ దేవత ఆలయానికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో జ్ఞాన భారతి విద్యా సంస్థల కార్యదర్శి జోహార్ ఖాన్ ఆర్థిక సహకారంతో నిర్మించిన వేదికపై అధునాతన సౌండ్ సిస్టంతో సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రముఖ వ్యాపావేత్తలు దేవరపల్లి గోపాల్, మాటూరి కిషోర్, ఉప్పిలి నగేష్ ఆర్థిక సహకారంతో పద్మశ్రీ అవార్డ్ గ్రహీత వై.గోపాల్ బృందంతో సత్య హరిచంద్ర నాటిక ప్రదర్శన నిర్వహించారు. ప్రోగ్రాం స్టేజ్ వద్ద ఆలయ అభివృద్ధి కమిటీ జ్యోతిని వెలిగించి, సాంస్కృతిక కార్యక్రమాలు లాంఛనంగా ప్రారంభించారు.

ఈ కార్యక్రమాలు దాతలు సహకారంతో మే 15వరకు నిర్వహించడం జరుగుతుందని ఆలయ అభివద్ధి కమిటీ తెలిపింది. విశాలమైన మైదానంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సిఐ ఈశ్వర్ చంద్ర ప్రసాద్ అధ్వర్యంలో పట్టణ ఎస్ఐ గోవిందరావు, పట్టణ పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

'కణితి' సేవలు మరువలేనివి

పశుసంవర్థకశాఖ మంత్రి అప్పలరాజు



పలాసలో కణితి చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

డాక్టర్ కణితి విశ్వనాథం అందించిన సేవలు మరువలేనివని మత్స్య, పశుసంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. విశ్వనాథం స్వగృహం సమీపంలో ఆదివారం కుటుంబ సభ్యులు ఆధ్వర్యాన మాజీ ఎంపీ కణితి విశ్వనాథం సంతాపసభ ఆదివారం నిర్వహించారు. ముందుగా విశ్వనాథం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ వృత్తిలో ఉన్నప్పుడు ఎంతో మందికి వైద్య సేవలు అందించారని, నేటికీ ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ప్రతి గ్రామంలోనూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించారని గుర్తుచేశారు. ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత విద్య అందించాలనే ఉద్దేశంతో ఐటిఐ ఏర్పాటు చేసి లయన్స్‌క్లబ్ నిధులతో నిర్మించిన భవనాలను సైతం ప్రభుత్వానికి ధారాదత్తం చేసిన ఘనత విశ్వనాథం అన్నారు. రూ.కోట్లు విలువ చేసే భూముల్లో పేద విద్యార్థులకు ప్రస్తుతం వసతి గృహం నిర్మాణ పనులు చేపడుతున్నారని చెప్పారు. ఇటీవల ఎస్ఎఫ్ఐ స్కూల్‌కు రహదారి కోసం స్థలాన్ని ఉచితంగా ఇవ్వడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, దువ్వాడ జీవితేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేంబాబు చౌదరి, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణ చంద్రరావు పాల్గొన్నారు.

గుల్లలపాడులో సంస్మరణ

వజ్రపుకొత్తూరు: మండలంలోని గుల్లపాడులో మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం సంస్మరణసభ నిర్వహించారు. ఇందులో భాగంగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బగాది శ్రీకాంత్, బమ్మిడి సోమేశ్వరరావు, దువ్వాడ ఉమామహేశ్వరరావు, బగాది గణేశ్వరరావు, బి.కామేశ్వరరావు, దువ్వాడ జయరాం, డి.భాస్కరరావు చౌదరి, బి.రాజారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భూ కబ్జాలకు అడ్డాగా పలాస

టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష



ర్యాలీలో పాల్గొన్న టిడిపి గౌతు శిరీష

పలాస: వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం అటు రాష్ట్రంలో, ఇటు పలాస నియోజకవర్గంలో విపరీతంగా భూ కబ్జాలు జరుగుతున్నాయని, భూ కబ్జాలకు అడ్డాగా పలాస మారిందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ కార్యాలయం, పలు వీధుల్లో టిడిపి ఆధ్వర్యాన ఆదివారం ఇదేమి కర్మ రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వీధుల్లో ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోస్టర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాస నియోజకవర్గంలో ప్రభుత్వ ఆస్తులకు, నియోజవర్గ ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. అందుకు మంత్రి సీదిరి అప్పలరాజు వాటిని నియంత్రణ చేయాల్సింది పోయి భూ కబ్జాలను ప్రోత్సాహిస్తున్నారని ఆరోపించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కెటి రోడ్డు విస్తరణ పనుల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, పన్ను ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా... పనులు పూర్తి చేయలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వం ఇష్టానుసారంగా నిత్యవసర వస్తువులు పెట్రోల్, డీజిల్, విద్యుత్ చార్జీలను పెంచుకుపోతుందని అన్నారు. రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, కౌన్సిలర్లు గురిటి సూర్యనారాయణ, జోగ త్రివేణి, జోగ మల్లి, డొక్కరి శంకర్, టంకాల రవి శంకర్ గుప్త, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి నవీన్, గాలి కృష్ణారావు, సైని వల్లభ, చిన్ని, పైల చక్రధర్, సత్యం, రామకృష్ణ, రమేష్, నరసింహ పాల్గొన్నారు.

ఈ పాలన మాకొద్దు

టెక్కలి: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, ఈ పాలన నుంచి విముక్తి కావాలని టెక్కలి టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి పిలుపునిచ్చారు. మండలంలోని తెలినీలాపురంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ వివరించారు. నాయకులు హనుమంతు రామకృష్ణ, చాపర గణపతి, ఎం.రాము, కె.లవకుమార్, పైల సోమేశ్వరరావు, ఇప్పిలి జగదీష్, దల్లి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్



గీత మృతదేహం

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి- కొత్తూరు

స్థానిక పెద్దవీధికి చెందిన పెదకోట గీత (37) వివాహిత ఆదివారం ఇంట్లో ఫ్యాన్ కొక్కానికి తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దకోట భాస్కరరావుకు 2007లో ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి జిల్లా కాశీనగర్‌కు చెందిన గీతను ఇచ్చి కుటుంబ పెద్దలు వివాహం చేశారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మహర్షి ఉన్నత పాఠశాలలో కుమారుడు కౌశిక్ 9, కుమార్తె శ్రేయ 7వ తరగతి చదువుతున్నారు. భాస్కరరావు వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెళ్లయిన కొన్నాళ్ల పాటు ఆనందంగా భార్యాభర్తలు గడిపారు. గత రెండేళ్లుగా భాస్కరరావు భార్యపై అనుమానం పెంచుకున్నాడు. దీంతో రోజూ మద్యం తాగి భార్యతో గొడవ పడుతూ వేధించేవాడు. ఇటీవల కూరగాయల వ్యాపారం ప్రారంభించారు. నష్టాలు రావడంతో మూడు రోజుల క్రితం మూసివేశారు. దీనిపై కూడా తరచూ గొడవలు పడుతుండేవారు. దీంతో గీత మనస్తాపానికి గురైంది. ఆదివారం భర్త వ్యవసాయ పనులకు వెళ్లిపోయాడు. పిల్లలు ఆరుబయట ఆడుకుంటుండగా... ఇంట్లో ఉన్న ఫ్యాన్ కొక్కానికి తాడు వేసి ఉరి వేసుకుంది. కొద్ది సేపటి తరువాత కుమార్తె శ్రేయ వచ్చి చూసి బోరున విలపిస్తూ... మృతురాలి తల్లి బేవర తవిటమ్మకు ఫోన్ చేసి చెప్పింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు కిందకు దించి స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. తల్లి మృతి చెందడంతో చిన్నారులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.గోవింద కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో జారిపడి వ్యక్తి మృతి



విష్ణు మృతదేహం

పొందూరు : మండలంలోని కనిమెట్టలోని కోనేటి చెరువులో ఆదివారం జారిపడి అదే గ్రామానికి చెందిన ముద్దాడ విష్ణు (58) మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో దండోరా వేసేందుకు తలయారీగా గ్రామస్తులు నియమించుకున్నారు. గ్రామంలో ఆదివారం సంబరాలు నిర్వహించారు. ఇందులో భాగంగా చెరువులో కాళ్లు శుభ్రం చేసుకునేందుకు వెళ్లాడు. ఈ సమయంలో కాళ్లు జారి చెరువులోకి వెళ్లిపోయాడు. ఎప్పటికీ రాకపోవడంతో గ్రామస్తులు చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. మృతుడి చెప్పులు, కర్ర చెరువు ఒడ్డున ఉండటంతో గాలింపు చేపట్టి బయటకు తీసుకొచ్చారు. అయితే విష్ణు అప్పటికే మృతి చెందారు. మృతుడికి భార్య పార్వతి, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మణరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన కోళ్లు

వ్యాన్ బోల్తా : కోళ్లు మృతి

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని తుడ్డలి కూడలి సమీపంలో ఉన్న మలుపు వద్ద ఆదివారం శ్రీకాకుళం నుంచి పాలకొండ వైపు వస్తున్న వ్యాన్ ఆదివారం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 500 కోళ్లు మృతి చెందాయి. మృతి చెందిన కోళ్లు పరిసర ప్రాంతాలకు చెందిన పాలవలస, లక్కుపురం, డొంకలపర్త, తుడ్డలి పరిసర గ్రామస్తులు పట్టుకెళ్లిపోయారు. అతివేగంగా రావడంతో వ్యాన్ బోల్తా పడిందని గ్రామస్తులు తెలిపారు.



క్రికెట్ ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

క్రికెట్ టోర్నీ విజేత కవిటి కొత్తూరు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని కమలయు పుట్టుకలో ఏప్రిల్ 5 నుంచి జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌తో విజయవంతంగా ముగిసింది. నీలకంఠ ఈశ్వర క్రికెట్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు మిత్తన హేమాచలం, లాభాల హేమాచలం జ్ఞాపకార్థం దాతలు, గ్రామపెద్దలు సహకారంతో విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో విన్నర్‌గా కవిటి కొత్తూరు జట్టు విజేతగా నిలిచింది. విజేతకు రూ.11,111 నగదుతో పాటు ట్రోఫీ అందించారు. రన్నర్‌గా ఫ్రెండ్లీ జట్టు ఇచ్ఛాపురం నిలిచింది. ట్రోఫీతో పాటు రూ.7777లు నగదు, మూడవ స్థానంలో డి.జె.పుట్టుక రూ.1500, నాల్గవ స్థానంలో సన్యసుపుట్టుకకు రూ.వెయ్యి నగదు అందించారు. మ్యాన్ ఆఫ్ ది టోర్నీగా కవిటి కొత్తూరుకు చెందిన క్రీడాకారుడు పృధ్వీ రాజు, ఉత్తమ క్రమశిక్షణా టీమ్‌గా పాత కొజ్జిరియ జట్టు నిలిచింది. ముగింపు కార్యక్రమంలో గ్రామ పెద్దలు టోర్నీ నిర్వాహకులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అప్పలనాయుడు

క్రీడలతో మానసికోల్లాసం

లావేరు : క్రీడలతో మానసికోల్లాసం వస్తుందని, వేసవి కాలంలో యువత క్రీడలపై దృష్టిసారించాలని ఎచ్చెర్ల నియోజకవర్గం వైసిపి నాయకులు లుకలాపు అప్పలనాయుడు అన్నారు. మండలంలోని వెంకటాపురంలో నియోజకవర్గ సమ్మర్ వాలీబాల్ లీగ్ ఆట పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి క్రీడలపై యువత దృష్టిసారిస్తే తద్వారా ఆరోగ్యం, ఆహ్లాదకరమైన వికాసం సాధ్యమవుతుందని అన్నారు. చదువతో పాటూ క్రీడల్లోనూ రాణించాలన్నారు. కార్యక్రమంలో వెంకటాపురం సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు, మాజీ సర్పంచ్‌లు గొర్లె రామినాయుడు, ఎస్.నాగరాజు, వి.దాలినాయుడు, మీసాల అప్పారావు, శాంతటి భాస్కరరావు, ఇజ్జు రాజగోపాలరావు, పి.గురునాయుడు పాల్గొన్నారు.

జెఇఇ ఫలితాల్లో 'విశ్వజ్యోతి' ప్రతిభ

టెక్కలి: విశ్వజ్యోతి జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసుకున్న కంచరాన తరుణ్ సాయి జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచాడని కళాశాల అకాడమిక్ సలహాదారులు దుప్పల రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది తాము కొత్తగా ప్రవేశపెట్టిన జెఈఈ ప్రిపరేషన్ అద్భుత ఫలితాలు సాధించిందని తెలిపారు. కంచరాన తరుణ్ సాయి జెఈఈ ఫలితాల్లో 98.2శాతం మార్కులు సాధించారని తెలిపారు. ప్రతిభ కనబరిచిన తరుణ్ సాయిని కళాశాల ప్రిన్సిపల్ మండల్ అధ్యాపకులు నగేష్ రాజా రమేష్ తదితరులు అభినందించారు.

మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా నాయకులు వై.చలపతిరావు అన్నారు. నరసన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో రవాణా ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల కార్యాలయంలో మేడే కరపత్రాలను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా చలపతిరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో కార్మికవర్గం 8గంటల పని దినాన్ని సాధించి, ఇతర హక్కులు కూడా సాధించుకున్నదని అన్నారు. పాలకులు, కార్మికుల వ్యతిరేక విధానాలు కారణంగా హక్కులు నిలుపుకొనే దానికి మరో పోరాటానికి సిద్ధం కావాలని అన్నారు. ప్రైవేటీకరణ విధానాలు తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో పోరాడి సాధించుకున్న హక్కులపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తోందన్నారు. సమ్మె హక్కు, యూనియన్ ఏర్పాటు, ఉమ్మడి బేరసారాలు, వేతనాలు, సామాజిక భద్రత హక్కులు కుదించబడుతున్నాయని తెలిపారు. కార్మికవర్గం ఐక్యం కాకుండా చూడటాన్ని, మతతత్వాన్ని నూరు పోస్తుందని, మత సామరస్యాన్ని భూస్థాపితం చేసి మైనార్టీ మతస్తులపై దాడులకు పురుగొలిపే విధంగా, ముస్లింలపై నేరము మోపి అరెస్టులు చేసే చట్టాలు చేస్తున్నాయని, బిజెపి పరిపాలనలో ఉన్న రాష్ట్రాల్లో మైనార్టీలకు హక్కులు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమతో పాటు ప్రభుత్వరంగ సంస్థలన్నీ ప్రైవేటీకరణ చేస్తున్నాయని, అధిక ధరలు నిరుద్యోగం, రోజురోజుకీ పెరుగుతుందని దీంతోపాటు పెట్టుబడిదారులకు లాభాలు చేకూర్చే కార్పొరేట్ విధానాలు అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కరగాన కొండయ్య, శేఖర్, అమర్, రంగా, ఎర్రయ్య ,శ్రీనివాస్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న చలపతిరావు

ఎన్నికల ముందు గుర్తుకొచ్చాయా?

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

పట్టణ ప్రాంతాల్లో అద్దె ఇళ్లలో అనేక కష్టాలు పడుతూ జీవనం సాగిస్తున్న పేదలకు సొంతింటి కల నెరవేర్చాలని చంద్రబాబు హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారని, నాలుగేళ్ల తరువాత ఎన్నికల ముందు వైసిపి ప్రభుత్వం టిక్కో ఇళ్లను పంపిణీ చేశారని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి అన్నారు. అరసవల్లిలోని తన స్వగృహంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలో టిడ్కో ఇళ్లు ఆధునిక పద్ధతిలో నిర్మాణాలు చేపట్టారని అన్నారు. నాటి ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లను లబ్ధిదారులకు ఈ నాలుగేళ్ల పాటు ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. నాటి అభివృద్ధిని తమ ఖాతాలో చేర్చుకునేందుకు పార్టీ రంగులు వేసి వైసిపి తమ పేరు పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. పట్టణంలో పేదలకు ఐదు వేల ఇళ్ల నిర్మాణానికి కేటాయించి యుద్ధప్రాతిపదిక పనులు చేపట్టామని అన్నారు. ప్రజలు డిపాజిట్లు కట్టిన మొత్తాలను సైతం ప్రభుత్వ అవసరాలకు వాడుకుని నాలుగేళ్ల పాటు అయోమయానికి గురిచేశారన్నారు. ప్రభుత్వం అనేది నిరంతర ప్రక్రియ అని, నాటి కట్టడాలకు తాము కట్టినట్టు ప్రజలకు నమ్మించేందుకు వైసిపి నాయకులు జగనన్న అంటూ పేరు పెట్టుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఇళ్ల పంపిణీలో లబ్ధిదారుల ఎదుట మంత్రి ధర్మాన ప్రసాదరావు అసహనంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం తప్పిదాన్ని ప్రజలపై నెట్టడానికి ప్రయత్నం చేస్తే ప్రజల నుంచి గుణపాఠం తప్పని హెచ్చరించారు.

నాట్యకళతో మానసిక వికాసం

ప్రజాశక్తి- ఆమదాలవలస



మాట్లాడుతున్న సంజీవరావు

నాట్యం నేర్చుకోవడం ద్వారా విద్యార్థులకు శారీరక, మానసిక వికాసం సాధ్యపడుతుందని వికాస తరంగిణి సమన్వయకర్త కాకితాపల్లి సంజీవరావు అన్నారు. కూచిపూడి నాట్యాచార్యులు డాక్టర్ యేలేశ్వరపు శ్రీనివాసులు సారథ్యంలో నాట్యశ్రీ నృత్య కళానికేతన్ ఆధ్వర్యాన కూచిపూడి నృత్య శిక్షణా వేసవి శిబిరాన్ని స్థానిక వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నృత్యంపై అభిమానం ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. అనంతరం నిర్వహించిన నృత్య విద్యార్థినుల ప్రదర్శనలు అలరించాయి. నృత్య శిక్షకులు కూన శ్రీలత కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు. శ్రీవాహిని విద్యాలయం ప్రిన్సిపాల్ వమ్మరవల్లి జనార్థనరావు, కూన షణ్ముఖరావు, కూన విజయనిర్మల, ఆర్‌పి ఫౌండేషన్ అధ్యక్షులు వెలమల భార్గవ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్బంధాలు తగవు

ప్రజాశక్తి- టెక్కలి

అక్రమ నిర్బంధాలు తగవని యుటిఎఫ్ జిల్లా కార్యవర్గసభ్యులు పాలవలస ధర్మారావు, తమ్మినేని వైకుంఠరావు అన్నారు. విశాఖలో సిపిఎస్ రద్దు కోరుతూ సోమవారం కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంగా ఆదివారం వీరిని ముందస్తు అరెస్టు చేశారు. స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా పోరాటాలను పోలీసులు అణిచివేయాలనుకోవడం సమంజసం కాదన్నారు. ఉద్యమాలను అరెస్టులు ఆపలేవని అన్నారు. అరెస్టు అయిన వారిలో కురమాన దాలయ్య, పొట్నూరు జగదీష్, మరో ముగ్గురు ఉన్నారు.



ప్రారంభిస్తున్న మంత్రి ప్రసాదరావు

కళావైభవ్ షోరూం ప్రారంభం

శ్రీకాకుళం : స్థానిక చౌక్ బజారు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కళా వైభవ్ వస్త్రదుకాణ సముదాయాన్ని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదివారం ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఆధునికకాలంలో అందరి అభిరుచులకు అనుగుణంగా ఇక్కడ షోరూమ్‌ను ఏర్పాటు చేయడం ఆనందదాయకమని అన్నారు. ఈ షోరూంతో మరింత మందికి ఉపాధి అవకాశాలు దక్కడం సంతోషించ దగ్గ విషయమని చెప్పారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి పాల్గొన్నారు.

యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- కవిటి

యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. కవిటి మండలం ప్రగడపుట్టుగకు చెందిన యాదవ కుల పెద్దలు, యువకులు ఆదివారం రామారావును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, ప్రజా సమస్యల పరిష్కారానికి కషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్రాయి వాసుదేవరావు, చందాన తేజేశ్వరరావు, బదకల యర్రయ్య, లేవటి ధనుంజయం, బదకల లక్ష్మణరావు, కాకర్ల మాధవరావు, నర్తు పురుషోత్తం, బదకల హరిబాబు, కడియాల రాముడు, బదకల ఈశ్వర రావు, మామిడి తిరుపతి, యాదవ యువకులు పాల్గొన్నారు.



రామారావును సన్మానిస్తున్న యాదవులు

పాత కక్షలకు మూగజీవాలు బలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి



బావిలో తేలి ఉన్న మేక

పాత కక్షలతోనే తన మేకల మందలోని మూడు మేకలను బావిలో పడేసి, చంపేశారని పట్టుపురం గ్రామానికి చెందిన రైతు తాన్ని సింహాచలం పోలీసుల వద్ద వాపోయింది. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ పట్టుపురం గ్రామానికి చెందిన బొడ్డపు రాంబాబు, తవుడు, శ్రీను, సింకయ్య, వంజరాపు కేశవలపై అనుమానం ఉందని, తెలిపాడు. ఆ కోపంతో తనకేమి చేయలేక మూగజీవాలపై తన ప్రతాపం చూపించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాను. ఏప్రిల్ 23వ తేదీన గ్రామ సమీపంలోని జగ్గయ్యపేట వద్ద పొలంలో మేకలు మంద వేశామని, అందులో ఉన్న మూడు పెద్దజాతి మేకలు (సుమారు రూ.లక్ష) ఉంటాయని, రాత్రి నుంచి కనిపించలేదని, వారం రోజులు చుట్టుపక్కల గ్రామాల్లో గాలించిన ఎక్కడా దొరకలేదని సింహాచలం అన్నారు. ఆదివారం అక్కయ్యవలస గ్రామ సమీపంలోనినేల బావిలో మేక తేలి ఉందని గ్రామస్తులు చెప్పడంలో వెళ్లి చూసే సరికి నేలబావిలో మతి చెందిన్నది మా మేకనేనని, మిగిలిన రెండు మేకలు కూడా ఈ భావిలోనే ఉండవచ్చునని అయన అవేదన వ్యక్తం చేశారు. పాత కక్షలతోనే బొడ్డాపు రాంబాబు, తవుడు, శ్రీను, సింకయ్య, వంజరాపు కేశవలు తమ మేకలను ఎత్తుకుపోయి ఈ బావిలో పడేసి చంపేశారని, వారికి పట్టుకొని విచారిస్తే పూర్తి వివరాలు వెలుగులోకి వస్తాయని, మూగజీవాలను చంపిన వారికి కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

200 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రాజు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని సిపాన చంద్రయ్యపేటలో శ్రీకాకుళం నగరానికి చెందిన సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యాన ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు రాజు 200 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు ఎండలో ఎక్కువగా తిరగవద్దని అన్నారు. అధిక మొత్తంలో తాగునీరు, కొబ్బరి నీళ్లు, పళ్ల రసాలు తీసుకోవడం వల్ల వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. మలేరియా, కలరా వంటి వ్యాధులపై నిర్లక్ష్యంగా ఉండకూడదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు



వజ్రపుకొత్తూరు : బహుమతిని అందజేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- కవిటి

ఉద్యోగికి తాను చేసిన సేవలే గుర్తింపునిస్తాయని కవిటి ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. మండలంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్‌గా పనిచేసి, ఇటీవల నందిగాం మండలానికి వర్క్ అడ్జిస్టమెంట్‌పై వెళ్లిన గొండు సరస్వతిని స్థానిక మానవవనరుల కేంద్రంలో దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా సరస్వతి మండలంలో మెరుగైన సేవలు అందించారని కొనియాడారు. నాడు-నేడు, జగనన్న విద్యాకానుక, అమ్మఒడి ప్రభుత్వ కార్యక్రమాలు విద్యార్థులకు చేరేలా కృషి చేశారని అన్నారు. కేశవపురియా, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లు తులసి, రామకృష్ణ, పొరామో, తనూజ, హేమారావు, సిబ్బంది సంతోష్, శ్రీను, కృష్ణ, బల్లెడ రమేష్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : విధి నిర్వహణలో ఉత్తమ సేవలకు ఎల్లపవిడూ గుర్తింపు ఉంటుందని ఉద్దనం రామకృష్ణాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రమేష్ అన్నారు. వర్క్ ఎడ్జిస్ట్‌మెంట్ నియామకంపై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అమలపాడు నుంచి ఉద్దానం రామకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలకు జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా సేవలు అందించిన సుజాతను ఉపాధ్యాయ సిబ్బంది ఆదివారం సత్కరించారు. ఉపాధ్యాయ వృత్తిలో చేసిన సేవలకు అన్ని వేళలా సమాజం నుంచి గుర్తింపు ఉంటుందని అన్నారు.

వన్ ర్యాంకు వన్ పెన్షన్‌కు కృషి చేయాలి

శ్రీకాకుళం అర్బన్: మిలిటరీ సర్వీస్ పే, డిజెబిలిటీ పెన్షన్ అనేది అన్ని రాంక్‌లకూ ఒకేలా ఉండేలా కృషి చేయాలని మాజీ సైనికుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు కోరారు. దేశవ్యాప్తంగా సైనికులకు వన్ ర్యాంకు వన్ పెన్షన్ ఇవ్వాలని కోరుతూ మాజీ సైనికులు దేశ రాజధాని ఢిల్లీలో చేపట్టిన ర్యాలీకి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీ నివాసంలోని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సైనిక వితంతువుల పెన్షన్ ఏడేళ్ల తరువాత నార్మల్ ఫ్యామిలీ పింఛనుగా మారుస్తున్నారని అన్నారు. దీనివల్ల వీర నారీలకు అన్యాయం జరుగుతుందని వివరించారు. అందువల్ల ఏడేళ్ల క్లాజ్‌ను తొలగించి న్యాయం చేయాలని కోరారు. వాలంటరీ విశ్రాంతి తీసుకున్న వారికి ఒఆర్‌పి-2 స్థానం కల్పించాలన్నారు. పే, పెన్షన్ రివిజన్ కమిటీలో జెసిఒ, ఒఆర్‌లకూ చోటు కల్పించాలన్నారు. ఈ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

నేటి నుంచి శిక్షణ

పోలాకి: నేటి నుండి పోలాకి ప్రభుత్వ జూనియర్ కళాశాల లో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఫెయిల్ అయిన విద్యార్థులకు స్పెషల్ కోచింగ్ ఇవ్వబడునని ప్రిన్సిపాల్ అన్నపూర్ణరావు తెలిపారు. ఆదివారం జూనియర్ కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. ఇంటర్మీయట్ ఫెయిల్ అయిన విద్యార్థులు మే 1 వ తేదీ నుండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటలకి అధ్యాపకులుతో కోచింగ్ ఇవ్వబడునని తెలిపారు. విద్యార్థులు వీటిని గుర్తించి తరగతులకు హాజరు కావాలని కోరారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

స్థల పరిశీలన

కోటబొమ్మాళి: మండల కేంద్రంలోగల మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా అంబేద్కర్ కమ్యూనిటి హాల్ నిర్మాణం కోసం స్థానిక సర్పంచ్ కాళ్ళ సంజీవరావుతో కలిసి మండల దళిత నాయకులు ఆదివారం స్థల పరిశీలన చేశారు. డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కమ్యూనిటి హాల్ నిర్మాణం కోసం మండల కేంద్రంలో స్థలం కావాలని జిల్లా కలెక్టర్‌కు కోరగా అయన తహసీల్దార్‌కి స్థలం చూసి అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఇవ్వాలని చెప్పగా, పంచాయతీ తీర్మాణం తీసుకువస్తే స్థలం కేటాయిస్తానని తహసీల్దార్ తెలియజేశారు. దీంతో వారు స్థానిక సర్పంచ్ సంజీవరావుకు గ్రామ తీర్మానం చేసి ఇవ్వాలని కోరారు. ఆయన వెంటనే స్పందించి స్థలపరిశీలన చేసి అనంతరం సోమవారం గ్రామ తీర్మాణం చేసి ఇస్తానన్నారు. దళిత నాయకుల అధ్యక్షుడు బోకర జడ్డెన్న, ప్రధాన కార్యదర్శి దొవ్వార సింహాచలం, శ్యామలరావు, మల్లయ్య, సురేష్, మురళి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న హారికాప్రసాద్

లయన్స క్లబ్ సేవలు విస్తృతం

శ్రీకాకుళం అర్బన్: సేవాభావంతో జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన లయన్స్‌క్లబ్ శాఖలు విస్తరించడం ద్వారా మరిన్ని సేవలు ప్రజలకు అందించవచ్చని జోనల్ చైర్మన్ డాక్టర్ చింతాడ కృష్ణారావు అన్నారు. నగరంలోని నాగావళి హోటల్‌లో లయన్స్‌క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం హర్షవల్లికి ఇంటర్నేషనల్ చాప్టర్ గుర్తింపును ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో నిరుపేదలకు క్లబ్ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు హారికాప్రసాద్, ఉపాధ్యక్షులు వావిలపల్లి జగన్నాథం నాయుడు, టి.అప్పలరెడ్డి, జి.కె.ప్రసాద్, ఎం.స్వరూప్, కె.శోభారాణి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మెళియాపుట్టి : మండల కేంద్రంలో సింహగర్జన యూత్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ సర్పంచ్ దుక్క చాణుక్యరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ బసవ భాస్కర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చుట్టుపక్కల గ్రామస్తుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, సింహగర్జన యూత్ సభ్యులు పాల్గొన్నారు.



నీటిని అందజేస్తున్న చాణుక్యరెడ్డి



గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులు

ఇష్టంగా చదవాలి

లావేరు : లావేరు, మురపాక శాఖాగ్రంథాలయాల్లో 'చదవడం మాకిష్టం కార్యక్రమం' ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ పుస్తకాలు ఇష్టంగా చదవాలన్నారు. తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి గ్రంథాలయాధికారి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గ్రంథాలయం తరుపున అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు, ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.



బీమా నగదును అందిస్తున్న కౌన్సిలర్ తవిటయ్య

బాధిత కుటుంబానికి బీమా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం.

ఎఎస్‌పేటలో మూడో వార్డుకు చెందిన సయ్యద్ అన్వర్ అలీ ఇటీవల అనారోగ్యంతో మతి చెందారు. ఆ కుటుంబానికి వైఎస్ఆర్ బీమా కింద రూ.10 వేలు తక్షణ పరిహారంను కౌన్సిలర్ పత్రి తవిటయ్య ఆదివారం అందజేశారు. మిగిలిన రూ.90వేలు బ్యాంక్ ఖాతాలో జమవుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ సుజిత్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : 33/11 కె.వి తొగరాం సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ నిర్వాహణ దృష్ట్యా సోమవారం ఉదయం పది నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.బయ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. తొగరాం, జి.కె.వలస, ఎన్.టి.వాడ, ఎం.కె.వలస, చీమలవలస, కొర్లకోట, నెల్లిపర్తి, వెదుర్లవలస, హనుమంతుపురం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయునికి సత్కారం

ప్రజాశక్తి- సోంపేట



ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న చేయూత సంస్థ ప్రతినిధులు

మండలంలోని ఇసుకల పాలెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి బదిలీపై వెళ్లిన గార రాజేష్ నుగ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఆదివారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు రాజేష్ మాస్టర్ పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు కార్యక్రమంలో సర్పంచ్ పైపల్లి అంకమ్మ ఎంపిటిసి బైపల్లి తిరుపతి మాట్లాడుతూ రాజేష్ మాస్టర్ పిల్లల ప్రగతికే కాకుండా గ్రామ అభివృద్ధికి సైతం తమ వంతు సహాయ సహకారాలు అందించారని అన్నారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ విశ్వనాథం, చేయూత సంస్థ ప్రతినిధులు లండ రాజారావు, హెచ్ఎం లలిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి- టెక్కలి

కళాశాలలో చదివే విద్యార్థులు చదువుతోపాటు తమ వ్యక్తిత్వ వికాస నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ పిలుపునిచ్చారు. కళాశాల జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహించిన జాతీయ సేవా శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక దక్పథంతో చైతన్యవంతులుగా తయారు కావాలని, అప్పుడే సమాజ వికాసానికి దోహద పడతారని అన్నారు. వారం రోజుల శిబిరం లక్ష్యాన్ని పిఒ వి.లూక్‌పాల్ నివేదించారు. అనంతరం సేవా విభాగం కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఇఒ బసవల్ల అప్పలస్వామి, మోదుగువలస దుర్యోధన, రామ్మూర్తి, ఎంపిటిసి పాల్గుణరావు, కళాశాల అధ్యాపకులు సతీష్‌కుమార్, కందిగొల్ల, తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పీకర్ పర్యటన

పొందూరు: మండలంలోని తోలాపిలో సోమవారం స్పీకర్ తమ్మినేని సీతారాం పర్యటించనున్నట్లు మండల వైసిపి అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని చేనేత కార్మికులకు 90 శాతం సబ్సిడీతో అవసరమైన పనిముట్లను అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలంలోని వైసిపి సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పలాస: కాశీబుగ్గ న్యూకాలనీ మమత తల్లి పిల్లల ఆసుపత్రిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం రాగోలు జెమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎన్.అప్పారావు, కార్యదర్శి తమ్మినేని మాధవరావు తెలిపారు. వైద్య శిబిరంలో కిడ్నీ, కేన్సర్, కీళ్ళు, గుండె, తదితర సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి- పర్లాకిమిడి

ఆహార సంరక్షణ, విద్యుత్ బిల్లుల్లో అవకతవకలు, బలవంతంగా విద్యుత్ స్మార్ట్ మీటర్లు నెలకొల్పడాన్ని వ్యతిరేకించే హక్కు, సేవ హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షులు ప్రశాంత మిశ్రా అన్నారు. గజపతి జిల్లా కాశీనగర్ పట్టణంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన ఆదివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రొక్కం లోకనాథం, జిల్లా ఉపాధ్యక్షులు తనూజా సతపతి, జిల్లా సహాయ కార్యదర్శి లింగరాజ్ పాణిగ్రాహి, కాశీనగర్ బ్లాక్, ఎన్ఎసి కార్యదర్శి రేవల్ల ధర్మారావు, సభ్యులు పొట్నూరు తిరుపతిరావు, గుసాని బ్లాక్ కార్యదర్శి బాలకృష్ణ శూద్ర పాల్గొన్నారు.



పలాస : ఆర్థికసాయం అందజేస్తున్న గంగా భవాని

పలువురికి ఆర్థికసాయం

పలాస: మండలంలోని నీలావతి గ్రామంలో ఉద్దాన విద్యా అభివద్ధి వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రంథాలయం అభివృద్ధికి పలాస మదర్ థెరీసా స్కూల్ కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో యువివి గౌరవ సభ్యులు ఎస్.నాగేశ్వరరావు, అకడమిక్ సెల్ కన్వీనర్ పి.బాలరాజు, సభ్యులు కె.దుర్యోధన, పి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి: మండలంలోని కిట్టాలపాడు గ్రామానికి చెందిన బొబ్బిలి అప్పారావు కుటుంబానికి రాంబాబు చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.5000 రూపాయలు ఆర్థిక సహకారాన్ని ఆదివారం అందించారు. ట్రస్ట్ నిర్వాహకులు ఎన్ని షణ్ముఖరావు తెలిపారు. కుటుంబ యజమాని మరణించడంతో పేద కుటుంబానికి చెందిన వ్యక్తికి సహకారం అందించమని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గుణాకర్ , మనీ తదితరులు పాల్గొన్నారు.



పి.వి.ఎన్ మాస్టారును సన్మానిస్తున్న రవికుమార్

పి.వి.ఎన్ మాస్టారుకు సన్మానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎన్‌టిఆర్ శత జయంతి సందర్భంగా ఆదివారం శతక రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో పట్టణానికి చెందిన రచయిత, కవి పొన్నాడ వరాహనరసింహులు (పివిఎన్ మాస్టర్) రచించిన శతక పద్యాలకు ఎంపికయ్యారు. విశ్వవిఖ్యాత నాయక విమల చరిత నతులు శతములు గొలుమయ్యే నందమూరి అనే అంశంపై 112 సీస పద్యాలు రచించినట్లు పివిఎన్ మాస్టర్ తెలిపారు. అనంతరం బహుమతిని అందజేశారు. ఈయనకు టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, తదితరులు అభినందనలు తెలిపారు.

ప్రజాశక్తి

మేడే ప్రత్యేక అనుబంధం

Advt. Feature

16 పేజీలు | శ్రీకాకుళం జిల్లా | సోమవారం 1-5-2023

అరుణ పతాక తార కు జేజేలు

మేడే....ఓ మహత్తర పోరాటం పురుడుపోసుకున్న రోజు. ఎనిమిది గంటల పనిదినం కోసం కార్మికులు రక్తం చిందించిన రోజు. ఓ అరుణతారను శ్రామికులకు, కష్టజీవులకు అందించిన రోజు. 18వ శతాబ్దంలోనే యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా పారిశ్రామికీకరణను ప్రారంభించిన పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు.. శ్రామిక ప్రజల శ్రమశక్తిని నిలువెల్లా దోచుకున్నారు. శ్రామికులకు అమానుష శిక్షలు వేయడం.. చివరకు కొట్టి చంపడం వరకూ క్రూరాతి క్రూరంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో 1886 మేలో అమెరికా దేశం చికాగో నగరంలోని హే మార్కెట్‌లో.. సమ్మె చేస్తున్న నలుగురు కార్మిక నేతలను కాల్చి చంపిన పెట్టుబడిదారులు అంతటితోనే ఊరుకో లేదు. మే 4వ తేదీన మరో నలుగురు కార్మికులను కోర్టులో విచారించి ఆ మరుసటి సంవత్సరం నవంబర్ 11న నిర్ధాక్షిణ్యంగా ఉరివేసి చంపారు. ఈ ఘటనల నుంచి ఆవిర్భవించిందే శ్రమజీవుల స్వేచ్ఛా సంకేతమైన అరుణ పతాకం. అదే నేటికీ దోపిడీకి గురువుతున్న శ్రామిక ప్రజలకూ, కార్మికులకూ వెలుగు దిక్సూచిగా ఉంది. అలాగే కార్మిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన మే డే రోజునే (1913 మే 1న) దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, భారత దేశ కార్మికవర్గ పార్టీ అగ్రనేత, పేదల పెన్నిధి, మహోన్నత నేత పుచ్చలపల్లి సుందరయ్య గారు జన్మించారు. ఆ మహానేత జయంతిని శ్రామికులు, కార్మికులు...యావత్ ప్రజలంతా జరుపుకుంటూ స్ఫూర్తి పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే మే డే దీక్షా దినానికి ఎంతో ప్రత్యేకత ఉంది.





శ్రమజీవుల ఆశాజ్యోతి మేడే

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మానవ జాతి చరిత్రలో 18వ శతాబ్దం అంతకు పూర్వం కంటే అత్యంత అభివృద్ధి చెందిన శతాబ్దంగా వినుతికెక్కింది. ఆ శతాబ్దంలోనే ఇంగ్లండ్ మరికొన్ని యూరోపియన్ దేశాల్లో ఉత్పత్తి రంగంలో ఆవిరి యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా పారిశ్రామికీకరణ ప్రారంభమైంది. 1776 మార్చిలో వాట్ సన్ ఆవిరి యంత్రాన్ని కనిపెట్టాడు. దాన్ని ఇంగ్లండ్‌లోని ఓ బొగ్గు గనిలో మొదటిసారిగా ఉపయోగించారు. ఈ క్రమం అమెరికాకు కూడా పాకింది. బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం వల్ల 1820 సంవత్సరంలో ఉన్న చేనేత కార్మికుల సంఖ్య 2,40,000 నుంచి 1844 సంవత్సరానికి 60 వేలకు తగ్గింది (1860 నాటికి ఇది 8 వేలకు తగ్గిపోయింది). అదేకాలంలో మరమగ్గాల ఆపరేటర్లు 10 వేల నుంచి లక్షన్నరకు పెరిగారు. యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ 19వ శతాబ్దంలో సైన్సు, టెక్నాలజీ బాగా అభివృద్ధి అయ్యాయి. దానితో భారీ పరిశ్రమలు ఏర్పడ్డాయి. వేల సంఖ్యలో కార్మికులు తలెత్తారు.


రైల్వేలు, మోటారు కార్లు, టెలిఫోన్, టెలిగ్రాఫ్, విద్యుచ్ఛక్తి కూడా వాడుకలోకి వచ్చాయి. ఆ శతాబ్దంలో జర్మనీ, ఫ్రాన్స్ దేశాల్లో పారిశ్రామికరంగ అభివృద్ధి విశేషంగా జరిగింది. యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల సంఖ్య ఒక కోటికి పెరిగింది. దానితో ఉత్పత్తి రంగంలో పెట్టుబడిదారీవర్గం, కార్మికవర్గం అనే రెండు ప్రత్యర్థి వర్గాలు తలెత్తాయి. పెట్టుబడిదారులు శ్రామిక ప్రజల శ్రమశక్తిని క్రూరంగా దోచుకుంటున్నారు. దీంతో పెట్టుబడిదారీ, కార్మికవర్గాల మధ్య సంఘర్షణ అనివార్యమైంది.

పారిశ్రామిక విప్లవం ప్రారంభ దినాల్లో శ్రామికులు బానిసల మాదిరిగా శ్రమిస్తుండేవారు. పారిశ్రామివేత్తలు అధిక లాభాలను పిండుకోవడానికి ఆరేడేళ్ళ పిల్లలతోనూ, మహిళలతో కూడా ఫ్యాక్టరీల్లో, గనుల్లో పని చేయించారు. బాల కార్మికులు గనుల్లోని చీకటి సొరంగాల్లో.. బొగ్గు బళ్లను మోచేతులపైన, మోకాళ్లపైన పాకుతూ లాగేవారు. ఆఖరికి పొగగొట్టాల పైకెక్కి వాటిని శుభ్రపర్చేవారు. ఇంగ్లండ్‌లోని అనాధ శరణాలయాల్లో పిల్లలను అక్కడి అధికారులు పారిశ్రామికవేత్తలకు పశువుల మాదిరిగా విక్రయించేవారు. బాల కార్మికులు ఉదయం నుంచీ రాత్రి వరకూ యంత్రాల

వద్ద నిలబడి పనిచేసేవారు. క్షణం సేపు కన్ను మూస్తే ఆ చిన్నారుల వీపులు కొరడా దెబ్బలతో చిట్లిపోయేవి. ఇక శ్రమజీవులతో రోజూ 16 గంటలు పనిచేయించేవారు. మరికొందరు పెట్టుబడిదారులు 20 గంటలు కూడా పనిచేయించారు. 1806లో అమెరికాలోని ఫిలడెల్ఫియాలో చెప్పులు కుట్టే కార్మికులు సమ్మె చేసిన సందర్భంగా జరిగిన విచారణలో కార్మికులతో యజమానులు రోజుకు 20 గంటలు పనిచేయించుకుంటున్నట్లు లోకానికి వెల్లడైంది. కార్మికులకు అతి తక్కువ జీతా లిచ్చేవారు. పని భద్రత, సౌకర్యాలుండేవి కావు. ఫ్యాక్టరీల్లో గాలీ వెలుతురు మృగ్యం. యంత్రాల వద్ద రక్షణ లేక కార్మికులు అనేక రకాలుగా ప్రమాదాల బారిన పడి మరణిస్తుండేవారు. కార్మికులు అమానుష శిక్షలకు కూడా గురవుతుండేవారు.

కార్మికులు తాము అనుభవించే పీడనకూ.. దోపిడీకీ కారణం తాము పనిచేసే యంత్రాలేనని భ్రమించారు. తెగించి వాటిని ధ్వంసం చేయడం ప్రారంభించారు. ఈ విధ్వంసకాండ మొదట బ్రిటన్‌లో ప్రారంభమైంది. దీంతో పారిశ్రామికవేత్తలు సాయం కోసం ప్రభుత్వం వద్దకు పరిగెత్తారు. నిక్కచ్చిగా.. దోపిడీకి గురవుతున్న కార్మికుల ప్రాణ రక్షణకు చలించని ప్రభుత్వం.. వెంటనే యజమానుల ఆస్తి రక్షణకు పార్లమెంటును ఉపయోగించింది. యంత్రాలను ధ్వంసం చేసేవారికి మరణశిక్ష విధిస్తూ చట్టం చేసింది. తర్వాత కార్మికులు.. యంత్రాలను ధ్వంసం చేయడంలో అర్థం లేదనీ.. తమ దుస్థితికి కారణం ఫ్యాక్టరీ యజమానులే అని గ్రహించారు. ఆ దుస్థితి నుంచి బయట పడటానికి పోరాటం చేయడమొక్కటే మార్గమని అర్థం చేసుకున్నారు. దానితో పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా శ్రామికవర్గం పోరాటం ప్రారంభించింది.

ట్రేడ్ యూనియన్ల మహత్తర సామాజిక శక్తిని చూసి పాలకులు, పెట్టుబడిదారులు హడలెత్తిపోయారు. ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో కార్మికులు అధిక జీతాలు డిమాండ్ చేయడానికి ట్రేడ్ యూనియన్లు నిర్మించుకోవడం చట్ట విరుద్ధంగా ప్రకటించారు. ఏర్పాటైన ట్రేడ్ యూనియన్లను నిషేధించారు. దోపిడీదారులైన



పెట్టుబడిదారులు, వారికి అండదండలిచ్చే పాలకులు అనేక మంది కార్మిక నాయకులనూ, ట్రేడ్ యూనియన్ సభ్యులనూ జైళ్లలో కుక్కారు. హత్యలు చేశారు. వారికున్న కొద్దిపాటి సొత్తును సయితం కాజేశారు. ట్రేడ్ యూనియన్లను నిరంకుశంగా నిషేధించారు. సమ్మె హక్కునూ, పికెటింగ్ హక్కునూ లాగేశారు.

బూర్జువా పాలకులు ట్రేడ్ యూనియన్లను నిషేధించినా, పశుబలంతో కార్మికవర్గ పోరాటాలను రక్తపుటేరుల్లో ముంచినా.. కార్మికవర్గం వెనుకంజవేయలేదు. పనిగంటల తగ్గింపు, న్యాయమైన వేతనాలు, ట్రేడ్ యూనియన్ల గుర్తింపుకోసం ప్రభుత్వం నుంచి హక్కులు సాధించడానికి కార్మికవర్గం వర్గ చైతన్యంతో పోరాటాలను కొనసాగించింది. ఈ పోరాట జ్వాలలు 19వ శతాబ్ద ప్రథమార్థ భాగంలో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికాల్లో దోపిడీ శక్తులను చుట్టుముట్టాయి. ఇంగ్లండ్‌లో 1818లో స్టాక్‌పోర్టు పట్టణంలోని బట్టల ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు సమ్మె బావుటాను ఎగురవేశారు. ఈ సమ్మె పోరాటం కార్మికవర్గ చరిత్రలో ప్రథమ సమ్మె పోరాటంగా చెప్పబడింది. ఫ్రాన్స్ దేశం లయాన్స్ పట్టణంలోని సిల్కు పరిశ్రమల్లో 1831లోనూ, 1834లోనూ కార్మికులు తిరుగుబాటు జరిపారు. ప్యారిస్ నగరంలో 1848 జూన్ 23-26 మధ్య సమ్మె పోరాటాలు జరిగాయి. జర్మనీలోని సైలీషియాలో 1844లో నేత పనివారు తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటు ద్వారా శ్రామికవర్గ నిర్మాణాత్మక పటిమ, బూర్జువావర్గంతో దానికిగల శత్రుత్వం స్పష్టంగా వెల్లడయింది. నైరుతీ జర్మనీలో 1848లో విప్లవోద్యమం రగుల్కొంది. అదేఏడు ఆస్ట్రియా వియన్నాలో తిరుగుబాటు వచ్చింది. కార్మికులు విజయం సాధించారు. బెర్లిన్‌లో కార్మికులు, సైనికులకూ మధ్య సంఘర్షణలు జరిగాయి. చివరికి శ్రామికులు విజయం సాధించారు. ఈ కాలంలోనే అమెరికాలో పెక్కు నగరాల్లో కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహించారు.

యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ కార్మికవర్గ బలమైన పోరాటాలు జరపడం వల్ల ప్రభుత్వాలు దిగివచ్చి కార్మికవర్గానికి అనుకూలంగా కొన్ని చట్టాలు చేశాయి. వాటిలో ముఖ్యమైనవి పనిగంటలకూ, బాల కార్మికులకూ సంబంధించినవి. బ్రిటన్‌లో 13 సంవత్సరాల లోపు పిల్లలతో రోజుకు 9 గంటలకు మించి పని చేయించరాదని 1834లో ఒక ఫ్యాక్టరీ చట్టం చేయబడింది. శ్రామిక ప్రజలు జరిపిన పోరాటాల వల్ల కొన్ని చట్టాలు చేసినా నిరంకుశాధికారులు వాటిని అమలు చేయలేదు.

ఏడాదికేడాది ఫ్యాక్టరీల నిర్మాణం పెరిగిపోతోంది. గనులు, రవాణా రంగాల్లో పనిచేసే కార్మికుల సంఖ్య లక్షల్లో పెరిగింది. కార్మికుల్లో వర్గ చైతన్యం వెల్లివిరిసింది. బలమైన ట్రేడ్ యూనియన్ల నిర్మాణం జరిగింది. కార్మికవర్గ పోరాటాలు బూర్జువా వర్గాలను చుట్టుముట్టాయి.

10 గంటల పని దినం నిర్ణయించాలన్న కోరిక మీద 19వ శతాబ్దం ప్రారంభంలో అమెరికాలో ప్రతి పారిశ్రామిక కేంద్రంలోనూ సమ్మెలు జరిగాయి. ఫిలడెల్ఫియాలోని మెకానిక్ యూనియన్ ఈ 10 గంటల పనిదినం సాధించే పోరాటాన్ని 1827లో ప్రారంభించింది. ఈ పోరాటోధృతిని తట్టుకోలేక అమెరికా ప్రభుత్వం 10 గంటల పనిదినం నిర్ణయిస్తూ శాసనం చేసింది. తర్వాత ఈ 10 గంటల పనిదినం ఉద్యమం అట్లాంటిక్ మహాసముద్రం దాటి యూరప్ ఖండంలో ప్రవేశించి అక్కడి కార్మికవర్గాన్ని ఉత్తేజపరిచింది. యూరప్ ఖండంలో కార్మికులు జరిపిన పోరాటాల ఫలితంగా అనేక దేశాలు 10 గంటల పని దినం అంగీకరిస్తూ చట్టాలు చేశాయి.

1870 నాటికి పారిశ్రామిక, వాణిజ్య, బ్యాంకింగ్ రంగాల్లో గుత్తాధిపత్యం రూపుదాల్చి బలపడింది. పెట్టుబడిదారీ వర్గం కొన్ని ఒడిదుడుకులకు గురయినప్పటికీ అధికలాభాలు పోగేసుకోవడానికి ఆ వర్గాలకు మంచి అవకాశాలు ఏర్పడ్డాయి. కానీ కార్మికవర్గం జీవితాల్లో అభివృద్ధి మాత్రం మృగ్యం. దానితో కార్మికవర్గం పనిగంటల తగ్గింపుకోసం ఉద్యమించింది. 1881 చికాగో నగరంలో వివిధ కార్మిక సంఘాలు కలిసి ఒక సమాఖ్యను నూతనంగా ఏర్పాటు చేసుకున్నాయి. దానికి 'అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్' అని పేరు పెట్టారు. ఈ సమాఖ్య 1884 అక్టోబరు 7న తన 4వ సమావేశంలో 8 గంటల పనిదినం ప్రవేశపెట్టాలని చారిత్రాత్మకమైన తీర్మానం చేసింది. 1886 మే 1న దేశమంతా కార్మికవర్గం 8 గంటల పని హక్కు సాధనకు సమ్మె పోరాటాలను నిర్వహించాలని కూడా నిర్ణయించింది. 8 గంటల పనిదినం ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవలసిన అవసరాన్ని కార్మికవర్గం అత్యంత ముఖ్యమైన డిమాండుగా గుర్తించింది. ట్రేడ్ యూనియన్ల సభ్యత్వం లక్షల్లో పెరిగింది. ఈ విధంగా 8 గంటల పనికోసం అనేకచోట్ల కార్మిక పోరాటాలు ప్రారంభమయ్యాయి.

చికాగో నగరంలోని కార్మికవర్గం అమెరికన్ కార్మికవర్గంలో ఒక భాగమే అయినా అక్కడి కార్మికవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. సమస్యల పరిష్కారానికి వారు పటిష్టమైన విప్లవ దృక్పథం అవలంబించేవారు. ఆ నగరంలోని కార్మిక నాయకులు ఎప్పుడూ కార్మికవర్గాన్ని విప్లవ మార్గాన నడిపిస్తూ ఉండేవారు. సమ్మెకు అనేక రోజులకు పూర్వమే "8 గంటల పని దినం సంఘం" ఒకటి అనేక రాజకీయ దృక్పథాలు గలవారితో ఏర్పడి పనిచేస్తోంది. ఆ సంఘం నాయకత్వంలో ఏప్రిల్ 30న (మేడేకి ఒకరోజు ముందు) 25 వేల మంది కార్మికులతో బ్రహ్మాండమైన ప్రదర్శన జరిగింది. మే 1న చికాగో నగరంలో కార్మికవర్గం చైతన్యం వెల్లివిరిసింది. నగరవీధులన్నీ ఉత్సాహవంతులైన కార్మికులతో నిండిపోయాయి. నగరంలో బ్రహ్మాండమైన సార్వత్రిక సమ్మె జరిగింది. కార్ఖానాలన్నీ మూతపడ్డాయి. అదివరకెన్నడూ కనీవినీ ఎరుగనంతటి ఐకమత్యంతో మూడున్నర లక్షల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. నగర వీధులన్నీ కార్మిక సందోహంతో నిండిపోయాయి. 8గంటల పనిదినాన్ని సాధించి తీర్తామనే దృఢ విశ్వాసం వారందరిలోనూ కనిపించింది. సమ్మెను విజయవంతం చేయడానికి వారు సర్వ శక్తులనూ ఒడ్డటానికి సిద్ధమయ్యారు. కార్మికవర్గ శత్రువులు కూడా విజృంభిస్తున్న ఈ కార్మికవర్గ ఉద్యమాన్ని ఏ విధంగానైనా నాశనం చేయాలని నిర్ణయించుకున్నారు. పెట్టుబడిదారీ వర్గానికి అండగా ప్రభుత్వం కూడా రంగ ప్రవేశం చేసింది.

మే 3న శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మిక జనసమూహంపై అమెరికన్ పోలీసులు కాల్పులు జరిపారు. ఆరుగురు కార్మికులను బలి తీసుకున్నారు. ఈ దారుణ హత్యాకాండ పట్ల అసమ్మతి తెలిపేందుకు మే 4న నగరం మధ్యలో ఉన్న హే మార్కెట్‌లో కార్మికులు పెద్ద ఎత్తున నిరసన సభ జరిపారు. ప్రశాంతంగా సాగుతున్న ఆ సభ మీద పోలీసులు విరుచుకుపడ్డారు. మధ్యలో బాంబు ప్రయోగం జరిగింది. ఒక పోలీసు సార్జెంట్ చనిపోయాడు. అది సాకుగా తీసుకొని పోలీసులు నిరాయుధులైన ప్రజలపై తుపాకులతో.. సన్నీలతో స్వైరవిహారం చేశారు. అయినప్పటికీ నిరాయుధులైన కార్మికులు సంఘటితంగా చైతన్యదీప్తితో పోలీసులతో బాహాబాహిగా తలపడ్డారు. ఈ సంఘర్షణలో ఏడుగురు పోలీసులు చనిపోగా.. నలుగురు కార్మికులు నేలకొరిగారు. పాలకులు అదనపు బలగాలను రంగంలోకి దింపారు. హే మార్కెట్ ప్రాంతం కార్మికుల రక్తంతో తడిసిపోయింది. అక్కడే ఆవిర్భవించింది ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది శ్రమజీవుల స్వేచ్ఛా సంకేతమైన "అరుణపతాకం".

హే మార్కెట్ ఉదంతాన్ని పురస్కరించుకొని బూర్జువా ప్రభుత్వం కార్మికోద్యమ నాయకులను చుట్టివేసే కార్యక్రమం ప్రారంభించింది. న్యాయస్థానం ముందు విచారణ తతంగం జరిపి పార్సన్స్, స్పీస్, ఫిషర్, ఏంగెల్ అనే కార్మిక నాయకులను ఉరి తీయించింది. మరికొందరిని దీర్ఘకారాగార శిక్షలకు గురిచేసింది. తనను ఉరితీసే ముందు స్పిస్ ఇలా అన్నారు. "మమ్మల్ని ఉరితీస్తే మంటలు ఆరిపోతాయను కుంటున్నారా? ఇదిగో అక్కడ, ఇక్కడ, ఆమూలు, ఈమూల, మీ వెనుక, మీ ముందు అన్నిచోట్లా జ్వాలలు చెలరేగుతాయి. అది అంతర్వాహిని. దాన్ని ఆర్పడం మీ తరంకాదు". దేశమంతా ఇతర కేంద్రాల్లో కూడా ఈ దమనకాండ కొనసాగింది. అయినప్పటికీ అమెరికన్ కార్మికుల్లో మాత్రం మే1న విప్లవ చైతన్యం వెల్లివిరిసింది. ప్రతి కార్మికుడూ వర్గ చైతన్యాన్ని ప్రదర్శించడానికి వీధుల్లోకి వచ్చాడు.

ఆ విధంగా 1886 మే 1న ప్రపంచ కార్మిక వర్గ విప్లవ చరిత్రలో రక్తాక్షరాలతో లిఖించదగిన తేదీగా మారిపోయింది. ఆనాటి పోరాటోద్యమానికి చికాగో నగరమే కేంద్రమయినప్పటికీ దేశంలోని అనేక ముఖ్య నగరాలకు ఆ ఉద్యమం వ్యాపించింది. న్యూయార్క్, బాల్టిమోర్, వాషింగ్టన్, పిట్స్‌బర్గ్, డిట్రాయిడ్ మొదలైన పెద్ద నగరాల్లోని శ్రామికులు కూడా మహోత్తేజంగా పోరాటంలోకి దూకారు. ప్రపంచవ్యాప్తంగా శ్రమజీవులను ఉత్తేజపరిచి వారిలో ఆశాజ్యోతిని వెలిగించింది మే దినోత్సవం.

హక్కుల కోసం పోరాటం



కార్మిక, కర్షకుల కోసం వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం కార్మిక హక్కులు పరిరక్షించుకునేందుకే నేడు కార్మికుల దినోత్సవంగా మేడేను జరుపుకుంటున్నాం. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేసి కార్మికుల హక్కులను హరించింది. కార్మికుల హక్కులను కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా కర్షక, కార్మికుల కోసం వారి హక్కుల కోసం ఎర్రజెండా సాక్షిగా పోరాటాన్ని ఉధృతం చేస్తాం.

- పంచాది లతాదేవి, సిఐటియు నాయకులు

కార్మిక హక్కులు కాలరాత

బ్రిటీష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికుల ప్రాథమిక హక్కులను హరించేందుకు పూనుకున్న కేంద్రంలో బిజెపి, దానికి వత్తాసు పలుకుతున్న వైసిపి ప్రభుత్వం కార్మిక ద్రోహులుగా మిగిలిపోతారు. ఇందిరాగాంధీ బ్యాంకులు జాతీయం చేస్తే... ప్రధాని మోడీ ప్రభుత్వం ప్రయివేటీకరణ చేస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటీకరణ చేసి చేసి రిజర్వేషన్లు అమలు కాకుండా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుంది. అదాని, అంబానీలకు దేశ సంపదను కారు చౌకగా అమ్మి కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తున్నారు. పెన్షన్ పొందడం ఉద్యోగి ప్రాథమిక హక్కు అని సుప్రీం కోర్టు 1982లో తీర్పు



ఇచ్చింది. సమాన పనికి సమాన వేతనం అందించాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చినా పాలకులు స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది. కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య ఉద్యమమే శరణ్యం.

- అనపాన షణ్ముఖరావు, ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి

పారిశ్రామికాభివృద్ధి జాడ ఏదీ..?

- పట్టాలెక్కని కొత్త యూనిట్లు
- సంక్షోభంలో జ్యూట్
- ఒక్కొక్కటిగా మూతపడుతున్న పరిశ్రమలు
- రోడ్డున పడుతున్న కార్మికులు

జిల్లాలో గతేడాది పారిశ్రామికంగా పెద్దగా పురోగతి కనిపించలేదు. అడపాదడపా పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చినా పట్టాలెక్కలేదు. పరిశ్రమలు, పెట్టుబడులు అంటూ ప్రభుత్వం చెప్తున్నా, జిల్లాకు పెద్దగా వచ్చిన పరిశ్రమలు గానీ కార్మికులకు అదనంగా ఉపాధి కల్పించిన దాఖలాలు గానీ లేవు. పరిశ్రమలకు కావాల్సిన అనుమతులు పలు స్థాయిల్లో పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. భూసేకరణ, ఇతర సమస్యలూ లేకపోలేదు. పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయని ఆశించిన యువతకు నిరాశే మిగులుతోంది. మరోవైపు ముడిసరుకులు, విద్యుత్ నిర్వహణ భారంతో ఒక్కొక్కటిగా పరిశ్రమలు మూతపడ్డాయి. కొత్త పరిశ్రమలు జిల్లాకు రాకపోవడం, ఉన్నవి మూతపడడంతో వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో అధికారిక లెక్కల ప్రకారం ఇథనాల్, పేపర్, ఫార్మాస్యూటికల్స్ పవర్ జనరేషన్, గ్రానైట్ వంటి భారీ, మెగా పరిశ్రమలు 40 వరకు ఉన్నాయి. వీటి ద్వారా 63,070 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు ప్రభుత్వం లెక్కలు చెప్తోంది. వీటితోపాటు రైస్ మిల్లులు, జీడిపప్పు పరిశ్రమలు, పేపర్ ప్లేట్ ఉత్పత్తులు, పాలిథిన్ క్యారీ బ్యాగులు, ఇత్తడి వంటి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు 4,083 పరిశ్రమలు ఉన్నాయి. జిల్లాకు పెట్టుబడులు, పరిశ్రమలు వస్తాయని ప్రభుత్వం చెప్పినా అవి కాగితాల్లోనే కనిపిస్తున్నాయి. రణస్థలం మండలం సంచాంలో ఏడాదికి 9 వేల మెట్రిక్ టన్నుల మందుల ఉత్పత్తితో రూ.350 కోట్లతో బల్క్ డ్రగ్ ఉత్పత్తులను ప్రారంభించేందుకు హైయాసింథాస్ ఫార్మా ప్రయివేట్ లిమిటెడ్ ముందుకొచ్చింది. పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. పరిశ్రమకు కావాల్సిన 11.41 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పగించాల్సి ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేయనున్న ప్రాంతం అనువైనదేనని అధికారులు తనిఖీ చేసి నిర్ధారించారు. ఇప్పటికీ భూమి అప్పగింతతో ఆలస్యమవుతోంది. రణస్థలం మండలం చిట్టివలసలో రూ.720 కోట్లతో ఏడాదికి 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ఔషధాలు ఉత్పత్తి చేసేందుకు సంబంధిత యాజమాన్యం ముందుకొచ్చింది.

పరిశ్రమలో ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా వెయ్యి మందికి ఉపాధి కల్పించేందుకు అంగీకరించింది. పరిశ్రమకు 13.91 ఎకరాల భూమి కావాల్సి ఉంది. అందుకు సంబంధించిన ఫైల్ ప్రస్తుతం భూ పరిపాలన ముఖ్య కమిషనర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉంది. పరిశ్రమ ఏర్పాటు చేసే ప్రాంతం అనువైనదేనని అధికారులు నిర్ధారించారు. ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతులు రాలేదు. ఎచ్చెర్ల మండలం అల్లినగరంలో రూ.65 కోట్లతో రసాయనిక పరిశ్రమ ఏర్పాటుకు ఎన్ఎసిఎల్ ముందుకొచ్చింది. పరిశ్రమలో 200 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి.

సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలదీ అదే పరిస్థితి

శ్రీకాకుళం మండలం సింగుపురం గ్రామంలో అపో్ప అథంటిక్ రాక్స్ రూ.5.56 కోట్ల పెట్టుబడితో పరిశ్రమను నెలకొల్పి 20 మందికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. కోటబొమ్మాళి మండలం జర్జంగిలో రూ.27.25 లక్షలతో మారుతీ సామిల్లు టింబర్ డిపో ఏర్పాటు చేసి ఆరుగురికి ఉపాధి కల్పిస్తామని అంగీకరించింది. ఈ రెండు ప్రతిపాదనలు ఫ్యాక్టరీస్ ఆఫ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయి.



ఖాయిలాకు సాయం... మాటలకే పరిమితం

జిల్లాలో ఖాయిలా పడిన పరిశ్రమలపై పాలకులు సర్వేలతోనే సరిపెడుతున్నారు. పరిశ్రమలకు ఊతం ఇచ్చేలా ఆర్థిక భరోసా కల్పించడం లేదు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత గతేడాది అక్టోబరులో పరిశ్రమలపై సమగ్ర సర్వే ప్రారంభించింది. ఎగుమతులు, దిగుమతుల వివరాలు, రుణ అవసరాలు, మార్కెటింగ్, ఆర్థిక కార్యకలాపాలపై పరిశ్రమలశాఖ సిబ్బంది, వార్డు గ్రామ సచివాలయాల సిబ్బంది సర్వే నిర్వహించారు. సర్వే కూడా అసంపూర్ణంగానే సాగింది. 2,516 పరిశ్రమలను సర్వే చేయాల్సి ఉండగా 1919 పరిశ్రమలను సర్వే చేశారు. ఇంకా 597 పరిశ్రమలకు సంబంధించిన సర్వే ఇప్పటికీ పెండింగ్‌లో ఉంది. టిడిపి ప్రభుత్వ హయాంలో 2018లో ఒక పర్యాయం సర్వే చేశారు. సర్వే చేపట్టేందుకు పరిశ్రమల శాఖ అధికారులు సిద్ధమవుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఎ), పట్టణ ప్రాంతాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సిబ్బందితో సర్వే నిర్వహించారు. అదీ అర్ధాంతరంగానే నిలిచిపోయింది.

ఒడిదుడుకుల్లో జీడి, గ్రానైట్

జిల్లాలో 300 పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో 10 నుంచి 12 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. రోజుకు 125 టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వం కస్టమ్స్ డ్యూటీని 5 శాతం నుంచి 2.5 శాతానికి తగ్గించిన తర్వాత జీడిపప్పు ఉత్పత్తి, అమ్మకాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. పరిశ్రమలను నిర్వహించలేక వంద వరకు మూతపడ్డాయి.

జిల్లాలో మొత్తం 249 కలర్ గ్రానైట్ పరిశ్రమలు ఉన్నాయి. ప్రస్తుతం వీటిలో 188 పనిచేస్తున్నాయి. క్వారీల నిర్వహణ పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. కరోనా ప్రభావం నిర్మాణ రంగం, ప్రభుత్వ అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతోంది. దీంతో కంకర, చిప్స్ వంటి మెటీరియల్‌కు డిమాండ్ తగ్గింది. ఫలితంగా క్వారీల్లో తవ్వకాలు నిలిచిపోతున్నాయి. జిల్లాలో 141 క్వారీలు ఉండగా ప్రస్తుతం 15 పరిశ్రమలు మూతపడడంతో వందలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు.

సంక్షోభంలో జ్యూట్ పరిశ్రమలు

జిల్లాలో 12 జ్యూట్ మిల్లులున్నాయి. వాటిలో ప్రస్తుతం ఏడు నడుస్తుండగా, ఐదు చోట్ల మూతపడ్డాయి. జ్యూట్ ముడిసరుకు ధరలు, ఇతర మెటీరియల్ ఊహించని రీతిలో పెరుగుతున్నాయి. బంగ్లాదేశ్, నేపాల్ నుంచి పెద్దఎత్తున గోనె సంచులు, జ్యూట్ పురితాళ్లు దిగుమతి కావడం జ్యూట్ ఉత్పత్తుల కొనుగోళ్లు రోజురోజుకీ పడిపోతుండడం, ప్లాస్టిక్ సంచుల వినియోగం పెరగడం మరో కారణంగా ప్రస్తావించారు. బంగ్లాదేశ్, నేపాల్ దేశాలు జ్యూట్ ఉత్పత్తులకు ఎగుమతి పన్ను మినహాయింపు ఇవ్వడంతో పాటు సబ్సిడీలు ఇస్తుండడంతో వారు తక్కువ ధరలకే ఉత్పత్తులను అమ్మగలగడంతో ఇక్కడి ఉత్పత్తులు పోటీ పడలేకపోతున్నాయి. బెంగాల్, బీహార్, అస్సాంల నుంచి దిగుమతి చేసుకునే ముడిసరకుల రవాణకు సబ్సిడీ, జ్యూట్ పురితాళ్లు, జ్యూట్ దారాలపై జిఎస్‌టి తగ్గింపు వంటి సిఫార్సులతో 2019 నవంబరులో అప్పటి కలెక్టర్ పంపిన నివేదికలు బుట్టదాఖలయ్యాయి.

విశాఖ స్టీల్ పోరాటం ప్రభుత్వరంగ రక్షణలో భాగమే

దేశంలోని అన్ని స్టీల్‌ప్లాంట్లకు ఇనుప ఖనిజం లభిస్తున్నది. అందరి కంటే ఎక్కువ ధరకు మార్కెట్‌లో కొనుక్కొనే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మాత్రం ముడి ఖనిజం అందుబాటులో ఎందుకు లేదు? అన్ని స్టీల్‌ప్లాంట్లకు ముడి ఖనిజం, బొగ్గు సప్లయ్ చేసే రైల్వే ర్యాక్‌లు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు లభ్యం కావు? గత 30 సంవత్సరాల నుంచి ఉత్పత్తికి కావలసిన పెట్టుబడులకు ఎన్నడూ కొదవలేదు. కానీ గత సంవత్సరంలో రూ.945 కోట్లు లాభాలు వచ్చినా ముడిసరుకు కొనడానికి పెట్టుబడులు లేవనే వంకతో నేడు యాజమాన్యం ఎక్స్ ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్ (ఐఒపి)ని ఏకపక్షంగా ప్రకటించింది. ప్రైవేటు వారిని ఏదో రూపంలో దూర్చడానికి బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందని అధికారులు, కార్మికులు భావిస్తున్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం దుర్మార్గంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలని కుట్ర చేస్తున్నా రాష్ట్రం లోని అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్, ప్రతిపక్ష తెలుగుదేశం తగినట్లుగా స్పందించడం లేదు. ఈ పార్టీల ఎంపీలు కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా ప్రశ్నలు వేస్తున్నారు. కేంద్ర బిజెపి తప్పుడు సమాచారంతో వీరి నోరు మూయిస్తున్నది. రాష్ట్ర ప్రజలను బిజెపి పక్కదారి పట్టించి గందరగోళ పరుస్తున్నది. విశాఖ స్టీల్‌ప్లాంట్ లోని 4 వేల ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలని వైసిపి డిమాండ్ చేస్తోంది. పోస్కో, అదానీలకు విశాఖ స్టీల్‌ప్లాంట్, అందులోని మిగిలిన భూములను రాష్ట్ర ప్రభుత్వం దొంగలు దొంగ లు ఊళ్ళు పంచుకున్న ట్లుగా పంచుకోవాలని పన్నాగాలు పన్నుతున్నారు. వాస్తవ రాజకీయ పరిస్థితిని ప్రజలు అర్థం చేసుకొని ఏప్రిల్ 1న రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు తెలియజేయాలని కోరుతున్నాం.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం అమ్మాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం 27.1.2021న నిర్ణయించింది. అప్పటి నుండి విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 26 నెలల నుంచి నిరవధిక పోరాటం సాగుతున్నది. విశాఖ నగరంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన దీక్షలు ప్రారంభించి ఏప్రిల్ 1వ తేదీకి 700 రోజు లు కావస్తున్నది. ఆ రోజున విశాఖలో భారీ మానవ హారం జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలపాలని రాష్ట్ర కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు పిలుపు నిచ్చాయి. ఈ పోరాట ఫలితంగానే నేటకీ ఒక్క శాతం కూడా విశాఖ స్టీల్‌ప్లాంట్ వాటాలు అమ్మకుండా అడ్డుకోగ లిగింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం పూర్తియ్యే నాటికి సరళీకరణ విధానాలు దేశంలో ప్రారంభమైనాయి. అప్పటి నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పెట్టుబడులు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వాలు నిరాకరించాయి. కేవలం రూ.5 వేల కోట్లు పెట్టుబడులతో కేంద్ర ప్రభుత్వం నిధులు అపేసింది. కానీ విశాఖ స్టీల్ తమ సొంత లాభాలతోనే స్టీల్‌ప్లాంట్‌ను ఒక మిలియన్ టన్నుల నుంచి 7.2 మిలియన్ టన్నుల సామర్థ్యానికి విస్తరించింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ సుమారుగా రూ.50 వేల కోట్ల పన్నులు, డివిడెండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించింది. 2000 సంవత్సరంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌కు అమ్మాలన్న నాటి వాజ్‌పేయి ప్రభుత్వ ప్రయత్నాలను స్టీల్ కార్మికులు పోరాటాలతో వమ్ము చేశారు.

భారతదేశంలో స్వాతంత్ర్యం అనంతరం సోషలిస్ట్ దేశాల సహాయంతో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల స్థాపనతో అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాం. భారత ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడానికి ప్రభుత్వ రంగ పరిశ్రమలు ముందు పీఠిన నిలబడ్డాయి. దేశంలో అత్యంత వెనుకబడిన ప్రాంతాలు పారిశ్రామిక ప్రాంతాలుగా ఎదిగి నేడు అభివృద్ధి ప్రాంతాలుగా మారాయి. ఉపాధి భారీగా పెరిగింది. ఎస్‌టి, ఎస్‌సి, బిసి లకు ఉపాధి లభించింది. అభివృద్ధి చెందిన ప్రభుత్వ రంగాన్ని అమాంతంగా మింగేయడానికి పాలకవర్గం 1991 నుంచి సరళీకరణ విధానాలను ప్రవేశపెట్టింది. గతంలో కాంగ్రెస్, నేడు బిజెపి పోటీ పడి మరీ ఈ విధానాలను అమలు చేస్తున్నాయి. దేశ సంపదైన భూములు, గనులు, భారీ పరిశ్రమలు, సముద్ర తీరాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. "పరిశ్రమలను నడపం. భారీ పరిశ్రమలన్నింటిని అమ్మేస్తాం లేదా మూసివేస్తాం" అనే తప్పుడు విధానాన్ని బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లోనే ప్రకటించింది. ఈ విధానాలను అమలు చేయడానికి నిస్సిగ్గుగా ప్రయత్నిస్తున్నది. భారీ పరిశ్రమలను స్వదేశీ, విదేశీ కంపెనీలకు కారుచౌకగా అమ్మడం దేశద్రోహం. రాష్ట్రంలోకెల్లా భారీ పరిశ్రమలకు మణిహారమైన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను దక్షిణ కొరియా పోస్కోకు, అదానీకి అమ్మేపనిలో బిజెపి కేంద్ర ప్రభుత్వం నేడు తలమునకలుగా వున్నది.

దేశంలో అన్ని ప్రైవేట్, ప్రభుత్వ రంగ స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులున్నాయి. కానీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎన్ని పోరాటాలు చేసినా సొంత గనులను కేంద్ర ప్రభుత్వాలు ఇవ్వడానికి నిరాకరించాయి. సొంత గనులున్న స్టీల్ ఆథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్)లో కలపడానికి కేంద్ర ప్రభుత్వం మోకాలు అడ్డుతున్నది. పార్లమెంట్‌లో నిరాకరిస్తూ సమాధానం చెప్పింది. దీనివలన సొంత గనులున్న స్టీల్‌ప్లాంట్‌కు ఒక్క టన్ను ఇనుప ఖనిజం రూ. 700 అయితే...విశాఖ స్టీల్‌ప్లాంట్ మార్కెట్‌లో టన్ను రూ. 5 వేల నుంచి రూ. 7 వేలకు కొనవలసి వస్తున్నది. దేశంలో ఏ స్టీల్‌ప్లాంట్‌కు పక్కనే సముద్రం లేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు పోర్టు నిర్మించడానికి తీసుకున్న భూములతో సహా ఉచితంగా గంగవరం పోర్టును ప్రైవేట్ వారికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అప్పగించాయి. పక్కనే సముద్రం వున్నా ఆ ఆదాయాలు అదానీకి సొంతమయ్యాయి. నేడు సాలీనా 7.2 మిలియన్ల సామర్థ్యం వున్నప్పటికీ 4.5 మిలియన్ల టన్నుల సామర్థ్యంతోనే విశాఖ స్టీల్ నడుస్తోంది. కేంద్ర బిజెపి ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ లోని కీలకమైన విభాగాల్లో ఉత్పత్తిని భారీగా తగ్గించి నష్టాల్లోకి నెట్టింది.

దేశవ్యాప్తంగా కిసాన్ మోర్చా, రైతు సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాలు మనకు ఆదర్శం. విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని ఆపాలి. విశాఖ స్టీల్‌కు సొంత గనులు కేటాయించాలి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలి. ఈ డిమాండ్లను సాధించేవరకు విశాఖ స్టీల్ ప్లాంట్ పోరాటం నిరంతరంగా కొనసాగుతుంది. ◆

- సిహెచ్. నరసింగరావు,
విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్

మేడే శుభాకాంక్షలు

కార్మిక సోదరులకు, ఉద్యోగులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు

NAGARJUNA NACL

With best compliments from :-

NACL Industries Limited

(formerly known as Nagarjuna Agrichem Limited)

(ISO 9001:2008; ISO 14001:2004 & ISO 45001:2018 Certified Company)



Manufacturer and Exporter of high quality Agrochemicals

Arinama Akkivalasa, P.O. Allinagaram,
Etcherla Mandal,
SRIKAKULAM - 532 403. A.P. India
Ph. : (0091 8942) 256400, 256401, 231172
E.mail: naclpna@naclind.com

మేడే శుభాకాంక్షలు

కార్మికులకు, కర్షకులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు, విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలకు, అధికారులకు అందరికి మేడే శుభాకాంక్షలు

అధ్యక్షులు: లింగాల వరదరాజు ప్రధానకార్యదర్శి: మన్మం రమణ

నాగార్జున అగ్రికెమ్ వర్కర్స్ యూనియన్

రి.నెం.డి/DCL/SKL/04/2010) సి.ఐ.టి.యు.అనుబంధం

అరినాం అక్కివలస, అల్లినగరం పోస్టు, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం జిల్లా.
సెల్: 9951558849, 9618585358

"మేడే" శుభాకాంక్షలు

సంపదను సృష్టించడంలో విశేష కృషి చేస్తున్న శ్రామికులకు, వారి అభ్యున్నతికి బాటలు వేస్తున్న మిత్రులందరికీ హృదయపూర్వక శ్రామిక దినోత్సవ సందర్భంగా మేడే శుభాకాంక్షలు

ఆశా వర్కర్స్ యూనియన్

రణస్థలం మండలం, శ్రీకాకుళం

మేడే శుభాకాంక్షలు

ప్రపంచ కార్మిక పర్వదినం మేడే...
కార్మిక వర్గ పోరాటాలకు స్ఫూర్తినిచ్చే మేడే...
కార్మిక వర్గ చైతన్యంతో నవ సమాజ నిర్మాణానికి
ఈ మేడే స్ఫూర్తి కావాలని కోరుకుంటూ...

శ్యామ్ క్రగ్ ఫిట్టింగ్స్ & రింగ్స్ స్టాఫ్ & వర్కర్స్ యూనియన్

D/1954/2003 (సిఐటియు అనుబంధం),
అరినాం అక్కివలస, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం జిల్లా.

మేడే శుభాకాంక్షలు

శ్రామిక దినోత్సవం సందర్భంగా శ్రామికులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, శ్రామికుల అభ్యున్నతికి పాటుపడే ప్రతీ ఒక్కరికీ హృదయపూర్వక మేడే శుభాకాంక్షలు

ఆశా వర్కర్స్ యూనియన్

ఆమదాలవలస

మేడే శుభాకాంక్షలు

శ్రామిక దినోత్సవం సందర్భంగా శ్రామికులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, శ్రామికుల అభ్యున్నతికి పాటుపడే ప్రతీ ఒక్కరికీ హృదయపూర్వక మేడే శుభాకాంక్షలు

ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్

బూర్జ మండలం, శ్రీకాకుళం జిల్లా

మేడే శుభాకాంక్షలు

శ్రామిక దినోత్సవం సందర్భంగా శ్రామికులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, శ్రామికుల అభ్యున్నతికి పాటుపడే ప్రతీ ఒక్కరికీ హృదయపూర్వక మేడే శుభాకాంక్షలు

మీ..

శ్రేయోభిలాషి

మే డే శుభాకాంక్షలు

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులకు, కర్షకులకు, అధికారులకు, నాయకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మేడే శుభాకాంక్షలు తెలుపుతూ...

వి.ఆర్.ఎ ల సంఘం

ఆమదాలవలస

మేడే శుభాకాంక్షలు

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులకు, కర్షకులకు, అధికారులకు, నాయకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మేడే శుభాకాంక్షలు తెలుపుతూ...

SMARTCHEM EMPLOYEES UNION

(Regd No.D/1943/2003, Affiliated to CITU)
PONNADA, ETCHERLA MANDAL, SRIKAKULAM DIST.

"మేడే" శుభాకాంక్షలు

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులకు, కర్షకులకు, అధికారులకు, నాయకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు మేడే శుభాకాంక్షలు తెలుపుతూ...

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం

శ్రీకాకుళం జిల్లా కమిటీ

మేడే శుభాకాంక్షలు

కార్మిక సోదరులకు, ఉద్యోగులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు ఇవియే మేడే శుభాకాంక్షలు

అంగన్వాడీ వర్కర్స్ & హెల్పర్స్ యూనియన్

రణస్థలం మండలం, శ్రీకాకుళం జిల్లా

మేడే శుభాకాంక్షలు

కార్మిక సోదరులకు, ఉద్యోగులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు ఇవియే మేడే శుభాకాంక్షలు

ఆశావర్కర్స్ యూనియన్

బూర్జ పి.హెచ్.సి, బూర్జ మండలం, శ్రీకాకుళం జిల్లా

మేడే శుభాకాంక్షలు

కార్మిక, కర్షక, శ్రామిక, ఉద్యోగ, ఉపాధ్యాయ మిత్రులకు అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు

వేర్ హౌసింగ్ కళాసీల మరియు విశాఖ డైరి ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ కళాసీల సంఘం

ఆమదాలవలస









కార్మికుల హక్కుల కోసం పోరాటం

ప్రయివేటీకరణ, సరళీకరణ విధానాలు తీవ్రంగా అమలవుతున్న నేపథ్యంలో పోరాడి సాధించుకున్న హక్కులపై పాలక వర్గాలు దాడిచేస్తున్నాయి. సమ్మె, యూనియన్ ఏర్పాటు, ఉమ్మడి బేరసారాలు, వేతనాలు, సామాజిక భద్రతల హక్కులు కుదిస్తున్నారు. పర్మినెంట్ ఉద్యోగాల స్థానంలో నిర్ణీత కాలవ్యవధి ఉద్యోగాలుగా మార్పు చెందాయి. కార్మికులను అపరిమితంగా తొలగించే అధికారాలు చట్టసభల ఆమోదం పొందాయి. మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్స్ ద్వారా కార్మిక హక్కులపై దాడి తీవ్రతరం చేసింది. ఈ నేపథ్యంలో 1886 మే నెలలో చికాగో నగరంలో 8 గంటల పనిదినం కోసం జరిగిన కార్మిక పోరాటం మేడేగా ప్రసిద్ధికెక్కింది. ఆ తరువాత కాలంలో ప్రపంచంలోని అన్ని దేశాల్లో కార్మికవర్గం 8 గంటల పనిదినాన్ని సాధించింది. పని గంటలే కాకుండా ఇతర హక్కులనూ సంపాదించుకుంది. ప్రస్తుతం కార్మిక హక్కులను నిలుపుకునేందుకు మరో పోరాటం చేయాల్సి చేస్తోంది. అందుకని మేడే దినోత్సవాన్ని కార్మిక హక్కుల దినోత్సవంగా జరుపుకోవాలి. ఒక్కరోజుకే పరిమితం కాకుండా మేడేను వారోత్సవాలుగా నిర్వహించాలి. జెండా ఆవిష్కరణలు, ఊరేగింపులు, సభలు, సాంస్కృతిక ప్రదర్శనలతో మేడే వారోత్సవాలు విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ పిలుపునిచ్చింది.

– పి.తేజేశ్వరరావు,
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

నూతన విద్యా విధానంతో పేదలకు విద్య దూరం



నూతన విద్యా విధానం పేరిట ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారు. తరగతుల విలీనం పేరిట పేద పిల్లలకు సైతం కార్పొరేట్ విద్యకు దగ్గర చేస్తున్నారు. ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి అందుకు భిన్నంగా మారుతోంది. సకాలంలో జీతాలు చెల్లింపులు మొదలు యాప్‌ల పేరిట వేధింపులు, ఉన్నతాధికారుల వైఖరి ప్రజల్లో చులకన భావానికి దారితీస్తున్న పరిస్థితులు ఉన్నాయి. అభివృద్ధి అంటే ఉత్పత్తి, ఉత్పత్తి చేసేవారే శ్రామికులు. మానవ శ్రమ లేనిదే ఉత్పత్తి లేదు. కరోనా నేర్పిన పాఠం ధనిక దేశాలు సైతం గుణపాఠంగా భావించాల్సి వచ్చింది. యంత్రాల కన్నా మానవ శ్రమ అవసరాన్ని సంపన్న దేశాలు గుర్తించాలి. దేశంలో ఉత్పత్తి చేసే శ్రామికులకు ప్రోత్సాహం లేకుండా బడా పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు ప్రోత్సాహకాలు ఇస్తూ... ధనికులను మరింత ధనికులుగా చేయడమే అవుతుంది. కార్పొరేటీకరణకు ఇది నిదర్శనం. ఇది మారనంత కాలం అభివృద్ధి సాధ్యం కాదు. నిజమైన అభివృద్ధి అంటే శ్రమకు తగిన విలువ ఇవ్వడం శ్రమ విలువను సమాజం గుర్తించాలి.

– సంపతిరావు కిషోం కుమార్
జిల్లా ప్రధాన కార్యదర్శి, యుటిఎఫ్









పెరిగిన కార్మికవర్గ పోరాటాలు

జిల్లాలో గతేడాది కాలంలో అనేక కార్మికవర్గ పోరాటాలు సాగాయి. ముఖ్యంగా పారిశ్రామిక కార్మికులు వేతన ఒప్పందం అమలు, పనిదినాల తగ్గింపు, కార్మికుల తొలగింపుపై పలురూపాల్లో ఆందోళనలు కొనసాగించారు. పోరాటాలకు దిగొచ్చిన యాజమాన్యాలు కొన్నిచోట్ల కార్మికుల డిమాండ్లను నెరవేర్చగా కొందరు యాజమానులు మొండికేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీమ్‌వర్కర్లు కనీస వేతనాలు, పనిభద్రతపై పలురూపాల్లో ఆందోళనలు సాగించారు. ప్రభుత్వం ఒకవైపు అరెస్టులు, గృహ నిర్బంధాలతో ఉద్యమాలను అణచివేసేందుకు ప్రయత్నించినా కార్మికులు వాటికి వెరవకుండా పోరు సాగించారు.



- **వేతన ఒప్పందం, పనిదినాలపై నిరంతర ఆందోళనలు**
- **హక్కుల సాధనకు ఉద్యమించిన స్కీమ్‌వర్కర్లు**
- **పోరాటాలతో నెరవేరిన పలు డిమాండ్లు**
- **కొనసాగిన ప్రభుత్వ నిర్బంధం**

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రణస్థలం మండలం బంటుపల్లిలోని యునైటెడ్ బ్రేవరీస్ యాజమాన్యం ప్రభుత్వం మద్యం ఆర్డర్లను తగ్గించిందనే పేరుతో పనిదినాలు తగ్గించేసింది. కొంతమందిని పనుల్లో నుంచి తొలగించింది. కార్మికులతో కలిసి సిఐటియు పలురూపాల్లో ఆందోళన నిర్వహించడంతో, యాజమాన్యం కార్మికులను పనిలోకి తీసుకోవడంతో పాటు రెండు సంవత్సరాలు సంపాదిత సెలవులను మంజూరు చేసింది. శ్యామ్‌క్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ ప్లాంట్-2 పెండింగ్ బోనస్, వేతన బకాయిల కోసం నిరసన తెలిపిన కార్మికులను యాజమాన్యం 2012 నవంబరులో 570 మందిని నిలిపేసింది. యాజమాన్యం తీరుపై కార్మికులు తీవ్ర పోరాటం సాగించారు. అరబిందో ఫార్మా వేతన ఒప్పందం అమలు చేసేందుకు మొండికేస్తోంది. అధికారంలో వైసిపి ప్రభుత్వం అండతో కార్మిక చట్టాలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తోంది. క్రమశిక్షణ పేరుతో 200 మంది కార్మికులను తొలగించడంతో పాటు వేధింపులకు పాల్పడుతోంది. అక్రమ కేసులు బనాయిస్తోంది. యూనియన్ విచ్ఛిన్నానికి రకరకాలుగా ప్రయత్నాలు సాగిస్తోంది. అక్రమ కేసులు, వేధింపులు, తొలగింపులకు వెరవకుండా కార్మికులు పోరు సాగిస్తూనే ఉన్నారు. నాగార్జున అగ్రికెమ్‌లో వేతన ఒప్పందం విషయంలో యాజమాన్యం పెట్టిన షరతులకు వ్యతిరేకంగా కార్మికులు చేపట్టిన ఆందోళనకు యాజమాన్యం దిగొచ్చి ఈ ఏడాది అక్టోబర్‌లో ఒప్పందం కుదిరింది. స్మార్ట్‌కెమ్‌లో కార్మికుల ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్ అమలు చేయించుకోవడంతో కార్మికులు విజయం సాధించారు.


పోరాటాలతో నెరవేరిన పలు డిమాండ్లు

మున్సిపల్ కార్మికులు పలురకాల పోరాటాలు సల్పి విజయాలు సాధించారు. శ్రీకాకుళం కార్పొరేషన్, పలాస, ఆమదాలవలస, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ కార్మికుల తరుపున పోరాడింది. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఇసుక విధానంతో పనులు కోల్పోయిన భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై అనేక ఆందోళనలు సాగించింది. ప్రభుత్వపరంగా వారికి రావాల్సిన సంక్షేమ పథకాల అమలు కోసం పోరాడింది. పొందూరు మండలం రాజ్యలక్ష్మి పోల్స్‌లో ఐదుగురు కార్మికులను తొలగించడంతో సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు 110 రోజులు సమ్మె చేశారు. ఆందోళనలకు దిగొచ్చిన యాజమాన్యం వారిని పనిలోకి తీసుకుంది. పొందూరు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న కార్మికులను తీసేయడంతో కార్మికులు పలురూపాల్లో ఆందోళన చేయడంతో యాజమాన్యం వారిని తిరిగి పనులు కల్పించింది. మందస మండలంలో రైస్‌మిల్లు కార్మికుల వేతన ఒప్పందంపై పలురూపాల్లో ఆందోళనలు చేపట్టిన తర్వాత 25 శాతం మేర వేతనాలు పెంచింది. అదేవిధంగా కోటబొమ్మాళి రైస్‌మిల్లు కార్మికులకూ వేతనాలు పెరిగాయి.

స్కీమ్‌వర్కర్ల నిరంతర పోరాటం

కేంద్ర ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీమ్‌వర్కర్లు కనీస వేతనాలకు నోచుకోక ఏళ్ల తరబడి శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ఒకవైపు పనిఒత్తిడి, మరోవైపు రాజకీయ వేధింపులతో తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యారు. ఆమదాలవలస, నరసన్నపేట ప్రాంతాల్లో కార్యకర్తల తొలగింపుపై సిఐటియు ఆధ్వర్యాన ఆందోళనలు చేపట్టారు. ఆశావర్కర్ల సమస్యలపైనా పోరాడి వారికి అండగా నిలిచింది. ఆమదాలవలస, టెక్కలి ప్రాంతాల్లో వర్కర్లు ఎదుర్కొంటున్న రాజకీయ వేధింపులపై పోరాడింది. పలురూపాల్లో ఆందోళనలు సాగించింది. తాజాగా మార్చి 22న డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. పనిఒత్తిడి తగ్గించాలని, జాబ్‌ఛార్ట్ అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ప్రభుత్వం ముందు డిమాండ్ ఉంచారు. మధ్యాహ్న భోజన కార్మికులు తమ అపరిష్కృత డిమాండ్ల సాధన కోసం చలో విజయవాడ చేపట్టారు. పోలీసులను ఉపయోగించి భగ్నం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీసం పట్టించుకోవడం లేదు. మార్చి 20న చలో విజయవాడ, 21న కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేపట్టారు. మినీ వర్కర్ల సమస్యలపై మార్చి 25న చలో విజయవాడకు పిలుపునిచ్చిన సందర్భంగా 1800 అంగన్‌వాడీ కార్యకర్తలు, నాయకులను అరెస్టు చేశారు.

వివక్షపై గళమెత్తిన కలం గుర్రం జాషువా



కవులు కవిత్వం వెంట నడుస్తారు. కానీ కవిత్వం మహాకవుల వెంట నడుస్తుంది. కవులు అంతటా ఉంటారు. మహాకవులు అరుదుగా ఉంటారు. మహా కవుల కవిత్వం ఆపాత మధురమై, అనుభూతి సిద్ధమై, అవ్యక్త ఆనందాన్ని పాఠకులకు అందిస్తుంది. అంతేకాకుండా స్ఫూర్తిదాయకమై ఉంటుంది. తన కలం బలంతో కులాన్ని కూకటివేళ్ళతో పెకలించడానికి ప్రయత్నించిన జాషువా నిస్సందేహంగా మహాకవి. కఠినమైన జీవితం, కఠోరమైన సాధన, కవితా వధూటి వరించి ప్రసాదించిన సహజమైన ప్రజ్ఞ కలగలసింది జాషువా కవిత్వం.

మనిషి సృష్టించిన మహాపరాధం మతం. మతం చేసిన మరొక అపరాధం కులం. వీటి మధ్య నలిగి, రాటు దేలిన కలం జాషువాది. జాషువా కవిత్వం ఆయన జీవించిన సమాజానికి ప్రతినిధి. తాను ఎదుర్కొన్న వివక్ష, అవమానాలు, ఆకలి బాధలే ఆయన కవిత్వానికి నిజమైన ప్రేరణ. తన కవిత్వానికి నిజమైన ప్రేరణను, నేపథ్యాన్ని గురించి చెబుతూ "నాకు గురువులు ఇద్దరు. పేదరికం, కుల మత భేదం. ఒకటి సహనాన్ని నేర్పితే రెండవది నాలో ఎదిరించే శక్తిని పెంచింది" అనడంలోనే జాషువా కవితా వ్యక్తిత్వం మనకు స్పష్టమవుతుంది.

జాషువా స్వప్న జగత్తులో విహరించిన కవి కాదు. వాస్తవంలో సంచరించిన మహాకవి. అయితే ఆయన కవిత్వంలో భావుకతకు కొదువలేదు. ఆయన ప్రతి పదం అనుభూతి వ్యక్తంగా, ఆలోచనా ప్రేరకంగా, మనోహరంగా ఉంటుంది.

జాషువా కవిగా పుట్టే నాటికి దేశవ్యాప్తంగా జాతీయోద్యమ ప్రభావం విశేషంగా పడింది. అంతకుముందే సంఘసంస్కరణ, సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాలు నడిచాయి. కవిత్వోద్యమాలు, భాషోద్యమాలు నడుస్తున్నాయి. కవిత్వంపై వివిధ 'ఇజం'ల ప్రభావం మొదలైంది. గాంధేయ వాద ప్రభావం దేశాన్ని ఒక ఊపు ఊపుతున్నది. స్వభావంలో నవ్య కవిత్వం, స్వరూపంలో వచన కవిత్వం పరుగులు పెడుతున్నాయి. విశ్వనాథ సత్యనారాయణ 'వేయిపడగలు' ప్రకటించి సనాతన ధర్మాన్ని కాపాడడం కోసం 'చెలియలికట్ట' వేయడానికి ప్రయత్నిస్తున్నాడు. నండూరి ఎంకి ప్రేమలో తరిస్తుంటే, అప్పుడప్పుడే కృష్ణశాస్త్రి ప్రకృతి ఒడిలో పరవశిస్తున్నాడు. కానీ, జాషువా మాత్రం కాల్చే ఆకలి, కూల్చే వేదన, అవమానాలు, అపహాస్యాలతో పోరాడుతూ సంప్రదాయవాదులు నిందించిన 'మైల కవిత్వం'తో, 'పంచమ స్వరం'తోనే ఆంధ్రదేశాన్ని మైమరపించాడు. ఇటువంటి నేపథ్యంలో జాషువా పద్య కవిత్వానికే పట్టం కట్టినప్పటికీ ఆయన స్వభావంలో పరిపూర్ణంగా ఆధునికుడు.

తనను, తన కవిత్వాన్ని అవమానించాలని చూసిన వారికి "గవ్వకు సాటిరాని పలుగాకుల మూకలసూయ చేత నన్నెవ్విధ దూలినన్ నను వరించిన శారద లేచిపోవునే" అంటూ ఆత్మాభిమానంతో జవాబివ్వడం జాషువా వంటి కొందరికే సాధ్యమౌతుందేమో.

"నా కత్తి కవిత, నా కత్తికి సంగంపై ద్వేషం లేదు. దాని విధానంపైన ద్వేషం" అని, మత పిచ్చి గాని, వర్గోన్నతి గాని, స్వార్థచింతన గాని నా కృతుల్లో కనబడదని జాషువా స్పష్టంగా చెప్పుకున్నాడు. 'ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించుగాని దు:ఖితమతులైన పేదల ఫకీరుల శూన్యములైన పాత్రలన్ మెతుకు విదల్చదీ భరత మేదిని', అంటూ కుండ బద్దలుకొట్టి చెప్పాడు. ముప్పది మూడు కోట్ల దేవత లెగబడ్డ దేశంలో భాగ్య విహీనుల ఆకలి ఎలా తీరుతుందని? ప్రశ్నించాడు.

విశాల దృక్పథం, ప్రశ్నించే తత్వం, సమానత్వ సాధన కోసం పరితపించడం, అవమానాలను సహించలేని ఆత్మాభిమానం వంటి అనేక లక్షణాలు జాషువాను విలక్షణమైన వ్యక్తిగా నిలబెడుతున్నాయి.

1919లో 'రుక్మిణీ కళ్యాణం'తో కవిత్వం రాయడం ప్రారంభించినప్పటికీ గిజిగాడు, సాలీడు, భారత వీరుడు, భాష్ప సందేశము, శిల్పి, పశ్చాత్తాపము, పంచముడు, ధన్యజీవి, ఆవేదన, ప్రశ్న, నేను వంటి చాలా ఖండకావ్యాల్లో జాషువా నిరసన స్వరం మనకు వినిపిస్తుంది. అంతేకాదు, ఆయన కవిత్వంలో కుల వ్యవస్థపై ధిక్కారస్వరం అంతర్వాహినిగా ఉంటూనే ఉంటుంది.

1932లో ఆయన రాసిన ఫిరదౌసి, ముంతాజ్ మహల్ కావ్యాలు జాషువాను కవిగా మహోన్నత స్థానానికి చేర్చాయి. జాషువా కవితా స్వరూపాన్ని పరిపూర్ణంగా ఆవిష్కరించిన కావ్యం గబ్బిలం. ఈ కావ్యంలోని క్షుధానల మూర్తియైన కథానాయకుడు సాక్షాత్తు జాషువాకు ప్రతినిధి. 'నాదు కన్నీటి కథ సమన్వయము సేయ నార్ద్ర హృదయంబు గూడ కొంతవసరంబు' అని చెప్పుకున్నది తన గురించే.

జాషువా, సందేశాన్ని శివునికి వినిపించడానికి గబ్బిలాన్ని ఎంచుకోవడంలోనే అంతవరకు ఉన్న అనవసరపు సాంప్రదాయాల్ని ఉద్దేశ్యపూర్వకంగానే అతిక్రమించడం కనిపిస్తుంది. ఇందులోని కథానాయకుడు భరత వీరుని పాదాలు కందిపోకుండా చెప్పులు కుట్టి జీవనం సాగించే గొప్ప సేవకుడు. ఆయన గాలి సోకితేనే నాలుగు పడగల హైందవ నాగరాజు కోపంతో బుసలు కొడుతూ ఉంటాడు. కులము లేని నేను కొడుకుల్ని కని, వాళ్లను కూడా ఈ దురవస్థల పాలు చేయడం ఇష్టం లేక బ్రహ్మచర్య దీక్షలో ఉన్న వాడు. ఈ విధంగా ప్రతి మాటలోనూ జాషువా కులవివక్షను కుళ్ళబొడిచే ప్రయత్నం తన జీవన పర్యంతం చేశాడు.

జాషువా కవిత్వంలో దురాచార ఖండనతో పాటు దేశభక్తి ప్రబోధం కూడా మెండుగా కనిపిస్తుంది. అంతేకాకుండా ఆయన కవిత్వంలోని ఆర్ద్రత కరుణరస సంపూర్ణమై కన్నులు చెమ్మగిల్ల చేస్తుంది. ముంతాజ్ మహల్ మరణం తర్వాత షాజహాన్ చక్రవర్తి మనోవేదనను "నాదు నేత్ర యుగళి నాట్యమాడెడు నిన్ను నెట్లు దొంగిలించె నీశ్వరుండు" అంటూ, "ఈవు వసించు చోటు, వసియింతును నేనును, దాచి యుంపుమో దేవి! యొకింత నేల" అంటూ చిత్రించిన తీరు పాఠకుల మనస్సుల్ని కదిలిస్తుంది. దాంపత్య జీవనంలోని ప్రేమను, అనుబంధంలోని గాఢతను ఆవిష్కరిస్తుంది.

జాషువాకు మధుర శ్రీనాథ అన్న బిరుదు నిజంగా సార్థకమైంది. పద్య నిర్మాణ చాతుర్యం, పద విన్యాస సామర్థ్యం కూడా జాషువాను మహాకవిగా నిలబెట్టడమే కాకుండా అలనాటి శ్రీనాథుని గుర్తుకు తెస్తాయి. జాషువా సీస పద్యం నడకలో గొప్ప సౌందర్యం ఉంటుంది. పద్యంలోని ఏ పాదానికి ఆ పాదం పూర్తి అర్థాన్ని ఆవిష్కరిస్తూ ఉంటుంది. పదాల పోహళింపు కూడా శ్రవణపేయంగా ఉంటుంది.

విశ్వ మానవ శ్రేయస్సును ఆకాంక్షించడం మహా కవులకు ఉండవలసిన లక్షణం. ఈ గుణం మెండుగా ఉన్న జాషువా తాను విశ్వ నరుడను అని చెప్పుకోవడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు. కవి ప్రాశస్త్యాన్ని వర్ణిస్తూ జాషువా రాసిన పద్యం ఆయనకు నూటికి నూరుశాతం వర్తిసుంది. "రాజు మరణించె నొకతార రాలిపోయె, కవియు మరణించె నొకతార గగనమెక్కె రాజు జీవించు రాతి విగ్రహములందు, సుకవి జీవించె ప్రజల నాల్కల యందు".

గొప్ప విశ్వమానవ దృష్టితో సామాజిక రుగ్మతలపై పోరాటం చేసిన జాషువాను తెలుగు కవితా వినీలాకాశంలో మరొక ధ్రువతారగా చెప్పక తప్పదు. ◆

- డాక్టర్ జి.శైలమ్మ
96183 61095

'యుబి' కార్మికుల ఆకలి కేకలు

- పూర్తి స్థాయిలో పనిదినాలు కల్పించని యాజమాన్యం
- ఆందోళన చేస్తున్న కార్మిక కుటుంబాలు



ధర్నా చేస్తున్న యుబి కార్మికులు (ఫైల్)

ప్రజాశక్తి- రణస్థలం

రణస్థలం మండలం బంటుపల్లి పంచాయతీ కంబాలపేట వద్ద ఉన్న యునైటెడ్ బ్రేవరీస్ యాజమాన్యం అర్థాంతరంగా కార్మికులను నిలుపుదల చేయడంతో 600 మంది కార్మికులు ఆకలితో అలమటిస్తున్నారు. యునైటెడ్ బ్రేవరీస్ కార్మికులందరినీ విధుల్లోకి తీసుకుని పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించాలని, లేని పక్షంలో చట్టపరంగా వేతనాలు చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన కార్మిక కుటుంబ సభ్యులతో ఏప్రిల్ 27 నుంచి యుబి పరిశ్రమ గేటు ముందు ధర్నా నిర్వహిస్తున్నారు. యునైటెడ్ బ్రేవరీస్ యాజమాన్యం అక్రమంగా కార్మికులందరినీ నిలుపుదల చేసి కార్మిక కుటుంబాలతో చెలగాటమాడుతుంది. యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమ కోసం భూమిలు ఇచ్చిన స్థానికులులైన కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు కల్పించకపోవడంతో తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న 600 మంది కార్మిక కుటుంబాలను రోడ్డున పడేశారు. యునైటెడ్ బ్రేవరీస్ కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు కల్పించాలని, లేనిపక్షంలో చట్టప్రకారం 50 శాతం శాతం వేతనాలు చెల్లించాలని, చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (జెసిఎల్) యుబి యాజమాన్యాన్ని ఆదేశించారు. జెసిఎల్ ఆదేశాలను యుబి యాజమాన్యం లెక్కచేయకపోవడంతో కార్మికులు మండిపడుతున్నారు. మూడేళ్లుగా యాజమాన్యం కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు కల్పించకపోవడంతో కార్మికులు తమ కుటుంబాలను ఏ విధంగా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మిక కుటుంబాలు అర్థాకలితో అలమటిస్తూ... ఇంటి అద్దెలు చెల్లించలేక, పిల్లలకు స్కూల్ ఫీజులు కట్టలేక, ఇంటి విద్యుత్ ఛార్జీలు చెల్లించలేక, నిత్యావసర వస్తువులు కొనుకోలేక కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఇస్తున్న అరకొర వేతనాలకు పూర్తిస్థాయి పనిదినాలు కల్పించకపోవడంతో కార్మిక కుటుంబాల జీవనం కష్టంగా మారడంతో 600 కార్మిక కుటుంబాల ఆకలి మంటలు ఇటు పరిశ్రమ యాజమాన్యం, అటు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపణలు చేస్తున్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కార్మికులందరికీ పూర్తిస్థాయి పనిదినాలు కల్పించి ఆదుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. యాజమాన్యం తన మొండి వైఖరి వీడి అక్రమంగా నిలుపుదల చేసిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకుని పూర్తిస్థాయి పనిదినాలు కల్పించాలని, లేని పక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు నాయకులు, యూనియన్ నాయకులు, కార్మికులు హెచ్చరిస్తున్నారు.

పూర్తిస్థాయిలో పని కల్పించాలి



పరిశ్రమ యాజమాన్యం తక్షణమే స్పందించి 600 మంది కార్మికులకు పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించి ఆదుకోవాలి. పరిశ్రమలో పనులు లేక, బయట పనులకు వెళ్లలేక మా కుటుంబాలు వీధినపడ్డాయి. ప్రభుత్వం, అధికారులు స్పందించి న్యాయం చేయాలి.

- జె.గంగరాజు, యూనియన్ నాయకులు

అధికారుల ఆదేశాలు పట్టించుకోలేదు



యునైటెడ్ బ్రేవరీస్ యాజమాన్యం దిగి వచ్చి సిఐటియు, యూనియన్ నాయకులతో చర్చించి కార్మికులందరికీ పూర్తిస్థాయిలో పని కల్పించాలి. జెసిఎల్ అధికారుల ఆదేశాలను యుబి యాజమాన్యం పట్టించుకోవడం లేదు. లేకుంటే కార్మికుల మద్దతుతో పోరాటాన్ని ఉధృతం చేస్తాం.

- ఐ.నారాయణరావు, యూనియన్ నాయకులు

పోరాటాన్ని ఉధృతం చేస్తాం



కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు కల్పించాలి. లేని పక్షంలో చట్టప్రకారం 50 శాతం వేతనాలు చెల్లించాలి. చట్టపరమైన సౌకర్యాలు అమలు చేయాలి. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ (జెసిఎల్) ఆదేశాలను యాజమాన్యం పాటించాలి. లేకుంటే కార్మికులతో కలిసి పోరాటాలను ఉధృతం చేస్తాం.

- సిహెచ్.అమ్మన్నాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్షులు

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



గత 20 ఏళ్లుగా పనిచేస్తున్న 600 మంది కార్మిక కుటుంబాలను రోడ్డున పడేశారు. దీంతో కార్మిక కుటుబాలు ఆకలి మంటలతో అలమటిస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకుని ఈ సమస్య పరిష్కరించాలి. లేకుంటే కార్మికుల మద్దతుతో పోరాటాలు ఉధృతం చేస్తాం.

- పి.తేజేశ్వరరావు, సిఐటియు ప్రధాన కార్యదర్శి

నాడు ఘనం... నేడు అధ్వానం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణ శివారులో ఉన్న పారిశ్రామిక వాడ గతంలో ఒక వెలుగు వెలిగి పలువురికి ఉపాధి కల్పించి ఎంతో ఘనంగా కళకళలాడుతూ ఉండేది. నేడు పరిశ్రమలు అనుకున్న స్థాయిలో లేక కార్మికులకు ఉపాధి లేక అధ్వానంగా తయారైంది. రాజకీయ నాయకులు ఊదరగొట్టే ఉపన్యాసాలు తప్ప పారిశ్రామికవాడను పట్టించుకున్న పాపాన పోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ఎదురుగా పాలకొండ-శ్రీకాకుళం మెయిన్ రోడ్డు పక్కన 1972లో అప్పటి పార్లమెంట్ సభ్యులు బొడ్డేపల్లి రాజగోపాలరావు 19.52 ఎకరాల విస్తీర్ణంలో 36 ప్లాట్లతో పారిశ్రామిక వాడను ఏర్పాటు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో మొట్టమొదటి పారిశ్రామిక వాడ ఇదే కావడం విశేషం. బొడ్డేపల్లి రాజగోపాలరావుకు బర్త్ డే గిఫ్ట్‌గా అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఇచ్చారని ఇప్పటికీ పలువురు గుర్తు చేసుకుంటారు. తొలినాళ్లలో పారిశ్రామిక వాడలో సినిమా కార్బన్స్, మేకులు, చింత పిక్కల పౌడర్, నవాటేపు, స్టెయిన్లెస్ స్టీల్, అల్యూమినియం ఫ్యాక్టరీ, గన్ని బ్యాగ్స్, బట్టల సబ్బులు తదితర పరిశ్రమలతో కలకలలాడుతూ కార్మికులకు ఉపాధి కల్పిస్తూ ఉండేది. తదనంతరం 1983లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిశ్రమలు మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ ప్రోత్సాహం లేక కనుమరుగయ్యాయి. 2009లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హయాంలో అనుకున్న స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించలేకపోవడంతో ఆర్థిక సంక్షోభంతో పరిశ్రమలు మూతపడ్డాయి. 2019లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ అప్పటి శాసనసభ్యుడు కూన రవికుమార్ చొరవతో రూ.1.50 కోట్లు నిధులను మంజూరు చేయించి రోడ్లు, డ్రెయినేజీ తదితర మౌలిక సదుపాయాలను కల్పించి పరిశ్రమల పురోభివృద్ధికి ఊతమిచ్చారు. గతంలో ఉన్న 36 ప్లాట్లను 48 ప్లాట్లుగా అభివృద్ధి చేయడానికి నిర్ణయించారు. అలాగే రూ.2 కోట్లతో విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి అందుబాటులోకి తీసుకొచ్చారు. అక్కడ నుంచి పరిశ్రమలు విద్యుత్ ఇబ్బందులకు గురికాకుండా ముందుకు వెళ్లసాగాయి. తొలినాళ్లలో ఎపిఐఐసితో ఒప్పందం చేసుకున్న వ్యక్తులు అప్పట్లో పరిశ్రమల స్థాపించి ఆ తర్వాత కాలంలో ఆర్థిక ఇబ్బందులకు గురై మూతపడ్డాయి. ప్రస్తుతం ఇక్కడ పరిశ్రమలు నిర్వహిస్తున్న వ్యక్తులు రెండో పార్టీ వారు కావడం విశేషం. ప్రస్తుతం పారిశ్రామిక వాడలో వుడ్ వర్క్స్, వాటర్ ప్లాంట్లు, విత్తనాల తయారీ కేంద్రం, ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్, అల్యూమినియం ఫ్యాక్టరీ తదితర పరిశ్రమలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఎక్కువ మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలు వచ్చేలా కృషి చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.



మూతపడిన అల్యూమినియం పరిశ్రమ




మరమ్మతులకు గురైన పరిశ్రమకు వెళ్లే రోడ్డు



అధ్వానంగా కాలువలు

ప్రభుత్వ ప్రోత్సాహం కరువు



మౌలిక సదుపాయాలు ప్రభుత్వ ప్రోత్సాహం కరువై పరిశ్రమల పురోగతి కుంటుపడింది. ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కల్పించి పరిశ్రమలను ఆదుకొని ప్రోత్సహిస్తే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించవచ్చు. అలాగే విద్యుత్, పన్నులు తదితర రాయితీలను కల్పించి పరిశ్రమల పురోగతికి ఊతమిచ్చినప్పుడే అభివృద్ధి పథంలో దూసుకెళ్తాం.

- తాళ్లూరి రాంబాబు, ఇండస్ట్రియల్ లోకల్ అథారిటీ మాజీ చైర్మన్


ఎండిఎల్ పోర్టల్ పరిశ్రమ

ఎండిఎల్ పోర్టల్ నిలిపివేత

దిక్కుతోచని స్థితిలో గ్రానైట్ యజమానులు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న కొండల్లో ఔషధ మొక్కలకు ప్రసిద్ధి. ఇదే ప్రాంతంలోని కొండల్లో గ్రానైట్ ప్రపంచ వ్యాప్తంగా పేరొందింది. అత్యంత గిరాకీ ఉన్న బ్లూ గ్రానైట్ ఇక్కడ నుండి దేశ, విదేశాలకు తరలివెళ్తుంది. రెండు, మూడు దశాబ్దాలుగా గ్రానైట్ మూలంగా పారిశ్రామిక ప్రగతి, శ్రామికులకు ఉపాధి, రాజకీయ నేతలకు ఆర్థిక పరిపుష్టి కలిగించింది. జిల్లాలో నేతల్లో ఎన్నో పార్టీలున్నా గ్రానైట్ వ్యాపారంలో వారంతా ఒక్కటిగానే ఉంటారు. రాజకీయ ప్రత్యర్థుల సైతం ప్రధాన వ్యాపార భాగస్వాములుగా ఉన్న రంగం కూడా ఇదే. సాధారణ స్థితి నుంచి లక్షాధికారులు, కోటేశ్వరులైన వారెందరో గ్రానైట్ రాయిని నమ్ముకున్నవారే. బంగారం కంటే కూడా ఎక్కువ ధర పలికే ఈ గ్రానైట్ వ్యాపారంతో సిక్కోలు జిల్లాలో ముఖ్యంగా టెక్కలి డివిజన్ ఆర్థికంగా కళకళలాడుతుంటాయి.

ఇప్పుడే ఇదే పరిశ్రమపై గోరుచుట్టుపై రోకలిపోటు మాదిరిగా పాలనా విధానాలు మారాయి. ఎండిఎల్ పోర్టల్ నిలిపివేయడంతో నెల రోజులుగా వ్యాపార లావాదేవీలే లేకుండా పోయాయి. పలు కొండల్లో వేలకొద్దీ క్యూబిక్ మీటర్లు తవ్వివెలికి తీసిన ఈ రాళ్లు ఇప్పుడు అదే కొండపై చెల్లని వస్తువులుగా దర్శనమిస్తున్నాయి. ఎండిఎల్ పోర్టల్ ఉన్నప్పుడు ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాలకు సునాయాసంగా మార్కెటింగ్ అయ్యేవి. దీంతో పరిశ్రమ యాజమాన్యం ఆర్థిక పరిపుష్టితో పనిచేసే కార్మికులు మెరుగైన జీత భత్యాలతో ఉండేవారు. నెల రోజులుగా (మిగతా 9లో)

ఎండిఎల్ పోర్టల్ నిలిపివేత

(8వ పేజీ తరువాయి)

ఈ వ్యాపార లావాదేవీలు జరగకపోవడంతో వీరంతా ఆందోళన చెందుతున్నారు. టెక్కలి డివిజన్లో ఎక్కువగా గ్రానైట్ వ్యాపారాలకు సంబంధించిన కార్యాలయాల నిర్వహణ, ఫ్యాక్టరీల నిర్వహణ సాగుతోంది. అయితే ఇప్పుడు ఆ సంస్థలు నిర్వహించడమే యాజమాన్యాలకు కష్టమైపోయింది. ఎండిఎల్ పోర్టల్ ఆన్‌లైన్‌లో తెరవాలని కోరుతూ ఇప్పటికే యాజమాన్యాలు, కార్మికులు గనుల శాఖ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. పాలకుల నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో జిల్లాలో ఉన్న 125 పరిశ్రమల యాజమాన్యాలు పనులు నిలుపుదలకు నిర్ణయించారు. ఇతర రాష్ట్రాల నుంచి ఎక్కువగా వలస వచ్చి పనులు సాగిస్తున్న గ్రానైట్ కార్మికులు ప్రస్తుతం ఈ ప్రాంతంలో పనిలేకపోవడంతో సొంత రాష్ట్రాలకు వెళ్లిపోవాలని భావిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితిలో గ్రానైట్ పరిశ్రమలు సంక్షోభంలో కూరుకుపోయాయి. ప్రభుత్వం దీనిపై సానుకూలంగా స్పందించాలని కోరుతున్నారు.

ఉపాధి లేక ఆర్థిక ఇబ్బందులు

20 ఏళ్ల నుంచి గ్రానైట్ పరిశ్రమలో కార్మికులకు తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రస్తుతం పరిశ్రమలకు నష్టాలు వస్తున్నాయి. పరిశ్రమ మూసి వేస్తే కార్మికులు రోడ్డున పడతారు. ఇతర పనులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రభుత్వం స్పందించి శ్లాబ్ పద్ధతి తీసుకొస్తే సమస్య తీరుతుంది.

– నంబూరు షణ్ముఖరావు, సిఐటియు నాయకులు

శ్లాబ్ పద్ధతి తెస్తే సంక్షోభం వీడుతుంది

రాయల్టీని ప్రైవేటు వారికి అప్పగించడం వల్ల గ్రానైట్ పరిశ్రమ నిర్వీర్యం అవుతుంది. ప్రస్తుతం ఉన్న ప్లాట్ పద్ధతిని తీసకొస్తే మీటరు రూ.1000 మాత్రమే పడుతుంది. దీంతో గ్రానైట్ పరిశ్రమలకు పూర్వవైభవం వస్తుంది. 10 రెట్లు కట్టాలంటే గ్రానైట్ పరిశ్రమలు సంక్షోభం కూరకుపోతాయి. పాత పద్ధతిలో శ్లాబ్ తీసుకురావాలని ప్రభుత్వానికి వినతిపత్రం అందజేశాం.

- గోపి చౌదరి, గ్రానైట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు

విప్లవాగ్ని కణం

అది బడుగు జీవి చెమట
చుక్క. అది శ్రామికుని ఆకలి
డొక్క. అది సగటు బతుకు
మోగించిన ఢక్క. ఆ
అంతరంగంలో తరతరాల
వేదన. ఆ కవనాగ్నిలో
అభ్యుదయపు శోధన.
అది కాదు పదాల అమరిక.
సగటు జీవన పథాల
బడలిక. అట్టడుగు
బతుకుల చీకటి యవనిక.
ఆ నడకలో పోరాటం. ఆ
గమనంలో ఆర్తి. ఆ
ఉరుకులో ఉప్పెన. ఆ
అక్షరంలో ఆక్రందన.
అది సామ్యవాదం శిరసెత్తిన
జెండా. అది ఉద్యమ నేత్రం
కురిపించే నిప్పుల కుండ.
యుగయుగాలకు మహాకవి
మార్గమే సాహిత్యానికి
ఎజెండా జన్మించవా శ్రీశ్రీ
మళ్ళా! నీ ఆవేశాక్షరాలే
కవన భారతి నిలువెల్లా.

– కె.వి రాజారావు
తానా పురస్కార గ్రహీత
ఆమదాలవలస









పనుల్లేక అల్లాడుతున్న క్వారీ కార్మికులు

- దుర్భరంగా మారిన జీవన స్థితిగతులు
- వలసబాట పడుతున్న వైనం

ప్రజాశక్తి- పొందూరు

వర్షాధామే ఆధారంగా ఉన్న ఆ మెట్ట ప్రాంత భూముల్లో సాగుకు అవసరమైన పెట్టుబడులూ వచ్చేవి కావు. దీంతో ఆ కుటుంబాలు జీవనోపాధి లేక తప్పనిసరి పరిస్థితుల్లో కొన్ని దశాబ్ధాల క్రితం పొట్టకూటి కోసం విజయవాడ, గుంటూరు, రాజమండ్రి వంటి దూర ప్రాంతాలకు వలస పోయేవారు. కొంత కాలానికి తమ గ్రామాలకు సమీపంలోనే రోడ్డు మెటల్ క్వారీలు, స్టోన్ క్రషర్లు ఏర్పడి ఉపాధి లభించడంతో వలసపోయినవారంతా తిరిగి తమ కుటుంబాలతో సహా సొంత గ్రామాలకు చేరుకుని కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాలక్రమేణా భారీ ఆధునిక యంత్రాలు, ఇతరత్రా పరికరాల వినియోగం క్రమేపీ పెరగడం, క్వారీ నిర్వాహణలో యాజమాన్యం, ప్రభుత్వ విధానాలతో కొన్ని నెలలుగా పనులు సక్రమంగా జరగకపోవడంతో మరలా ఉపాధిని కోల్పోయిన పరిస్థితులు నెలకొనడంతో పూర్వ పరిస్థితి ఏర్పడింది. దీంతో పనులు లేక కుటుంబాల పోషణ దుర్భరంగా మారడంతో పనికోసం సమీప పట్టణ ప్రాంతాలకు పరుగులు పెడుతున్నారు క్వారీ కార్మికులు. ఇది పొందూరు మండలంలోని పలు గ్రామాల క్వారీ కార్మికుల దుస్థితి.

జిల్లాలోనే పొందూరు మండలం నల్లరాయి క్వారీలకు ఎంతో ప్రసిద్ధి. ఇక్కడ క్వారీల్లో లభించే నల్లరాయిని ఇళ్ల నిర్మాణాలకు, రోడ్డు నిర్మాణ పనులకు ఎక్కువుగా వినియోగిస్తుంటారు. అందుకే జిల్లాలోని చాలా ప్రాంతాల వారు ప్రత్యేకించి ఇక్కడి రాయిని తీసుకువెళ్లి వినియోగించేందుకు ఇష్టపడతారు. దీంతో ఈ ప్రాంతంలో వేలాది మందికి క్వారీ పనులు ఉపాధిగా ఏర్పడింది. మండలంలోని సుమారు 20 గ్రామాల ప్రజలు ఈ పనుల్లో నిత్యం నిమగ్నమై ఉంటారు. ప్రధానంగా మండలంలోని రాపాక, కృష్ణాపురం, వావిలపల్లిపేట, వి.ఆర్.గూడెం, కోటిపల్లి, ఇల్లయ్యగారిపేట, దల్లవలస, కొంచాడ, పొందూరు, లయిదాం, మలకాం, తండ్యాం, పుల్లాజీపేట, బాణాం, తాణెం, లక్ష్మీపేట, లోలుగు, బురిడికంచరాం, నరసాపురం, నందివాడతో పాటు జి.సిగడాం మండలంలోని వాండ్రంగి, ఆనందపుర అగ్రహారం, తదితర గ్రామాలకు చెందిన వేలాది మంది కార్మికులకు ఇది జీవనోపాధిగా మారింది.

మూడు, నాలుగు నెలలే పనులు

మండలంలో ప్రధానంగా రాపాక, కృష్ణాపురం వద్ద క్వారీలు ఎక్కువుగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో జరిగే క్వారీ పనుల్లోను, వాటి అనుబంధ పనుల్లో వేలాది మంది కార్మికులు పనిచేస్తుంటారు. ఏడాదిలో వర్షాకాలంలోను, అలాగే క్వారీ నిర్వాహకుల్లో తగాదాలు, ప్రమాద సంఘటనలు, అనాధికార క్వారీ నిర్వాహణ వంటి సమయాల్లో పనులు జరగవు. ఏడాదిలో కేవలం మూడు, నాలుగు నెలలు మాత్రమే గట్టిగా పనులు జరుగుతుంటాయి. ఈ కొద్ది సమయాల్లో జరిగే పనులతో వచ్చే ఆదాయంతోనే కార్మికులు తమ పిల్లలను చదివించుకుంటూ, కుటుంబాలను పోషించుకుంటుంటారు. రెండేళ్లుగా పనులు సక్రమంగా జరగకపోవడంతో కార్మికులు అల్లాడిపోతున్నారు.


కృష్ణాపురం వద్ద ప్రమాదకరంగా కొండపై పనులు చేపడుతున్న కార్మికులు


క్వారీ పనుల్లో నిమగ్నమైన కార్మికులు


దూర ప్రాంతాలకు ఆటోలో వెళ్తున్న మహిళా కార్మికులు

పని లేకుండా చేస్తున్నారు



క్వారీ యాజమాన్యం తమ సొంత వాహనాలను పెట్టుకుని కార్మికులకు పనులు లేకుండా చేస్తున్నారు. క్వారీ పనుల్లో వేలాది మంది పనిచేసే వారు ప్రస్తుతం పదుల సంఖ్యల్లో కూడా పని లేకుండాపోయింది. పని కావాలని ప్రశ్నిస్తే వారికి పని లేకుండా చేస్తున్నారు. క్వారీ యాజమాన్యం స్వలాభం వల్ల కార్మికులకు తీవ్రంగా నష్టం వాటిల్లుతుంది

- పతివాడ మురళి, రాపాక, కార్మికుడు

పనుల్లేక ఇబ్బందులు పడుతున్నాం



మా ప్రాంతం వర్షాధారం కావడంతో వ్యవసాయ పనులు అంతంత మాత్రమే. దీంతో తామంతా క్వారీ పనులకు వెళుతుంటాం. కానీ, ఇటీవల పనులు సక్రమంగా జరగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. పనులు లేకపోవడంతో కుటుంబాల పోషణ కూడా ఇబ్బందిగా మారింది. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో పట్టణ ప్రాంతాల్లో జరిగే తాపీ పనులకు ఎక్కువుగా వెళ్లిపోతున్నాం.

- ఇజ్జాడ నాగరాజు, రాపాక, కార్మికుడు

యాంత్రీకరణతో కోల్పోయిన ఉపాధి

ఈ ప్రాంతంలో క్వారీ నిర్వాహకులు, యాజమాన్యం తమ స్వలాభం కోసం ఆలోచిస్తున్నారే తప్ప కార్మికులకు పనులను కల్పించడంలో ఏమాత్రం ఆసక్తి కనబరచడం లేదంటూ వారంతా ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. క్వారీ నిర్వాహణ పనుల్లో ఇటీవల యంత్రాల వాడకం యాజమాన్యం విపరీతంగా పెంచడంతో తమకు ఉపాధి లేకుండా పోయింది. దీంతో కుటుంబ పోషణ దుర్భరంగా మారిందంటూ కార్మికులు వాపోతున్నారు. ఇటువంటి తప్పనిసరి పరిస్థితుల్లో సమీప పట్టణ ప్రాంతాలలో జరుగుతున్న భవన నిర్మాణ పనుల్లో పనిచేసేందుకు వలసపోతున్నారు. ఉదయాన్నే ఆటోలతోను, ద్విచక్ర వాహనాలతోను పనుల కోసం పట్టణ ప్రాంతాలకు తరలిపోతున్నారు. దీనిపై అధికారులు దృష్టిని సారించి క్వారీ కార్మికులకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలంటూ వారంతా కోరుతున్నారు.

ఉప్పు కార్మికుల ఉపాధికి గండం

కష్టం కార్మికులది.. కాసులు దళారులవి

ప్రజాశక్తి - నౌపడ

నౌపడ ఉప్పు ఉత్పత్తి సంక్షోభంలో పడటంతో కార్మికుల ఉపాధికి గండం ఏర్పడింది. నౌపడ, సీతానగరం, మర్రిపాడు, శలగపేట, భావనపాడు, యామలపేట ప్రాంతాల్లో ఐదు వేల ఎకరాల వరకు ఉప్పు ఉత్పత్తి సాగేది. కానీ లీజు గడువులు ముగియడంతో కేవలం సుమారు 500 ఎకరాలు మాత్రమే రైతులు సాగు చేస్తున్నారు. మరోవైపు మూలపేట పోర్టు నిర్మాణానికి ఉప్పు భూములు అవసరమైతే తీసుకుంటామని ప్రభుత్వం ప్రకటనలు చేస్తుంది. దీంతో ఉప్పు కార్మికుల మరింత ఆవేదన చెందుతున్నారు. గత ఐదారేళ్లుగా ఉప్పు పరిశ్రమ నుంచి వందలాది మంది కార్మికులు భవన నిర్మాణ రంగంలోకి చేరిపోయారు. చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నం, బళ్లారి, ఒడిశా ప్రాంతాలకు వలస వెళ్లి బతుకుతున్నారు. సరైన ఉపాధి మార్గాలు లేక ఈ ప్రాంతంలోని యువత విదేశాల్లో పలు నిర్మాణ రంగాల్లో పనులు చేసుకోవడానికి మొగ్గు చూపుతున్నారు. ఉప్పు పంటపై ఆధారపడి జీవిస్తున్న సుమారు రెండు వేల మంది కుటుంబాలకు ప్రభుత్వాలు ఊతం అందించే పరిస్థితి కనబడడం లేదు. పోర్టు నిర్మాణంతో ఇకపై భూములు ఉంటాయో పోతాయో తెలియక ఇక్కడి రైతులు, కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. దీంతో అధిక శాతం మంది వలస పనులపై దృష్టి పెడుతున్నారు.

కష్టం కార్మికులది.. కాసులు దళారులవి

ఆరుగాలం కష్టించి.. శ్రమనే పెట్టుబడిగా పెట్టి ఉప్పు పండించే రైతులు వారితో పనిచేసే కార్మికులు కష్టాన్ని దోచుకుని దళారులు కాసులు సంపాధించుకునే పరిస్థితి నౌపడలో ఏర్పడింది. మధ్యవర్తులు, దళారులు చేష్టలతో ధరల నియంత్రణ లేక గిట్టుబాటు రావడం లేదు. వ్యాపారులు, దళారులు సిండికేట్గా మారి ధరలు నిర్ణయించే పరిస్థితి దాపురించింది. ఒక నెల రోజుల పాటు ధరలు పెంచడం, తర్వాత అమాంతం తగ్గించడం రైతులు మోసపోతున్నారు. ఇక్కడ దళారులు తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసుకుంటున్నారు. 2నెలల క్రితం రూ.210 నుంచి రూ.280 వరకు ఉన్న 50 కేజీల బస్తా ప్రస్తుతం రూ.120 నుంచి రూ.180కి పడిపోయింది. పంట పెట్టుబడి కింద కూలీ పనులకు వచ్చే కార్మికులకు పూటకు రూ.300 ఇవ్వాల్సి ఉంటుంది. పెరిగిన డీజిల్ ధరలతో ఇంజన్తో నీరు తోడి గల్లీలలో నింపడం, మోత, తీత, చదును చేయడం, కుప్పలుగా పేర్చడం, బస్తాలు ఎక్కించడం వంటి పనులకు పెట్టుబడి పెట్టాల్సి ఉంది. ఒక ఎకరాకు పండించే రైతుకు ప్రస్తుత లెక్కల ప్రకారం ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. అయితే ధరల నియంత్రణ లేకపోవడంతో కాయకష్టమే మిగులుతుందని రైతులు ఉప్పు సాగుపై నిరాశక్తి చూపుతున్నారు. సాగు భూములు రెన్యువల్ చేయాలని, దళారులను కట్టడి చేసి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు, కార్మికులు ఎప్పటి నుంచో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వమే ఎగుమతులు సౌకర్యం కల్పించి ఆదుకోవాలని పలువురు రైతులు కార్మికులు కోరుతున్నారు.


ఉప్పును తోడుతున్న రైతు


బళ్లపై ఉప్పు బస్తాలను తరలిస్తున్న రైతులు


ఉప్పును సాగు చేస్తున్న రైతులు

పోరాటాలే శరణ్యం



కేంద్రంలో మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత సుదీర్ఘకాలం పోరాడి సాధించుకున్న 8 గంటల పనిదినాన్ని సమయ పాలన లేకుండా చేస్తున్నారు. కార్మికులు, అసంఘటిత రంగంలో ఉన్న మహిళలు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు హక్కులను కాలరాస్తూ సమాన పనికి సమాన వేతనాలు చెల్లించకపోగా పని ఒత్తిడి పెంచుతున్నారు. మరోవైపు మహిళలను రాత్రి వేళల్లో పని చేయిస్తు న్నారు. ప్రభుత్వ రంగాన్ని దశలవారీగా ప్రయివేటు వ్యక్తులకు అప్పగిస్తు న్నారు. ఫలితంగా కార్మిక సాధించుకున్న హక్కు లను కాదని యాజమాన్యాలకు అనుకూ ల చట్టాలను తీసుకొస్తూ శ్రమకు మించి పనులు చేయిస్తున్నారు. ఈ విధానాల కు వ్యతిరేకంగా ప్రజలు సంఘటితమై తిరిగి పోరాటాలు చేయాల్సిన అవసరం నెలకొంటుంది. మహిళలు సైతం సమిష్టి పోరాటాలకు ముందుండి నిలవాలి. మహిళలపై పనిచేసే చోట భౌతిక దాడులు, మానసిక ఒత్తిళ్లు, వేధింపులు జరుగుతున్నాయి. రాజకీయ పార్టీల నుంచి ఒత్తిడికి గురై మానసికంగా కుంగిపోతున్నారు. అటువంటి సమ యంలోనే మనోధైర్యాన్ని కోల్పోకుండా ఎదురు తిరిగి పోరాడాలి. పోరాటాల ద్వారా మెరుగైన మహిళా సమాజాన్ని నిర్మించుకునేందుకు వీలుంది. మేడే స్ఫూర్తితో మహిళలు పోరాటాల వైపు అడుగులు వేయాలి.

- కె.నాగమణి, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్

అంగన్వాడీలను ఉద్యోగులుగా గుర్తించాలి



అంగన్వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి. ఫేస్ యాప్, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలి. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి. అంగన్వాడీలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి. కేంద్రాలకు విద్యుత్ బిల్లులు సైతం కార్యకర్తలే చెల్లించాల్సి వస్తోంది. ఐదేళ్లుగా టిఎ, డిఎలు చెల్లించడం లేదు. గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనికి తోడు అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా సచివాలయాల పర్యవేక్షణకు ఆదేశించింది. ఇప్పటికే ఐసిడిఎస్ అధికారులు పీడీ, సిడిపిఒ, సూపర్ వైజర్లు పర్యవేక్షిస్తున్నారు. కొత్తగా సచివాలయ ఉద్యోగుల పెత్తనం మొదలైంది. కేంద్రాల బలోపేతం చేసేందుకు నిధులు పెంచి అంగన్వాడీలకు ఉద్యోగభద్రత కల్పించాలి. హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం. మేడే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలి.

- డి.సుధ, ప్రధాన కార్యదర్శి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

జీడి కార్మికులకు భద్రత ఏదీ?

పలాస మండలంలోని పలాస-కాశీబుగ్గ జంటపట్టణాలు తెల్ల బంగారంగా పేరుగాంచిన జీడిపప్పును ఉత్పత్తి చేయడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. జిల్లాలో సుమారు 350 జీడి పరిశ్రమలుండగా పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లోనే 250కు పైగా పరిశ్రమలున్నాయి. ఈ పరిశ్రమలపై ప్రత్యక్షంగా 7500 మంది, పరోక్షంగా 5 వేల మంది ఉపాధి పొందుతున్నారు. కాగా జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏళ్ల తరబడి కార్మిక చట్టాలు అమలుకాకపోడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

- ప్రజాశక్తి, పలాస

- **పరిశ్రమల్లో అమలు కాని కార్మిక చట్టాలు**
- **పట్టించుకోని ప్రభుత్వాలు**

ప్రస్తుతం జీడి కార్మికుల బతుకులు దుర్భరంగా ఉన్నాయి. పనిచేసిన చోట కనీస వసతుల్లేవు. మహిళా కార్మికులకు కనీసం మరుగుదొడ్డి సదుపాయం కూడా కల్పించడం లేదు. కార్మిక చట్టాలు అమలుకావడం లేదు. జీడి పరిశ్రమల్లో చెమటోడ్చి పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. కార్మిక శాఖాధికారులు సైతం కార్మిక చట్టాలు అమలులో తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు కేవలం ఎన్నికల సమయంలోనే కార్మికుల సమస్యలను గుర్తుకు తెచ్చుకుని, ఆ తరువాత విస్మరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అసలు పట్టించుకోవడమే మానేశాయి. మొత్తమ్మీద జీడిపరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు.

కార్మికులకు అందని కార్మిక చట్టాలు

జీడి పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికునికి సంబంధిత యజమాని రూ.350 వెల్ఫేర్ ఫండ్ చెల్లించాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. కార్మికుల సౌకర్యార్థం ఇఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటుచేయలేదు. ప్రావిడెంట్ ఫండ్‌ను యాజమాన్యం కార్మికుల నుంచి తీసుకుంటున్నప్పటికీ చెల్లింపులు జరపడం లేదు. కొందరు చెల్లిస్తున్నప్పటికీ రశీదులివ్వని పరిస్థితి నెలకొంది. చేతిగొడుగులు ఇవ్వకపోవడంతో జీడిపిక్కను ఒలిచే సమయంలో వచ్చే యాసిడ్‌తో మహిళల చేతులకు వాపులు, ఇతర చర్మవ్యాధులు వస్తున్నాయి. పర్యావసానం పింఛను పొందుతున్న జీడి కార్మికులు పింఛన్లు అందించే సమయంలో వేలిముద్రలు నమోదుకాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలామంది కార్మికులకు బయోమెట్రిక్ విధానంతో పింఛను అందని పరిస్థితి నెలకొంది. మొత్తమ్మీద జీడి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు కార్మిక చట్టాలత ోపాటు కనీస సదుపాయాలకు నోచుకోలేకపోతున్నారు.

జీడి పరిశ్రమలు ఏర్పాటిలా...

16వ శతాబ్దంలో తీర ప్రాంతం కోతకు గురికాకుండా ఉండేందుకు పోర్చుగ్రీసు వారు వేసిన జీడి మొక్కలతో ఉత్పత్తి అయిన జీడి గింజలు ఒకానొకదశలో పసుపక్ష్యాదులకు ఆహారంగా ఉండేవి. ఆ తరువాత జీడి గింజలను కాల్చి అందులోని పప్పు రుచి చూసిన ప్రజలు జీడి పంటలపై ఆసక్తి చూపించారు. 50 ఏళ్ల క్రితమే పలాసలో జీడి పరిశ్రమకు అంకురార్పణం జరిగింది. 1945 నుంచి పలాసలోని పలువురు జీడి వ్యాపారులు జీడి పిక్కలను కొనుగోలు చేయడం ప్రారంభించారు. అప్పటివరకు అక్కడి రైతులకు జీడి పిక్కల విలువేంటో తెలియని పరిస్థితి. రాష్ట్రంలో జీడి ఉత్పత్తికి కేంద్రమైన 'మోరి' ప్రాంతం నుంచి పలువురు వ్యాపారులు పలాసకు వచ్చి ఉద్దానం జీడి పిక్కలపై దృష్టిసారించారు. ఆ తరువాత వేటపాలెం ప్రాంతానికి చెందిన రాధాకృష్ణ అనే వ్యాపారి పలాస వచ్చి జీడిపరిశ్రమను ఏర్పాటుచేశారు. అప్పటికే పలాసకు చెందిన మల్లా జనార్థన అనే వ్యాపారి పెనంపై జీడిగింజలను కాల్చి పప్పును తీసి మార్కెట్‌లో విక్రయించేవారు. ఈ విధంగా ప్రారంభమైన జీడి పరిశ్రమ అంచెలంచెలుగా ఎదిగింది. 1986 నాటికి పలాసలో రోస్టింగ్ విధానంతో 30 జీడిపరిశ్రమలుండగా, నేడు పలాసతోపాటు పరిసర ప్రాంతాల్లో మొత్తం 250 పరిశ్రమలున్నాయి. ఈ పరిశ్రమలు ద్వారా వచ్చిన జీడిపప్పును ప్రస్తుతం దేశంలోని పెద్ద నగరాలైన ముంబై, కోల్‌కతా, చెన్నయ్, ఢిల్లీ, అహ్మదాబాద్ తదితర ప్రాంతాలకు పప్పు ఎగుమతి అవుతుంది. ప్రస్తుతం జీడి పరిశ్రమలకు కావాల్సిన ముడిసరుకు జిల్లా నుంచి అందకపోవడంతో ఇతర దేశాల పిక్కలపై ఆధారపడి నడుస్తున్నాయి. పలాసకు శ్రీకాకుళం జిల్లా నుంచే కాకుండా ప్రపంచంలో భూమధ్యరేఖకు సమీపంలో ఉన్న ఆసియా, ఆఫ్రికా ఖండాల్లోని 35 దేశాల నుంచి జీడిపిక్కలు దిగుమతి అవుతున్నాయి. ముఖ్యంగా నైజీరియా, గనా, ఐవిరికోస్టు, బెనిన్, గెనిబిసావ్, టాంజానియా, ఇండోనేషియా, కెన్యా తదితర దేశాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, కేరళలోని కొచ్చిన్, కర్నాటకలోని మంగుళూరు,



పలాసలోని జీడి పరిశ్రమ

తమిళనాడులోని తూటికోర్ని, పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా తదితర పోర్టులకు పిక్కలు దిగుమతి అవుతున్నాయి. అక్కడ నుంచి పలాసకు జీడిపిక్కలను తీసుకువచ్చి జీడిపరిశ్రమల్లో ముడిసరుకుగా వినియోగిస్తున్నారు. 80 కిలోలు పిక్కల బస్తా నుంచి 20-22 కిలోలు వరకు జీడిపప్పు దిగుబడి వస్తుంది. పప్పు గ్రేడింగ్ బట్టి పలాసలో 16 రకాలుండగా ఇతర దేశాలకు 32 రకాల జీడిపప్పు ఎగుమతి అవుతున్నాయి. ఈ జీడిపప్పుతో మన దేశానికి విదేశీ కరెన్సీ ద్వారా కోట్లాది రూపాయలు రావడమే కాకుండా లక్షలాది మంది కార్మికులకు జీవనోపాధి లభిస్తోంది. ప్రభుత్వం మాత్రం పరిశ్రమల అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రాష్ట్రం విడిపోయిన తరువాత పరిశ్రమలు తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. విజయవాడ దాటి హైదరాబాద్ వెళ్లాలంటే పన్ను పోటు పెరిగింది. పలాస నుంచి తిరుపతి, ఇతర దేవస్థానాలకు జీడిపప్పు కొనుగోలు చేయాలనే డిమాండ్ గత కొన్నేళ్లుగా ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇతర రాష్ట్రాల నుంచి జీడిపప్పును కొనుగోలు చేస్తుంది తప్ప ఇక్కడ ఉత్పత్తి అవుతున్న పప్పును కొనుగోలు చేయడం లేదు. మరోవైపు పరిశ్రమలకు రాయితీలు కల్పించకపోవడం, పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు మెరుగైన సదుపాయాలు కల్పించకపోవడం, కనీస వేతనాలు అమలు చేయకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏడాదికి పరిశ్రమలకు అవసరమైన 10.80 లక్షల టన్నులు ముడసరుకులు మన రాష్ట్రం నుంచి ఉత్పత్తి కావడంలేదని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీడి పంట సాగు విస్తీర్ణాన్ని పెంచడంతోపాటు జీడిపరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం రాయితీలు కల్పించాలని, ఈ ప్రాంతంలోని వేలాది మంది కార్మికుల జీవనోపాధికి ఆటంకాలు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు

జీడి పంట సాగు వివరాలు

జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో జీడిపంట సాగవుతుంది. పలాస నియోజకవర్గంలో 21,300 ఎకరాల్లో, కవిటి, కంచిలి, సోంపేట మండలాల్లో 17 వేల ఎకరాల్లో జీడిపంట సాగవుతుంది. 74 గ్రామాల్లో సాగవుతున్న ఈ పంటతో సుమారు 5 లక్షల క్వింటాళ్ల జీడిపిక్కలు దిగుబడి అవుతుంటాయి. ఏటా ఆశించిన స్థాయిలో జీడిపంట దిగుబడి రాకపోతుండడంతో నైజీరియా, టాంజానియా, మలేషియా, న్యూజిలాండ్ దేశాలతోపాటు మనదేశంలోని కేరళ, తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు జీడిపిక్కలను దిగుమతి చేసుకుని గోదాములలో నిల్వ చేసుకుంటుంటారు. వీటిని ఏడాది పొడవునా వినియోగిస్తుంటారు. ప్రస్తుతం జీడిపిక్కల బస్తా (80 కిలోలు) రూ.7 వేలు వరకు ధర పలుకుతుంది. ఈ పంటే జీవనాధారంగా వేలాది మంది రైతులు బతుకుతున్నారు. ఉద్దానంలో పండించిన జీడిపిక్కలనే పలాసలోని జీడి పరిశ్రమలకు అందిస్తుంటారు. తిత్లీ తుపాను ప్రభావంతో ఉద్దాన ప్రాంతంలో జీడి పంట పూర్తిగా నాశనం కావడంతో ఈ ఏడాది ఉద్దాన ప్రాంత రైతులు, జీడి కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర దేశాల నుంచి జీడిపిక్కలను వ్యాపారులు దిగుమతి చేస్తేనే ఉపాధి లభించే అవకాశం ఉందని, లేకుంటే కుటుంబమంతా పస్తులు ఉండాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు

సంక్షోభంలో గ్రానైట్ పరిశ్రమ

జిల్లాలో 30 ఏళ్ల క్రితం 70 వరకు గ్రానైట్ పరిశ్రమలు, మరో 40 పాలిసింగ్ యూనిట్లలో సుమారు 4వేల మందికిపైగా కార్మికులు ఉపాధి పొందేవారు. వ్యవసాయ రంగంతో పాటు ఎక్కువ మంది కార్మికులకు ఉపాధి కలిగించే గ్రానైట్ పరిశ్రమ నేడు సంక్షోభంలోకి నెట్టబడింది. మారుమూల వెనుకబడిన ప్రాంతంగా ఉన్న శ్రీకాకుళం జిల్లాలో నీలి గ్రానైట్ పరిశ్రమ వల్ల అంతర్జాతీయంగా మన జిల్లాకు పేరు, ప్రఖ్యాతలు లభించాయి. జిల్లాలో గ్రానైట్ నిక్షేపాలు బౌల్డర్, మట్టితో కూడుకున్న ఉండటం వల్ల మిగతా ప్రాంతాల కంటే అత్యంత తక్కువ రికవరీ 5శాతంగా ఉంది. దేశంలో లభించే అన్ని కలర్ గ్రానైట్ కంటే సామాన్యులకు అందుబాటులో తక్కువ ధరకు అమ్ముడుపోతున్న గ్రానైట్ మన శ్రీకాకుళం జిల్లా గ్రానైట్.

అంతర్జాతీయ మార్కెట్‌లో గ్రానైట్ ఎగుమతులు తగ్గిపోవడం, సీనరేజీ ఛార్జీలు మీద మరో 25శాతం అదనంగా పెంచడం, డీడ్ రెంటు ఒక హెక్టారుకు 44000 నుంచి లక్షకు పెంచడం, మెరిట్ పేరుతో మరో 2శాతం పెంచడం వల్ల బాగా వచ్చే లాభాలు తగ్గిపోయి, ఖర్చులు పెరిగాయి. ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడంతో సంక్షోభంలోకి వెళ్తూ, పరిశ్రమలు మూతపడుతున్న పరిస్థితి ఏర్పడింది.

కార్మికులకు దక్కని కనీస వేతనం

గ్రానైట్ కంపెనీలు ప్రారంభం నుంచి కార్మికులకు కనీస వేతనం లేవు. పిఎఫ్, ఇఎస్ఐ వంటి చట్టపరమైన సదుపాయాలులేవు. ఒకప్పుడు ఒక జాక్ హీమరు డ్రిల్లరుపై నలుగురు కార్మికులు పనిచేస్తే, నేడు ఇద్దరితో పని చేయిస్తున్నారు. పనిభారం పెరిగింది. యూనియన్ పోరాటాలతో భోనస్, గ్రాట్యూటీ పొందే కార్మికుల సంఖ్య తగ్గడంతో ఫుల్ అండ్ ఫైనల్‌కు కూడా నోచుకోకుండా ఖాళీ చేతులతో ఇంటికి పంపుతున్నారు. ఉద్యోగ భద్రత, పని భద్రత లేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. కార్మిక చట్టాలను అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లు అంటూ సెంట్రల్ లేబర్ అధికారులు తనిఖీలు నిలుపుదల చేశారు. జాయింట్ మీటింగ్‌లు కూడా నిలుపుదల చేశారు. పలు కంపెనీల నుంచి అక్రమంగా కార్మికులను తొలగిస్తుంటే విశాఖపట్నం సెంట్రల్ కార్మిక అధికారులు ఏడాది కావస్తున్నా ఒక ఫిర్యాదుపై కూడా స్పందించలేదు. ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలుతో పాటు యాజమాన్య నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాటాలు చేయడమే మన ముందున్న కర్తవ్యం.



- నంబూరు షణ్ముఖరావు
జిల్లా ప్రధాన కార్యదర్శి,
గ్రానైట్ వర్కర్స్ యూనియన్

హక్కుల సాధనకు పోరాటం



కార్మికార్మికుల త్యాగాల నుంచి పుట్టిన దినం 'మేడే'. ప్రపంచ కార్మిక దినోత్సవం రోజున కార్మికుల త్యాగాల గుర్తించుకోవాల్సిన అవసరం ఉంది. కార్పొరేట్ సంస్థల హవాతో చాలావరకు ప్రభుత్వ సంస్థలు ప్రయివేటీకరణకు దారితీస్తున్నాయి. అది విద్య, వైద్య, రైల్వే ఏదైనా కావచ్చు. ఇలా అనేక సంస్థల్లో ఉద్యోగాల భర్తీ కూడా అవుట్ సోర్సింగ్ ద్వారానే నిర్వహించడం దీనికి నిదర్శనం. ప్రయివేట్ కిందికి వెళ్లిపోయిన కార్మికులకు రాజ్యాంగంలోని హక్కులను మరిచిపోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కార్మికుల హక్కులు వారికి దక్కాలంటే ఈ ప్రయివేటీకరణపై పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాలు అనేక సమస్యలను పరిష్కరించాలని ఉద్యమిస్తున్నా... ప్రభుత్వాలు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఉన్న హక్కులను కాలరాస్తున్నారు. కార్మికులకు కల్పించిన హక్కులు చట్టాల ద్వారా వారికి న్యాయం జరిగినప్పుడే మేడే అనే పదానికి ఒక అర్థం. ఒక పరమార్థం ఉంటుంది.

- హనుమంతు సాయిరాం,
జిల్లా అధ్యక్షులు, ఎన్‌జిఒ అసోసియేషన్

ప్రశ్నించే గొంతు నొక్కుతున్న ప్రభుత్వాలు



ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ప్రశ్నించే గొంతును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నొక్కుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఫ్యూడల్ వ్యవస్థ విధానాలను అవలంబిస్తుంది. ప్రశ్నించే సామాజిక వేత్తలను పొట్టన పెట్టుకుంటుంది. రాష్ట్రంలో జిఒ 1ను అమలు చేస్తూ ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారిని నిర్బంధాలకు గురి చేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి.

- బొడ్డేపల్లి జనార్ధనరావు
జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు

కార్మిక హక్కుల పరిరక్షణే లక్ష్యం



కార్మిక, ఉద్యోగుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా భవిష్యత్ పోరాటాలు కొనసాగిస్తాం. జిల్లాలో జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్ వంటి పరిశ్రమలు మూతపడి కార్మికులు రోడ్డున పడినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. జిల్లాలో మూతపడిన జ్యూట్ పరిశ్రమలను తెరిపించేందుకు వాటికి అవసరమైన రాయితీలను కల్పించడం లేదు. ఆమదాలవలస సహకార చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఎన్నికల ముందు హామీలు ఇచ్చి... గెలిచిన తర్వాత పట్టించుకోవడం లేదు. దీనివల్ల వేలాదిమంది కార్మికులకు ఉపాధి లేకుండాపోతోంది. కేంద్ర ప్రభుత్వ స్కీముల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులకు కనీస వేతనాలు, పని గంటలు అమలు చేయాలి. ప్రభుత్వశాఖల్లో సేవలందిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ చేయకుండా వెట్టి చాకిరీ చేయిస్తున్నారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేటు అనుకూల, కార్మిక వ్యతిరేక నిర్ణయాలను తిప్పి కొట్టాలి. మేడే స్ఫూర్తితో హక్కులను పరిరక్షించుకునేందుకు పోరాటాల వైపు అడుగులు వేయాలి.

- మామిడి క్రాంతి, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు

మెనూ ఛార్జీలు పెంచాలి



రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం అమలు చేయడం లేదు. జగనన్న గోరుముద్దకు మెనూ ఛార్జీలు పెంచకపోవడంతో అదనపు భారం పడుతోంది. మధ్యాహ్న భోజన కార్మికులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారు. వంట వంట ఏజెన్సీలకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీల పెంపుదల చేయాలి. నెలవారి సక్రంగా బిల్లులు, గౌరవ వేతనాలు చెల్లింపులో తీవ్రమైన జాప్యం చేయడంతో అప్పుల పాలైపోతున్నారు. రోజుకి ఆరేడు గంటల పనిచేస్తున్న కార్మికులకు గౌరవ వేతనం పేరుతో శ్రమ దోపిడీ చేస్తున్నారు. జగనన్న గోరుముద్ద పెరిగిన ధరలకు అనుగుణంగా పిల్లవాడికి ఒక్కింటికి రూ.20 రీఛార్జ్ పెంచాలి. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని పోరాటాలు చేస్తున్నాం. కార్మికులకు సామాజిక భద్రత పెన్షన్లు, పనిలో అగ్నిప్రమాదాలకు గురయ్యే బాధితులకు బీమా సౌకర్యం ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. 18 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారికి పనిభద్రత లేదు.

- బి.ఉత్తర, ఎండిఎం కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి









బిఎస్‌ఎన్‌ఎల్‌ను కాపాడుకుందాం



ఏడాదికి రూ.7,200 కోట్లు ఆదాయాన్ని సమకూర్చి పెట్టే టెలికాం డిపార్ట్‌మెంట్‌ను కొందరి కార్పొరేట్ ప్రయోజనాల కోసం 2000లో వాజ్‌పాయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో బిఎస్‌ఎన్‌ఎల్ కార్పొరేషన్‌గా బలవంతంగా మార్చేశారు. అప్పటి నుంచే బిఎస్‌ఎన్‌ఎల్ నిర్వీర్యం చేయడానికి బీజాలు పడ్డాయి. ప్రయివేట్ టెలికాం కంపెనీలకు 1995 నుంచే సెల్ సేవలు అందించడానికి అనుమతులు బిఎస్‌ఎన్‌ఎల్ మాత్రమే ఇచ్చింది. 2002 వరకు సెల్ సేవలు అందించడానికి అనుమతులు ఇవ్వలేదు. ఈ ఏడేళ్లలోనే ప్రయివేట్ సెల్ కంపెనీలు పూర్తిగా సెల్యూలర్ మార్కెట్‌ను కొల్లగొట్టి ఇన్ కమింగ్ కాల్స్‌కు కూడా సెల్ ఛార్జీలు వసూలు చేసి లాభాలను పిండుకున్నాయి. చివరకు సెల్ సేవలు విస్తరణకు కావాల్సిన సామగ్రి కొనుగోళ్లకూ అప్పటి ప్రభుత్వం మోకాళ్లడింది. బిఎస్‌ఎన్‌ఎల్ సంస్థలో ఉన్న ఉద్యోగులు ఐక్య పోరాటాల ద్వారా దేశవ్యాప్తంగా సమ్మె చేసింది. 50 శాతం సామగ్రి కొనుగోలుకు అప్పటి ప్రభుత్వం అంగీకరించింది. మరొక వైపు సెల్ సేవలు మరింత చౌకగా బిఎస్‌ఎన్‌ఎల్ ప్రజలకు అందించడానికి విదేశాల నుంచి సామగ్రిని ఎగుమతి చేసుకుంటామన్నారు. కానీ, భద్రతా కారణాలు సాకుగా చూపి అనుమతులు ఇవ్వలేదు. ఇదే ప్రభుత్వం ప్రయివేటు కంపెనీలకు అనుమతి తన ఉదారత చాటుకుంది. బిఎస్‌ఎన్‌ఎల్ విస్తరణకు, అభివృద్ధికి నేటి ప్రభుత్వం కూడా అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తుంది. ఒక వైపు ప్రయివేట్ కంపెనీలకు 4జి, 5జి సేవలు అందించడానికి దేశవ్యాప్తంగా అనుమతులు ఇచ్చింది. బిఎస్‌ఎన్‌ఎల్ మాతృ సంస్థకు మాత్రం ఇప్పటికీ 4జి సేవలకూ అనుమతులు ఇవ్వలేదు. ల్యాండ్‌లైన్ నిర్వహణ వల్ల వచ్చే నష్టాలను ప్రభుత్వం బిఎస్‌ఎన్‌ఎల్‌కు తిరిగి చెల్లిస్తామని చెప్పింది. కానీ, ఈ నష్టాన్ని యుఎస్‌ఒ ఫండ్ ప్రభుత్వం రూ.26,000 కోట్లు బిఎస్‌ఎన్‌ఎల్‌కు నేటికీ ఇవ్వలేదు. నేటి బిజెపి ప్రభుత్వం నేషనల్ మోనటరైజేషన్ పైపులైన్ పేరుతో బిఎస్‌ఎన్‌ఎల్ 4700 సెల్ టవర్లు, 1,62,000 కిలో మీటర్ల ఆప్టికల్ ఫైబర్ కేబుల్స్ కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి పూనుకుంది. మన దేశ ప్రధాని సెలవిచ్చినట్లు ప్రభుత్వరంగ సంస్థలు పుట్టిందే చావడానికే బిఎస్‌ఎన్‌ఎల్ విషయంలో రుజువైంది. బిఎస్‌ఎన్‌ఎల్ సంస్థ పోటీలో ఉంటేనే దేశ ప్రజలకు సెల్‌సేవలు తక్కువ ధరలకు అందుతాయని అనుభవంలో చూశాం. బిఎస్‌ఎన్‌ఎల్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

- ఎం.గోవర్ధనరావు, బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు









అరుణతార... కష్టజీవుల ధ్రువతార

(ఆంధ్రలో సీనియర్ కమ్యూనిస్టు, సుందరయ్య గారి సహచరుడు అమరజీవి కంభంపాటి సత్యనారాయణ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఆయన గురించి రాసిన భాగమిది. ఆ పుస్తకం కోసం ఆయన సుందరయ్యగారిని ప్రత్యేకంగా ఇంటర్వ్యూ చేశారు. పుస్తక రచనలో సలహాలు తీసుకున్నారు. కంభంపాటి మృతి అనంతరం సుందరయ్యగారు ఆ పుస్తకాన్ని ఆవిష్కరించిన సంగతి తెలిసిందే)

పుచ్చలపల్లి సుందరయ్య 1913లో జన్మించారు. స్వగ్రామం నెల్లూరుజిల్లా అలగానిపాడు. చిన్నప్పుడే తండ్రిపోవడం వల్ల, బావగారింట్లో ఉండి చదువుకొనేవారు. 1921-30 మధ్య ప్రైవేట్ ట్యూషన్ చెబుతున్న టీచర్ వెంకటరత్నంగారి వల్ల వీరికి తెలుగుభాష మీద అభిమానం పెరిగింది. దానిని అభివృద్ధి చేసుకోవడంతో భోగరాజు నారాయణమూర్తి 'విమలాదేవి' 'రాయచూరు యుద్ధం", 'తిమ్మరుసు' మొదలైన చారిత్రక నవలలు చదవడంతో స్వాతంత్ర్య యోధుల మీద భక్తి శ్రద్ధలు ఏర్పడ్డాయి. వేమన పద్యాలు, సుమతీ శతకం కంఠస్థం చేయడంతో సాంఘిక సమానత్వ భావాలంకురించాయి. నియమబద్ధ జీవితానికి పునాదులేర్పడ్డాయి. రాజమండ్రిలో వీరి బావగారు సెషన్స్ జడ్జిగా ఉన్నప్పుడు 1924-25లో పందిరి మల్లిఖార్జునరావుగారితో పరిచయం ఏర్పడింది. వారి సలహానుసరించి కొమర్రాజు లక్ష్మణరావుగారి భారతదేశ చరిత్ర గ్రంథాలు, చిలుకూరి వీరభద్రరావుగారి ఆంధ్రుల చరిత్ర, వీరేశలింగం, చిలకమూర్తి లక్ష్మీనరసింహంగార్ల గ్రంథాలు చదవడంతో పై భావాలు దృఢపడ్డాయి. 1925లో చిత్తరంజన్‌దాసు మరణించారే వార్త విని, కాంగ్రెస్‌ను గురించీ, అది నడిపే పోరాటాన్ని గురించీ తెలుసుకోవాలని కుతూహలపడ్డారు. రోజూ ఆంధ్ర దినపత్రిక చదవడం ప్రారంభించారు. 1919లో డయ్యరు సేనాని జలియన్‌వాలాబాగ్‌లో జరిపిన మారణహోమాన్ని గురించి కాంగ్రెస్ విచారణ కమిటీ ప్రకటించిన రిపోర్టు తెలుగులో వెలువడింది. అది చదివి బ్రిటిష్ పాలనను ఏవగించుకోసాగారు. 1925 డిసెంబరులో ఒక వ్యక్తిగత విప్లవవాద గ్రూపులో చేరారు. తరువాత గాంధీజీ ఆత్మకథ చదివారు. వారి సంపాదకత్వం కింద వెలువడుతున్న 'యంగ్ ఇండియా' వారపత్రిక కూడా చదవసాగారు. అప్పటి నుంచి ఖద్దరు ధరించడం ప్రారంభించారు. సాధ్యమైన, తక్కువ అవసరాలతో జీవితాన్ని నియమబద్ధంగా గడపడానికి కృషి చేశారు. క్రమంగా, ఇతర భావ తరంగాలు వీరి ఆలోచనల్ని పదును పెట్టాయి. 1926లో మద్రాసులో నాల్గవఫారం చదువుతున్నప్పుడు సావర్కార్ జీవితాన్ని గురించి చదివి ఉత్తేజం పొందారు. భారతీయ సంస్కృతిపై పాశ్చాత్య దేశాల్లో అనేక ఉపన్యాసాలిచ్చిన స్వామి వివేకానందం రచనల్ని చదివి, స్వదేశాభిమానాన్ని, స్వయం శిక్షణను అలవరుచుకున్నారు. తిలక్ మాండలేజైల్లో రచించిన 'గీతా రహస్యం' వీరికి కర్తవ్య ప్రబోధం చేసింది. "నేను చదువుకొంటున్న హైస్కూల్లో గీతా రహస్యం మీద నేనిచ్చిన ఉపన్యాసం విని విద్యార్థులూ, ఉపాధ్యాయులూ మెచ్చుకున్నారు" అని ఒక ఇంటర్వ్యూలో అన్నారాయన 1927లో జవహర్‌లాల్‌నెహ్రూ రష్యా నుంచి తిరిగివచ్చి, ఆ దేశంలోని సోషలిస్టు వ్యవస్థను గురించి ధారావాహికంగా రాసిన వ్యాసాలు వీరిలో మొట్టమొదటిసారిగా సోషలిస్టు బీజాలు నాటాయి. 1927లో మద్రాసులో జరిగిన కాంగ్రెస్ మహాసభ సంపూర్ణ స్వాతంత్ర్యం తన ధ్యేయమని తీర్మానించడం, మరుసటి సంవత్సరం మద్రాసులో సైమన్ కమిషన్‌కి వ్యతిరేకంగా జరిగిన హర్తాళ్, బహిరం గసభ, ఇవన్నీ సుందరయ్య గారిలో స్వాతంత్ర్యేచ్ఛ ను ఇనుమడిం పజేశాయి. ఆరోజు వీరి హైస్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులూ హర్తాళ్‌లో పాల్గొన్నారు. మద్రాసులో చదువుకొంటున్న రోజుల్లో సుందరయ్యగారు ప్రతియేడు వేసవి సెలవుల్లో స్వగ్రామం వెళ్లేవారు. అలా వెళ్లినప్పుడల్లా సొంత పొలంలో కూలీలతో కలిసి వ్యవసాయ పనులు చేసేవారు. స్కూల్ ఫైనల్ పాసయ్యాక 1929లో వీరు మద్రాసు లయోలా కాలేజీలో ప్రవేశించారు. ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు కొంతమంది తెలుగు విద్యార్థులతో కలిసి సోదర సమితిగా ఏర్పడి వ్యాయామం, గ్రంథపఠనం, ఖద్దరు విక్రయం మొదలైన కార్యక్రమాల్లో పాల్గొనేవారు. బొంబాయి నుంచి వెలువడే యంగ్ లిబరేటర్ పత్రికకు ఇరుగతలతో కలిసి చందాదారుల్ని చేర్పించారు. అప్పుడే 'కమ్యూనిస్టు ప్రణాళిక', 'కూలిపని- పెట్టుబడి' మొదలైన మార్క్సిస్టు గ్రంథాలు కూడా చదివారు. ఆనాటి నుండి కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేయడానికి నిశ్చయించుకున్నారు.

మీరట్ జైల్లో ప్రారంభమైన కమ్యూనిస్టు కుట్రకేసు విచారణను గురించిన వార్తలు ప్రతిరోజూ పత్రికల్లో వెలువడుతుండేవి. ఆ కేసులో ముద్దాయిలు ప్రాసిక్యూషన్ మీద విసురుతున్న సవాళ్లు, కమ్యూనిజాన్ని గురించి ప్రాసిక్యూషన్ చెప్పే అబద్ధాలకు గూబగుయ్యిమనేటట్లు జవాబులు చెప్పడం, తమ ధ్యేయాన్ని గురించీ, విధానాన్ని గురించీ నిర్మొహమాటంగా బల్లగుద్ది చెప్పడం ఇవన్నీ సుందరయ్యగారి ఆలోచనల్ని పదునుపెట్టాయి. ఒకరోజున విద్యార్థి గాంధీ టోపీతో క్లాసుకు వచ్చి కూర్చున్నాడు. అది చూసి ఒక కాథలిక్ ప్రొఫెసర్ ఆ విద్యార్థిని బయటికి పంపించేశాడు. మరునాడు విద్యార్థులందరూ గాంధీ టోపీలతో క్లాసుకు ప్రత్యక్షం, అది చూసి ప్రొఫెసర్ క్లాసును సస్పెండ్ చేశాడు. వాతావరణం ఉద్రిక్తంగా ఉంది. సోదర సమితి సభ్యులు ఇతర విద్యార్థులతో చేతులు కలిపి, సమ్మెకు పిలుపునిచ్చారు. ఇదంతా గమనిస్తున్న ప్రిన్సిపాల్ తెలివిగా, నోటీసుబోర్డులో ఎవరికి తోచిన టోపీలు వారు ధరించవచ్చునని ప్రకటించాడు. విద్యార్థులకు ఇదొక ఘన విజయం. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుండగా, సుందరయ్య అలగానిపాడు వెళ్లారు. అక్కడ వ్యవసాయ కార్మికులలో పనిచేయడానికి 1930 వేమన జయంతినాడు అవర్ణులకు, సవర్ణులకు కలిపి పంక్తి భోజనం ఏర్పాటు చేశారు. సవర్ణులు సుందరయ్యగారికి దగ్గర బంధువులు దీనిని సహించలేక హరిజనుల్ని



రానియ్యకుండా ఆపుచేశారు. భూస్వాముల ఈ చర్యకు అసమ్మతిగా సుందరయ్య రెండురోజులు నిరాహారవ్రతం చేశారు. అదిపేద ప్రజలలోనూ, హరిజనులలోనూ ప్రత్యేక అభిమానం కలిగించింది. నిరాహారదీక్ష పూర్తికాగానే సోదర సమితి పిలుపు మీద ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొనడానికి పశ్చిమగోదావరి జిల్లా వెళ్లారు. భీమవరం తాలూకాలో రెండుచోట్ల చట్టధిక్కారం చేశారు. దిరుసుమర్రు వలంటీర్ శిబిరానికి వచ్చి, అక్కడ వలంటీర్ కెప్టెన్‌గా పనిచేశారు. చట్టధిక్కారానికి పాల్పడినాడని భీమవరం సబ్‌కలెక్టర్ 1930 జూన్ 16న సుందరయ్యగారికి రెండేళ్లు కఠిన శిక్ష విధించారు. వీరికప్పుడు 17 ఏళ్లు మాత్రమే. మైనరు కావడం చేత తంజావూరులో బాల నేరస్థుల్ని నిర్బంధించే బోర్స్టల్ జైలుకు పంపించారు. ఆ జైల్లో పరిస్థితులు అతి నికృష్టంగా వుండడం చూసి మరికొందరితో కలిసి నిరాహార వ్రతం చేశారు. అయిదో రోజున జైలు వార్డన్లు ఇనుప పట్కారుతో నోటిని తెరిచి గొంతులో గంజిపోశారు. తరువాత 24 గంటలూ ఒంటికొట్లో నిర్బంధించారు. రెండు నెలల తరువాత తిరుచినాపల్లి జైలుకి మార్చారు. తిరిగి తంజావూరు బోర్స్టల్ జైలుకి మార్చారు. అక్కడ మళ్లీ నిరాహారదీక్ష ప్రారంభించడం వల్ల రాజమండ్రి జైలుకు మార్చారు. ఆ జైల్లోని ఇతర రాజకీయ ఖైదీలతో రష్యా విప్లవాన్ని గురించి, అలాంటి విప్లవాన్నే మన దేశంలో కూడా నడపడం గురించీ చర్చలు జరిపేవారు. రాజమండ్రి జైలులో లాహోరు కుట్రకేసు ఖైదీలు శివవర్మ, విజయకుమార్ సిన్హాలతో వీరికి పరిచయమైంది. వారిది హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీ. సోషలిజం సాధనకై వ్యక్తిగత విప్లవాద చర్యలను చేపట్టినవారు. అయితే గాఢమైన దేశభక్తి, అపారమైన ధైర్య సాహసాలు గలవారు. అదే సమయంలో తమ ఉద్యమంలో ద్యోతకమైన బలహీనతలు, అజాగ్రత్త వల్ల కలిగిన నష్టాలు కూడా వారు వివరించారు. ఆ సమాచారం సుందరయ్య గారికి ఎంతగానో తోడ్పడింది. శివవర్మ తన విప్లవ జీవితంలో ఎలా రహస్యంగా పనిచేసిందీ, జరిగిన పోరాటాట్లు, విప్లవకారుల్లోని ధైర్యసాహసాలు అన్నీ వర్ణించి చెప్పేవారు. శిక్షాకాలం పూర్తి కాకముందే సుందరయ్యగారు గాంధీ - ఇర్విన్ ఒడంబడిక ప్రకారం 1931 మార్చి 20వ తేదీన విడుదలయ్యారు. అప్పుడు వీరి బావగారు బెంగుళూరులో సెషన్స్ జడ్జిగా ఉండేవారు. అక్కడ సెయింట్ జోసెఫ్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరంలో ప్రవేశించారు. అప్పటికి సత్యాగ్రహ పద్ధతిపై వీరికి నమ్మకం పూర్తిగా పోయింది. 'ఒకసారి ఒక హరిజన స్త్రీ నా దగ్గరకొచ్చింది. డాక్టర్లు మాత్రమే చేయగల చికిత్స నన్ను చేయమని ఆమె అమాయకంగా బ్రతిమాలింది. నేను ప్రథమ చికిత్స మాత్రమే చేయగలనన్నాను. వైద్యం నాకు తెలియదన్నాను. ఎంత చెప్పినా ఆమె వినలేదు. నెల్లూరులో ఒక డాక్టరు పేరు చెప్పి, ఆయనకు ఉత్తరం రాసి ఇస్తానన్నాను. రైలు ఖర్చులు కూడా ఇస్తానన్నాను. ఆమె ససేమిరా వినలేదు. ఆమె రొమ్ములో ఒక పెద్ద పుండు వున్నట్టు స్పష్టమైంది. అందులోంచి చీము విపరీతంగా పైకొస్తుంది. నేను వేడినీళ్ళు కాచి శుభ్రమైన దూదితో పుండు కడిగేసి, గుడ్డతో కట్టుకట్టాను. ఆమె సంతృప్తి చెంది వెళ్లిపోయింది. మళ్లా నా దగ్గరకు రాలేదు" అని నాతో అన్నారు. సుందరయ్యగారి కార్యకలాపాలను గురించి విని అమీర్ హైదర్‌ఖాన్ 1931లో ఆయనను కలుసుకోవడానికి వెళ్లారు. తనను కమ్యూనిస్టుగా పనిచేయమని సలహా ఇచ్చారు. తాను బి.ఎ పూర్తి చేస్తానని తల్లికి మాట ఇచ్చానని, అది పూర్తికాగానే తన కాలాన్ని కమ్యూనిస్టు ఉద్యమంలో గడుపుతానని చెప్పారు. కానీ బెంగుళూరులో 1931లో ఆరుమాసాలు మాత్రమే చదివి, ఆ చదువు వల్ల ప్రయోజనమేమీ ఉండదనుకొని చదువుకు స్వస్తి చెప్పి తిరిగి అలగానిపాడు వెళ్లారు.



ఒకరోజున నెల్లూరు నుంచి వీరెరిగిన దువ్వూరి బలరామిరెడ్డి, చుండిజగన్నాథం, మరికొందరు అలగానిపాడు వచ్చారు. వీరు స్వాతంత్ర్యోద్యమంలో జైళ్లకు వెళ్ళి, విడుదలై వచ్చాక వ్యక్తిగత విప్లవవాదాన్ని చేపట్టినవారు. సుందరయ్యగారిని కూడా తమ వెంట తీసుకుపోవాలనుకొని వచ్చారు. వీరి మధ్య దీర్ఘ చర్చలు జరిగాయి. వ్యక్తిగత విప్లవవాదం సరైనది కాదని ఎంత వాదించినా వారు వినలేదు. చివరకు వారు లాభం లేదని తిరిగి వెళ్లిపోయారు. అంతకు రెండేళ్ళ ముందే సుందరయ్యగారికి వ్యక్తిగత విప్లవాదం పట్ల నమ్మకంపోయింది. కార్మిక, కర్షక పోరాటాలను నడపడమొక్కటే స్వాంత్ర్య సాధనకు మార్గమని ఆయన నమ్మారు. కొన్నాళ్ల తరువాత అలగానిపాడు విడిచిపెట్టి ఎక్కడెక్కడ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి అవకాశాలున్నాయో కనుగొనడానికి 1933-34 మధ్య ఆంధ్ర జిల్లాలు పర్యటించారు. తన జైలు మిత్రుల ద్వారా, సోదర సమితి సభ్యుల ద్వారా ఒక్కొక్కరినే కలుసుకొని మాట్లాడసాగారు. వారిలో మల్లికార్జునరావు, పెన్మెత్స సూర్యనారాయణ, పెన్మెత్స అనంతరం, పశ్చిమ గోదావరిలో ఉద్దరాజు రామం, అల్లూరి సత్యనారాయణ, తనికెళ్ల వెంకట చలపతి, కలిదిండి సుబ్రహ్మణ్యం, కృష్ణాజిల్లాలో మద్దుకూరి చంద్రశేఖరరావు, చలసాని వాసుదేవరావు, చలసాని జగన్నాథరావు, కొసరాజు శేషయ్య, కాట్రగడ్డ నారాయణరావు, గద్దె లింగయ్య, గుంటూరుజిల్లాలో పోలేపెద్ది నరసింహమూర్తి, జొన్నలగడ్డ రామలింగయ్య, పెండ్యాల లోకనాథం, ప్రతాపరామ సుబ్బయ్య, నెల్లూరు జిల్లాలో బస్వారెడ్డి శంకరయ్య మొదలైనవారు. ఈ కార్యక్రమం కొనసాగిస్తూనే వీరు అలగానిపాడుతో సంబంధం వదులుకోలేదు. 1934లో అక్కడ వ్యవసాయ సంఘాన్ని స్థాపించారు. 1934 సెప్టెంబరులో సుందరయ్యగారు బెజవాడలో ఒక సమావేశం ఏర్పరిచారు. దానికి వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు వచ్చారు. వారందరూ 'కమ్యూనిస్టు ప్రణాళిక' ఏమిచేయాలి? "రాజ్యాంగ యంత్రం - విప్లవం', 'వామపక్ష కమ్యూనిజం' 'కూలిపని - పెట్టుబడి' మొదలైన గ్రంథాలూ, మీరట్ కుట్ర కేసులో కమ్యూనిస్టు నిందితులిచ్చిన సంయుక్త ప్రకటన అధ్యయనం చేసేవారు. ఇవన్నీ అచ్చులో కాక సైక్లోస్టైల్‌లో కొన్ని, రాతలో కొన్ని వుండేవి. వీటిలో సుందరయ్యగారు అనువదించినవి 'కమ్యూనిస్టు ప్రణాళిక' 'రాజ్యాంగ యంత్రం - విప్లవం', 'ఏమి చేయాలి? "వామపక్ష కమ్యూనిజం" చివరి గ్రంథాన్ని నండూరి ప్రసాదరావుగారు కూడా అనువదించారు. మీరట్ ప్రకటనలోని వేర్వేరు భాగాలను వేర్వేరు వ్యక్తులు అనువదించారు. పై సమావేశం ఏడుగురితో ఒక రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీని ఎన్నుకొంది. పోలేపెద్ది నరసింహమూర్తి, కొసరాజు శేషయ్య, మద్దుకూరి చంద్రశేఖరరావు, చలసాని వాసుదేవరావు, అల్లూరి సత్యనారాయణ, తనికెళ్ల వెంకటచలపతి, సుందరయ్య. బెజవాడ సమావేశం, రాష్ట్ర మంతటా కూలి రక్షణ సమితుల్ని ఏర్పరిచి వాటి ద్వారా కార్మికుల్లో పనిచేయాలనీ, తెలుగులో ఉన్న మార్క్సిస్టు గ్రంథాల ద్వారా యువతీయువకుల్లో కమ్యూనిస్టు చైతన్యం కలిగించాలనీ తీర్మానించింది. ◆

రక్తాక్షరాలతో లిఖించిన దీక్షా దినం


మానవ జాతి చరిత్రలో 18వ శతాబ్దం అంతకు పూర్వం కంటే అత్యంత అభివృద్ధి చెందిన శతాబ్దంగా గణతికెక్కింది. ఆ శతాబ్దంలోనే ఇంగ్లండ్ మరికొన్ని యూరోపియన్ దేశాల్లో ఉత్పత్తి రంగంలో ఆవిరి యంత్రాలను ప్రవేశపెట్టడం ద్వారా పారిశ్రామికీకరణ ప్రారంభమైంది. 1776 మార్చిలో వాట్ సన్ ఆవిరి యంత్రాన్ని కనిపెట్టాడు. దాన్ని ఇంగ్లండ్‌లోని ఓ బొగ్గు గనిలో మొదటిసారిగా ఉపయోగించారు. ఈ క్రమం అమెరికాకు కూడా పాకింది. బ్రిటన్‌లో పారిశ్రామిక విప్లవం వల్ల 1820 సంవత్సరంలో ఉన్న చేనేత కార్మికుల సంఖ్య 2,40,000 నుంచి 1844 సంవత్సరానికి 60 వేలకు తగ్గింది (1860నాటికి ఇది 8వేలకు తగ్గిపోయింది). అదేకాలంలో మరమగ్గాల ఆపరేటర్లు 10 వేల నుంచి లక్షన్నరకు పెరిగారు. యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ 19వ శతాబ్దంలో సైన్సు, టెక్నాలజీ బాగా అభివృద్ధి అయ్యాయి. దానితో భారీ పరిశ్రమలు ఏర్పడ్డాయి. వేల సంఖ్యలో కార్మికులు తలెత్తారు. రైల్వేలు, మోటారు కార్లు, టెలిఫోన్, టెలిగ్రాఫ్, విద్యుచ్ఛక్తి కూడా వాడుకలోకి వచ్చాయి. ఆ శతాబ్దంలో జర్మనీ, ఫ్రాన్స్ దేశాల్లో పారిశ్రామిక రంగ అభివృద్ధి విశేషంగా జరిగింది. యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల సంఖ్య ఒక కోటికి పెరిగింది. దానితో ఉత్పత్తి రంగంలో పెట్టుబడిదారీవర్గం, కార్మికవర్గం అనే రెండు ప్రత్యర్థి వర్గాలు తలెత్తాయి. పెట్టుబడిదారులు శ్రామిక ప్రజల శ్రమశక్తిని క్రూరంగా దోచుకుంటున్నారు. దీంతో పెట్టుబడిదారీ, కార్మికవర్గాల మధ్య సంఘర్షణ అనివార్యమైంది.

పారిశ్రామిక విప్లవం ప్రారంభదినాల్లో శ్రామికులు బానిసల మాదిరిగా శ్రమిస్తుండేవారు. పారిశ్రామివేత్తలు అధిక లాభాలను పిండుకోవడానికి ఆరేడేళ్ల పిల్లలతోనూ, మహిళలతో కూడా ఫ్యాక్టరీల్లో, గనుల్లో పని చేయించారు. బాలకార్మికులు గనుల్లోని చీకటి సొరంగాల్లో.. బొగ్గు బళ్లను మోచేతులపైన, మోకాళ్లపైన పాకుతూ లాగేవారు. ఆఖరికి పొగగొట్టాల పైకెక్కి వాటిని శుభ్రపర్చేవారు. ఇంగ్లండ్‌లోని అనాథ శరణాలయాల్లో పిల్లలను అక్కడి అధికారులు పారిశ్రామికవేత్తలకు పశువుల మాదిరిగా విక్రయించేవారు. బాల కార్మికులు ఉదయం నుంచీ రాత్రి వరకూ యంత్రాల వద్ద నిలబడి పనిచేసేవారు. క్షణం సేపు కన్ను మూస్తే ఆ చిన్నారుల వీపులు కొరడా దెబ్బలతో చిట్లిపోయేవి. ఇక శ్రమజీవులతో రోజూ 16 గంటలు పని చేయించేవారు. మరికొందరు పెట్టుబడిదారులు 20 గంటలు కూడా పనిచేయించారు. 1806లో అమెరికాలోని ఫిలడెల్ఫియాలో చెప్పులు కుట్టే కార్మికులు సమ్మె చేసిన సందర్భంగా జరిగిన విచారణలో కార్మికులతో యజమానులు రోజుకు 20 గంటలు పనిచేయించుకుంటున్నట్లు లోకానికి వెల్లడైంది. కార్మికులకు అతి తక్కువ జీతాలిచ్చేవారు. పని భద్రత, సౌకర్యాలుండేవి కావు. ఫ్యాక్టరీల్లో గాలీ వెలుతురు మృగ్యం. యంత్రాల వద్ద రక్షణ లేక కార్మికులు అనేక రకాలుగా ప్రమాదాల బారిన పడి మరణిస్తుండేవారు. కార్మికులు అమానుష శిక్షలకు కూడా గురవుతుండేవారు.

కార్మికులు తాము అనుభవించే పీడనకూ.. దోపిడీకీ కారణం తాము పనిచేసే యంత్రాలేనని భ్రమించారు. తెగించి వాటిని ధ్వంసం చేయడం ప్రారంభించారు. ఈ విధ్వంసకాండ మొదట బ్రిటన్‌లో ప్రారంభమైంది. దీంతో పారిశ్రామికవేత్తలు సాయం కోసం ప్రభుత్వం వద్దకు పరిగెత్తారు. నికృష్టంగా.. దోపిడీకి గురవుతున్న కార్మికుల ప్రాణ రక్షణకు చలించని ప్రభుత్వం.. వెంటనే యజమానులు ఆస్తి రక్షణకు పార్లమెంటును ఉపయోగించింది. యంత్రాలను ధ్వంసం చేసేవారికి మరణశిక్ష విధిస్తూ (1912లో) చట్టం చేసింది. తర్వాత కార్మికులు.. యంత్రాలను ధ్వంసం చేయడంలో అర్థం లేదనీ.. తమ దుస్థితికి కారణం ఫ్యాక్టరీ యజమానులే అని గ్రహించారు. ఆ దుస్థితి నుంచి బయట పడటానికి పోరాటం చేయడమొక్కటే మార్గమని అర్థం చేసుకున్నారు. దానితో పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా శ్రామికవర్గం పోరాటం ప్రారంభించింది. అణగదొక్కబడిన కార్మికవర్గం తమ హక్కుల సాధన కోసం కృత నిశ్చయంతో చైతన్యవంతంగా పోరాటాలు జరపడానికి వీలుగా కార్మిక సంఘాల నిర్మాణానికి పూనుకుంది.

1764-1800 మధ్య గ్రేట్ బ్రిటన్‌లో ట్రేడ్ యూనియన్ల నిర్మాణం జరిగింది. అటు తర్వాత యూరప్ ఖండంలో కార్మికవర్గం చైతన్యవంతంగా ఉన్న దేశాల్లో ట్రేడ్ యూనియన్ల నిర్మాణం ప్రారంభమైంది. అమెరికాలోని పిలడెల్ఫియా నగరంలో పోరాట సంప్రదాయం గల కార్మికులు 1806లో "మెకానిక్స్ యూనియన్" పేరుతో కార్మిక సంఘాన్ని ప్రారంభించారు. అదే అమెరికాలో మొట్టమొదటి కార్మిక సంఘం. 1850, 60 నాటికి యూరప్ ఖండంలోని అనేక దేశాల్లోనూ, అమెరికాలోనూ కార్మికులు విప్లవోత్సాహంతో శక్తివంతమైన కార్మిక సంఘాలను నిర్మించుకొని తమ హక్కుల సాధనకోసం క్రియాశీల పోరాటాల్లోకి దూకారు.

ట్రేడ్ యూనియన్ల మహత్తర సామాజిక శక్తిని చూసి పాలకులు, పెట్టుబడిదారులు హడలెత్తిపోయారు. ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ దేశాల్లో కార్మికులు అధిక జీతాలు డిమాండ్ చేయడానికి ట్రేడ్ యూనియన్లు నిర్మించుకోవడం చట్ట విరుద్ధంగా ప్రకటించారు. ఏర్పాటైన ట్రేడ్ యూనియన్లను నిషేధించారు. దోపిడీదారులైన పెట్టుబడిదారులు, వారికి అండదండలిచ్చే పాలకులు అనేక మంది కార్మిక నాయకులనూ, ట్రేడ్



యూనియన్ సభ్యులనూ జైళ్లలో కుక్కారు. హత్యలు చేశారు. వారికున్న కొద్దిపాటి సొత్తును సయితం కాజేశారు. ట్రేడ్ యూనియన్లను నిరంకుశంగా నిషేధించారు. సమ్మె హక్కునూ, పికెటింగ్ హక్కునూ లాగేశారు.

బూర్జువా పాలకులు ట్రేడ్ యూనియన్లను నిషేధించినా, పశుబలంతో కార్మికవర్గ పోరాటాలను రక్తపుటేరుల్లో ముంచినా.. కార్మికవర్గం వెనుకంజవేయలేదు. పనిగంటల తగ్గింపు, న్యాయమైన వేతనాలు, ట్రేడ్ యూనియన్ల గుర్తింపుకోసం ప్రభుత్వం నుంచి హక్కులు సాధించడానికి కార్మికవర్గం వర్గ చైతన్యంతో పోరాటాలను కొనసాగించింది. ఈ పోరాట జ్వాలలు 19వ శతాబ్ద ప్రథమార్థ భాగంలో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికాల్లో దోపిడీ శక్తులను చుట్టుముట్టాయి. ఇంగ్లండ్‌లో 1818లో స్టాక్‌పోర్టు పట్టణంలోని బట్టల ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులు సమ్మె బావుటాను ఎగురవేశారు. ఈ సమ్మె పోరాటం కార్మికవర్గ చరిత్రలో ప్రథమ సమ్మె పోరాటంగా చెప్పబడింది. ఫ్రాన్స్ దేశం లయాన్స్ పట్టణంలోని సిల్కు పరిశ్రమల్లో 1831లోనూ, 1834లోనూ కార్మికులు తిరుగుబాటు జరిపారు. ప్యారిస్ నగరంలో 1848 జూన్ 23-26 మధ్య సమ్మె పోరాటాలు జరిగాయి. జర్మనీలోని సైలీషియాలో 1844లో నేత పనివారు తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటు ద్వారా శ్రామికవర్గ నిర్మాణాత్మక పటిమ, బూర్జువావర్గంతో దానికిగల శత్రుత్వం స్పష్టంగా వెల్లడయింది. నైరుతీ జర్మనీలో 1848లో విప్లవోద్యమం రగుల్కొంది. అదేఏడు ఆస్ట్రియా వియన్నాలో తిరుగుబాటు వచ్చింది. కార్మికులు విజయం సాధించారు. బెర్లిన్‌లో కార్మికులు, సైనికులకూ మధ్య సంఘర్షణలు జరిగాయి. చివరికి శ్రామికులు విజయం సాధించారు. ఈ కాలంలోనే అమెరికాలో పెక్కు నగరాల్లో కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలు నిర్వహించారు.

యూరప్ ఖండంలోనూ, అమెరికాలోనూ కార్మికవర్గ బలమైన పోరాటాలు జరపడం వల్ల ప్రభుత్వాలు దిగివచ్చి కార్మికవర్గానికి అనుకూలంగా కొన్ని చట్టాలు చేశాయి. వాటిలో ముఖ్యమైనవి పనిగంటలకూ, బాల కార్మికులకూ సంబంధించినవి. బ్రిటన్‌లో 13 సంవత్సరాల లోపు పిల్లలతో రోజుకు 9 గంటలకు మించి పని చేయించరాదనీ 1834లో ఒక ఫ్యాక్టరీ చట్టం చేయబడింది. శ్రామిక ప్రజలు జరిపిన పోరాటాల వల్ల కొన్ని చట్టాలు చేసినా నిరంకుశాధికారులు వాటిని అమలు చేయలేదు. ఏడాదికేడాది ఫ్యాక్టరీల నిర్మాణం పెరిగిపోతోంది. గనులు, రవాణా రంగాల్లో పనిచేసే కార్మికుల సంఖ్య లక్షల్లో పెరిగింది. కార్మికుల్లో వర్గ చైతన్యం వెల్లివిరిసింది. బలమైన ట్రేడ్ యూనియన్ల నిర్మాణం జరిగింది. కార్మికవర్గ పోరాటాలు బూర్జువా వర్గాలను చుట్టుముట్టాయి.

10 గంటల పని దినం నిర్ణయించాలన్న కోరిక మీద 19వ శతాబ్దం ప్రారంభంలో అమెరికాలో ప్రతి పారిశ్రామిక కేంద్రంలోనూ సమ్మెలు చెలరేగాయి. ఫిలడెల్ఫియాలోని మెకానిక్ యూనియన్ ఈ 10 గంటల పనిదినం సాధించే పోరాటాన్ని 1827లో ప్రారంభించింది. ఈ పోరాటోధృతిని తట్టుకోలేక అమెరికా ప్రభుత్వం 10 గంటల పనిదినం నిర్ణయిస్తూ శాసనం చేసింది. తర్వాత ఈ 10 గంటల పనిదినం ఉద్యమం అట్లాంటిక్ మహాసముద్రం దాటి యూరప్ ఖండంలో ప్రవేశించి అక్కడి కార్మికవర్గాన్ని ఉత్తేజపరిచింది. యూరప్ ఖండంలో కార్మికులు జరిపిన పోరాటాల ఫలితంగా అనేక దేశాలు 10 గంటల పని దినం అంగీకరిస్తూ చట్టాలు చేశాయి.

1870 నాటికి పారిశ్రామిక, వాణిజ్య, బ్యాంకింగ్ రంగాల్లో గుత్తాధిపత్యం రూపుదాల్చి బలపడింది. పెట్టుబడిదారీ వర్గం కొన్ని ఒడిదుడుకులకు గురయినప్పటికీ అధికలాభాలు పోగేసుకోవడానికి అ వర్గాలకు మంచి అవకాశాలు ఏర్పడ్డాయి. కానీ కార్మికవర్గం జీవితాల్లో అభివృద్ధి మాత్రం మృగ్యం. దానితో కార్మికవర్గం పనిగంటల తగ్గింపుకోసం ఉద్యమించింది. 1881 చికాగో నగరంలో వివిధ కార్మిక సంఘాలు కలిసి ఒక సమాఖ్యను నూతనంగా ఏర్పాటు చేసుకున్నాయి. దానికి 'అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్' అని పేరు పెట్టారు. ఈ సమాఖ్య 1884 అక్టోబరు 7న తన 4వ సమావేశంలో 8 గంటల పనిదినం ప్రవేశపెట్టాలని చారిత్రాత్మకమైన తీర్మానం చేసింది. 1886 మే 1న దేశమంతా కార్మికవర్గం 8 గంటల పని హక్కు సాధనకు సమ్మె పోరాటాలను నిర్వహించాలని కూడా నిర్ణయించింది. 8 గంటల పనిదినం ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవలసిన అవసరాన్ని కార్మికవర్గం అత్యంత ముఖ్యమైన డిమాండుగా గుర్తించింది. ట్రేడ్ యూనియన్ల సభ్యత్వం లక్షల్లో పెరిగింది. ఈ విధంగా 8 గంటల పనికోసం అనేకచోట్ల కార్మిక పోరాటాలు ప్రారంభమయ్యాయి.



చికాగో నగరంలోని కార్మికవర్గం అమెరికన్ కార్మికవర్గంలో ఒక భాగమే అయినా అక్కడి కార్మికవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. సమస్యల పరిష్కారానికి వారు పటిష్టమైన విప్లవ దృక్పథం అవలంబించేవారు. ఆ నగరంలోని కార్మిక నాయకులు ఎప్పుడూ కార్మికవర్గాన్ని విప్లవ మార్గాన నడిపిస్తూ ఉండేవారు. సమ్మెకు అనేక రోజులకు పూర్వమే "8 గంటల పని దినం సంఘం" ఒకటి అనేక రాజకీయ దృక్పథాలు గలవారితో ఏర్పడి పనిచేస్తోంది. ఆ సంఘం నాయకత్వంలో ఏప్రిల్ 30న (మేడేకి ఒకరోజు ముందు) 25 వేల మంది కార్మికులతో బ్రహ్మాండమైన ప్రదర్శన జరిగింది. మే 1న చికాగో నగరంలో కార్మికవర్గం చైతన్యం వెల్లివిరిసింది. నగరవీధులన్నీ ఉత్సాహవంతులైన కార్మికులతో నిండిపోయాయి. నగరంలో బ్రహ్మాండమైన సార్వత్రిక సమ్మె జరిగింది. కార్మాగారాలన్నీ మూతపడ్డాయి. అదివరకెన్నడూ కనీవినీ ఎరుగనంతటి ఐకమత్యంతో మూడున్నర లక్షల మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. నగర వీధులన్నీ కార్మిక సందోహంతో నిండిపోయాయి. 8గంటల పనిదినాన్ని సాధించి తీర్తామనే దృఢ విశ్వాసం వారందరిలోనూ కనిపించింది. సమ్మెను విజయవంతం చేయడానికి వారు సర్వ శక్తులనూ ఒడ్డటానికి సిద్ధమయ్యారు. కార్మికవర్గ శత్రువులు కూడా విజృంభిస్తున్న ఈ కార్మికవర్గ ఉద్యమాన్ని ఏ విధంగానైనా నాశనం చేయాలని నిర్ణయించుకున్నారు. పెట్టుబడిదారీ వర్గానికి అండగా ప్రభుత్వం కూడా రంగ ప్రవేశం చేసింది.

మే 3న శాంతియుతంగా సమ్మె చేస్తున్న కార్మిక జనసమూహంపై అమెరికన్ పోలీసులు కాల్పులు జరిపారు. ఆరుగురు కార్మికులను బలి తీసుకున్నారు. ఈ దారుణ హత్యాకాండ పట్ల అసమ్మతి తెలిపేందుకు మే 4న నగరం మధ్యలో ఉన్న హే మార్కెట్‌లో కార్మికులు పెద్ద ఎత్తున నిరసన సభ జరిపారు. ప్రశాంతంగా సాగుతున్న ఆ సభ మీద పోలీసులు విరుచుకుపడ్డారు. మధ్యలో బాంబు ప్రయోగం జరిగింది. ఒక పోలీసు సార్జెంట్ చనిపోయాడు. అది సాకుగా తీసుకొని పోలీసులు నిరాయుధులైన ప్రజలపై తుపాకులతో.. సన్నీలతో స్వైరవిహారం చేశారు. అయినప్పటికీ నిరాయుధులైన కార్మికులు సంఘటితంగా చైతన్యదీప్తితో పోలీసులతో బాహాబాహిగా తలపడ్డారు. ఈ సంఘర్షణలో ఏడుగురు పోలీసులు చనిపోగా.. నలుగురు కార్మికులు నేలకొరిగారు. పాలకులు అదనపు బలగాలను రంగంలోకి దించారు. హే మార్కెట్ ప్రాంతం కార్మికుల రక్తంతో తడిసిపోయింది. అక్కడే ఆవిర్భవించింది ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది శ్రమజీవుల స్వేచ్ఛా సంకేతమైన "అరుణపతాకం".

హే మార్కెట్ ఉదంతాన్ని పురస్కరించుకొని బూర్జువా ప్రభుత్వం కార్మికోద్యమ నాయకులను చుట్టివేసే కార్యక్రమం ప్రారంభించింది. న్యాయస్థానం ముందు విచారణా తతంగం జరిపి సార్సన్, స్పిన్, పిషర్, ఏంగెల్ అనే కార్మిక నాయకులను ఉరి తీయించింది. మరికొందరిని దీర్ఘకారాగార శిక్షలకు గురిచేసింది. తనను ఉరితీసే ముందు స్పిన్ ఇలా అన్నారు. "మమ్మల్ని ఉరితీస్తే మంటలు ఆరిపోతాయనుకుంటున్నారా? ఇదిగో అక్కడ, ఇక్కడ, ఆమూలు, ఈమూల, మీ వెనుక, మీ ముందు అన్నిచోట్లా జ్వాలలు చెలరేగుతాయి. అది అంతర్వాహిని. దాన్ని ఆర్పడం మీ తరంకాదు". దేశమంతా ఇతర కేంద్రాల్లో కూడా ఈ దమనకాండ కొనసాగింది. అయినప్పటికీ అమెరికన్ కార్మికుల్లో మాత్రం మే1న విప్లవ చైతన్యం వెల్లివిరిసింది. ప్రతి కార్మికుడూ వర్గ చైతన్యాన్ని ప్రదర్శించడానికి వీధుల్లోకి వచ్చాడు. ఆ విధంగా 1886 మే 1న ప్రపంచ కార్మిక వర్గ విప్లవ చరిత్రలో రక్తాక్షరాలతో లిఖించదగిన తేదీగా మారిపోయింది. ఆనాటి పోరాటోద్యమానికి చికాగో నగరమే కేంద్రమయినప్పటికీ దేశంలోని అనేక ముఖ్య నగరాలకు ఆ ఉద్యమం వ్యాపించింది. న్యూయార్క్, బాల్టిమోర్, వాషింగ్టన్, పిట్స్‌బర్గ్, డిట్రాయిడ్ మొదలైన పెద్ద నగరాల్లోని శ్రామికులు కూడా మహోత్తేజంగా పోరాటంలోకి దూకారు. ప్రపంచవ్యాప్తంగా శ్రమజీవులను ఉత్తేజపరిచి వారిలో ఆశాజ్యోతిని వెలిగించింది మే దినోత్సవం.

- యు.రామకృష్ణ